ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్

: fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

8-8-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 188 పేజీలు: 10+4 వెల: 6.50


వారసుడిపై స్పష్టత ఇచ్చిన ట్రంప్

ఓటర్ల జాబితా ముసాయిదాపై అభ్యంతరాలు రాలేదు 5

## హైదరాబాద్‌లో కుండపోత

**భారీగా ట్రాఫిక్ జామ్**

**లోతట్టు ప్రాంతాలు జలమయం**

**తక్షణమే సహాయక చర్యలు చేపట్టాలని సిఎం రేవంత్ ఆదేశం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు7:** రాష్ట్రంలో హైదరాబాద్‌తో సహా పలు జిల్లాల్లో గురువారం అర్ధరాత్రి వరకు భారీ వర్షాలు ముంచెత్తాయి. కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో హైదరాబాద్ మహానగరం తడిసి ముద్దయింది. గురువారం సాయంత్రం నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న ఈ వర్షం కారణంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. అలాగే పలు ప్రాంతాలు నీట మునిగాయి. ఒకవైపు వర్షం, మరోవైపు ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇక్కట్లు >>2




గురువారం హైదరాబాద్ మలక్‌పేట మెట్రోస్టేషన్ వద్ద వరదనీటిలో ప్రజల అవస్థలు

## 20 వేల డాలర్లకే గ్రీన్‌కార్డు!




**వాషింగ్టన్, ఆగస్టు 7:** అమెరికాలో శాశ్వత నివాసం కోసం జారీ చేసే గ్రీన్‌కార్డులను పొందడం కోసం భారత్ సహా చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ దేశస్థులు యేళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. దానికి చెక్ పెట్టేలా ఓ షార్ట్‌కట్ మార్గాన్ని అమెరికా ప్రభుత్వం ప్రతిపాదించింది. గ్రీన్‌కార్డు కోసం 10 యేళ్లుగా ఎదురుచూస్తున్న వారు 20 వేల డాలర్లు (రూ. 17.5 లక్షలు) చెల్లిస్తే త్వరగా వారి దరఖాస్తును పరిశీలించే అవకాశాన్ని ఆ ప్రతిపాదిత బిల్లులో పేర్కొంది. డిగ్నిటీ యాక్ట్ ఆఫ్ 2025 పేరిట ఆ బిల్లును తీసుకువచ్చారు. 'దశాబ్దాలుగా నలుగుతోన్న సమస్యకు పరిష్కారం >>2

## కాళేశ్వరం సర్వే వ్యయం 6.77 కోట్లు రికవరీ చేయండి



**వ్యాప్కోస్ సర్వే ప్రామాణికంగా తీసుకోకుండానే కాళేశ్వరం నిర్మాణాలు**

**పిసి ఘోష్ కమిషన్ సిఫారసులు**

**హైదరాబాద్,ఆగస్టు 7,ప్రభాతవార్త:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ బ్యారేజిల నిర్మాణంలో వ్యాప్కోస్ సర్వే సూచనలు పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నిర్మాణాలు చేశారని జస్టిస్ పిసిఘోష్ విచారణలో తేల్చేసింది. వ్యాప్కోస్ కు సర్వేకోసం చెల్లించిన రూ.6,77,67,000 బాధ్యుల నుంచి వసూలు చేయాలని జస్టిస్ పిసిఘోష్ కమిషన్ తుది నివేదికలో సూచించింది. వ్యాప్కోస్‌కు చెల్లించిన రూపాయలు ఎవరి నుంచి రికవరీ చేస్తారనే అంశంపై అనేక ఊహాగానాలతో చర్చ వాడివేడిగా కొనసాగుతోంది. ఈ నిధులను రికవరీ చేయడానికి ప్రభుత్వం ఏ విధంగా ముందుకు పోతుందని సర్వత్రా ఉత్కంఠత నెలకొంది. వాప్కోస్ నివేదికలో కూడా స్పష్టత లేకపోవడం రికవరికి ఉత్తర్వులు జారీచేసినా బాధ్యులుగా ఎవరిపై నింద మోపుతారో వారు కూడా వెంటనే చెల్లించక >>2

## 42 శాతం బిసి రిజర్వేషన్లకు ఆ రెండు పార్టీలే అడ్డు

**బిజెపి, బిఆర్ఎస్ తప్పుడు నిర్ణయాలను ప్రశ్నిస్తాం**

**మతపరమైన రిజర్వేషన్లకు రాజ్యాంగంలోనే తావు లేదు**

**మోడీ రాష్ట్రపతి అప్పాయింట్‌మెంట్ ఇవ్వకుండా చేశారు**

**ఢిల్లీలో మంత్రులతో కలిసి మీడియాతో సిఎం రేవంత్**



న్యూఢిల్లీలో గురువారం మీడియాతో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో మంత్రులు, పిసిసి చీఫ్ తదితరులు

**స్థానిక ఎన్నికలు ఆపితే కేంద్రాన్ని నిధులు అడుగుతాం** 2

**మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు7:** బలహీనవర్గాల హక్కులను కాలరాయడానికి బీజేపీ మొదటి నుంచి ఇప్పటి వరకు కుట్రలు చేస్తూ వస్తోందని. ఆనాడు మండల్ కమిషన్ ద్వారా బీసీలకు న్యాయం చేయాలనుకుంటే కమండల్ కమిషన్ ను తీసుకొచ్చిందని, రథ యాత్ర పేరుతో దేశంలో ఉద్రిక్త పరిస్థితులు కల్పించి ఆనాటి మండల్ కమిషన్ అమలును బీజేపీ అడ్డుకుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులతో కలిసి సిఎం మాట్లాడారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నపుడు ఐఐటీ, ఐఐఎం, సెంట్రల్ యూనివర్సిటీలలో బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని నిర్ణయం తీసుకుంటే, యూత్ ఫర్ ఈక్వాలిటీ పేరుతో బీజేపీ ఆ రిజర్వేషన్లు కూడా అడ్డుకుందని, కానీ మన్మోహన్ >>2



## 'మహా' ఫలితాలతో ఓట్ల చౌర్యం నిజమైంది

**-రాహుల్ గాంధీ**

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** ఎన్నికల సంఘంపై మరోసారి తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు చూసిన తర్వాత అసెంబ్లీ ఎలక్షన్‌లో ఓట్ల చౌర్యం జరిగిందనే అనుమానం నిజమైందని అన్నారు. యంత్రాలు తనిఖీ చేసే ఓటర్ లిస్ట్ తమకు ఇవ్వలేదని, దొంగ ఓట్ల కోసం బీజేపీతో ఈసీ కలిసిపోయిందని ఆరోపించారు. కర్ణాటకలోని మహాదేవపుర నియోజకవర్గంలోని 6.5లక్షల ఓట్లలో దాదాపు లక్ష ఓట్లు చోరీకి గురయ్యాయని ఆరోపించారు. డూప్లికేట్ ఓటర్లు, తప్పుడు అడ్రస్ ఉన్న ఓట్లు ఉన్నట్లు తమ పరిశీలనలో తేలిందని చెప్పారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా అధికారంలో ఉన్న పార్టీతో కలిసి ఈసీ భారీ మోసానికి తెరదించిందని విమర్శించారు. దేశంలో కొంతకాలంగా ఎగ్జిట్‌పోల్స్, ఒపీనియన్ పోల్స్‌కు వ్యతిరేకంగా ఎన్నికల ఫలితాలు వెలువడటంపై అనుమానం వ్యక్తం >>2

## 'ఎన్‌హెచ్‌ఎంఐ, ఎంఒఆర్‌టిహెచ్' పనులపై టాస్క్‌ఫోర్స్ కమిటీ

**విద్యుత్ లైన్ షిఫ్టింగ్, వాటర్ యుటిలిటీ క్లియరెన్స్, ఫారెస్ట్ క్లియరెన్స్ పనుల్లో వేగం పెంచండి**

**రెండు మూడు నెలల్లో 'ట్రిపులార్' పనులకు కసరత్తు**

**రోడ్లు భవనాల మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**



గురువారం హైదరాబాద్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు7,ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా కొత్తగా చేపట్టిన ఎన్ హెచ్ఎంఐ, ఎంఒఆర్‌టిహెచ్ ప్రాజెక్ట్స్ రోడ్ నెట్వర్క్ మౌళిక వసతులు నిర్మాణంలో వేగం పెంచడానికి టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసుకున్నామని మరో మూడు నెలలలో ఆరు వరుసల రీజినల్ రింగ్‌రోడ్ పనులు ప్రారంభించేందుకు వీలుగా అన్ని అవకాశాలను ఉపయోగించుకొంటున్నామని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఆర్ అండ్ బిశాఖ మంత్రి చైర్మన్‌గా, ఆర్ అండ్‌బిస్పెషల్ సిఎస్, సిసిఎల్ఎ కమిషనర్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఇరిగేషన్, పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్మెంట్, మైన్స్, జియాలజి, పిసిసిఎఫ్, ఎన్ హెచ్ ఎంఐ, ఎంఒ ఆర్‌టిహెచ్ రీజినల్ ఆఫీసర్స్, ఆర్ అండ్ బి ఎన్ హెచ్ చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ఆర్‌అండ్‌బి టాస్క్ ఫోర్స్ కమిటీ పనిచేయనుందని ఆయన వెల్లడించారు. విద్యుత్ లైన్ షిఫ్టింగ్, వాటర్ యుటిలిటీ క్లియరెన్స్, ఫారెస్ట్ క్లియరెన్స్ సంబంధిత అంశాలపై గురువారం డా.బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సుదీర్ఘంగా మూడు గంటల పాటు మంత్రి అధ్యక్షతన టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డికి ఇరిగేషన్ శాఖ కు సంబంధించి వరంగల్ ఖమ్మం సెక్షన్ లో ఎన్‌హెచ్ 163 జి పరిధిలోని ప్యాకేజీ 2లో చెరువుల అంశాన్ని మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో ఎన్‌హెచ్ అధికారులు వివరించారు. మహబూబాబాద్, నెల్లికుదురు ప్రాంతంలో చెరువుల సమస్యలు దాంతో పాటు హై లెవల్ బ్రిడ్జి ప్రపోజల్స్ పై వివరించారు. ఇరిగేషన్ శాఖ నుండి నిరభ్యంతర ధృవీకరణ పత్రం వస్తే హైలెవల్ బ్రిడ్జిల ప్రతిపాదనలు ముందుకు పోతాయని దీనికోసం సమిష్టిగా ప్రయత్నం చేద్దామని మంత్రి సూచించారు. ఎన్ హెచ్ 30 సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రోడ్డుతో పాటు గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డుకు సంబంధించి పలు సమస్యలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో మాట్లాడి ఇరిగేషన్ శాఖ ఇబ్బందులు ఏమైనా ఉంటే ప్రత్యేక చొరవ తీసుకుని మాట్లాడి పరిష్కరిస్తానని మంత్రి వెంకటరెడ్డి భరోసా ఇచ్చారు. ఫారెస్ట్ క్లియరెన్స్ కు సంబంధించిన అంశాలు ప్రధానంగా మంత్రి దృష్టికి తెచ్చారు. >>2

**రైతు ప్రయోజనాలపరంగా రాజీ ప్రశ్నేలేదు!** 5 **ఎంతటి మూల్యం చెల్లించుకునేందుకైనా నేను సిద్ధమే: ప్రధాని మోడీ**



## ముస్లింలకు 10% రిజర్వేషన్లు తీసేయాలి!

**మతపరమైన రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం**


**ఒవైసీ, అజారుద్దీన్, షబ్బీర్ అలీ వంటి వారు బిసిలు ఎలా అవుతారు?: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు నుంచే అడుగడుగునా అబద్ధాలు చెప్పడం, అనేక రకాల అమలు చేయలేని హామీలు ఇవ్వడం, 6 గ్యారంటీలు 420 సబ్ గ్యారంటీలతో ఆశచూపి.. అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క హామీని అమలుచేయలేని నిస్సహాయ పరిస్థితుల్లో, పాలనలో వైఫల్యంతో, చేతకానితనంతో, అప్పులు తీర్చేందుకు అప్పులు చేస్తూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను అథ:పాతాళానికి తొక్కేశారంటూ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం న్యూఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ మతపరమైన రిజర్వేషన్లకు బిజెపి వ్యతిరేకం అని స్పష్టం చేశారు. ముస్లింలకు 10శాతం రిజర్వేషన్లను తీసివేస్తే, తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల విషయంలో తాను వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుంటానని చెప్పారు. అసదుద్దీన్ ఓవైసి, అజరాద్దున్, షబ్బీర్ అలీ వంటి వారు బీసీలు ఎలా అవుతారని ప్రశ్నించారు. ప్రజల దృష్టిని తమ ప్రభుత్వ వైఫల్యాలనుంచి మళ్లించే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం మీద, బిజెపి మీద, మోడీ మీద అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారన్నారు. తెలంగాణలో ఇచ్చిన హామీలకు రేవంత్‌తో పాటుగా రాహుల్ గాంధీ, సోనియాగాంధీ పూర్తి బాధ్యత వహించాలన్నారు. మైనార్టీ డిక్లరేషన్, యూత్ డిక్లరేషన్, బిసి డిక్లరేషన్ పేర్లతో ఆయా వర్గాలను మోసం చేశారని, అధికారంలోకి వచ్చి.. దేన్ని కూడా డెడికేషన్‌తో అమలు చేయలేదన్నారు. బిసి కోసం లక్ష కోట్లు ఇస్తామన్నారు. ఈ రెండేళ్లలో 40వేల కోట్లు ఖర్చుపెట్టాలి కదా.. మరి అవన్నీ చేశారా?అవేవీ చేయకుండా.. ఢిల్లీ బాటపట్టి, అర్థంలేని విమర్శలు చేస్తున్నారు. ఈ 18 నెలల్లో ఢిల్లీ ప్రదక్షిణ తప్ప తెలంగాణకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. బిసి సామాజిక కులాలకు, బిసి డిక్లరేషన్‌లో.. అనేక రకాల హామీలు ఇచ్చి.. దేన్ని కూడా అమలు చేయలేదు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ అద్దాలమేడలో కూర్చుని ఇతరులపై రాళ్లు రువ్వే ప్రయత్నం చేస్తున్నారుని, బిసికు సామాజిక సాధికారత కల్పించే ప్రయత్నంలో కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదని తెలంగాణ సమాజం అర్థం చేసుకుందన్నారు. మోడిని గద్దెదించేందుకు రేవంత్ రెడ్డి శిలాశాసనం రాస్తున్నామన్నారు.. మీరు అధికారంలో ఉన్న 3 రాష్ట్రాల్లో ఏ ఒక్క రాష్ట్రంలో గెలిచినా.. రాహుల్ గాంధీ ఏం చెప్పినా చేసేందుకు నేను సిద్ధమన్నారు. తిరిగి గెలిపించుకునే సత్తా కాంగ్రెస్‌కు, రాహుల్ గాంధీకి లేదు. వరుసగా 3 పార్లమెంటు ఎన్నికల్లో ఓడిపోయారు. వివిధ రాష్ట్రాల్లో అడ్రస్ లేకుండా పోయింది. అలాంటి మీరు.. మోడీకి సవాల్ విసరడం అంటే సూర్యుడిపై ఉమ్మేసినట్టే.. అలా చేస్తే మీ మీదే పడుతుందనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. తెలంగాణలో ఇప్పటికే ప్రజలు మరణ శాసనం రాశారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసినందుకు ప్రజలు పశ్చాత్తాపం పడుతున్నారు. జంతర్ మంతర్ సభ.. సోనియా కుటుంబాన్ని పొగడటానికి, మోడీని తిట్టేందుకే పెట్టుకున్నారు. సభ కోసం >>2

## అమెరికాకు తగ్గనున్న ఎగుమతులు

**యుఎస్ మార్కెట్‌లో భారత్ ఉత్పత్తుల ధరలు పెరుగుదల**

**ట్రంప్ సుంకాలతో కీలక రంగాలపై పెనుప్రభావం**




**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** అమెరికా విధించిన 50 శాతం అదనపు టారిఫ్‌ల కారణంగా భారతదేశంలోని ఎగుమతి రంగాలు తీవ్ర ప్రభావానికి గురవుతాయి. ముఖ్యంగా తోళ్లు, రసాయనాలు, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, వస్త్రాలు, రొయ్యలు వంటి రంగాలపై ఇది తీవ్ర ప్రభావం చూపుతుందని పరిశ్రమ నిపుణులు అంటున్నారు. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్న ట్రంప్ భారత వస్తువులపై 25 శాతం అదనపు టారిఫ్ విధించారు. దీంతో ఇప్పటికే ఉన్న సుంకాలతో కలిపి మొత్తం డ్యూటీ 50 శాతానికి చేరుకుంది. రష్యా నుంచి చమురు కొంటున్న చైనా, టర్కీ వంటి ఇతర దేశాలపై మాత్రం అమెరికా ఇలాంటి చర్యలు తీసుకోలేదు. దీని వల్ల అమెరికా మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తుల ధరలు గణనీయంగా పెరుగుతాయి. జీటీఆర్‌ఐ అనే థింక్ ట్యాంక్ నివేదిక ప్రకారం ఈ టారిఫ్‌ల వల్ల అమెరికాకు భారతదేశం నుంచి ఎగుమతులు 4050 శాతం తగ్గే అవకాశం ఉంది. కొత్త టారిఫ్‌ల వల్ల వివిధ రంగాలపై ప్రభావం ఎక్కువ ఉంటుంది. ఆర్గానిక్ రసాయనాలు: 54 శాతం అదనపు డ్యూటీ,కార్పెట్లపై 52.9 శాతం, వస్త్రాలు (అల్లిన): 63.9 శాతం, వస్త్రాలు (నేత): 60.3 శాతం, వస్త్రాలు మేడ్ అప్స్ 59 శాతం, వజ్రాలు, బంగారం, ఉత్పత్తులపై 52.1 శాతం, యంత్రాలు, యాంత్రిక ఉపకరణాలపై 51.3 శాతం, ఫర్నిచర్, పరుపులు ఉత్పత్తులపై 52.3 >>2

## పాలన గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కార్

**స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం తప్పదు**

**రైతు మహాధర్నాలో మాజీ మంత్రులు హరీష్ రావు, నిరంజన్ రెడ్డి**



**మెదక్ టౌన్, ఆగస్టు 7, ప్రభాత వార్త:** మెదక్ పట్టణంలోని జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్ వద్ద గురువారం బిఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో రైతు మహాధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ మంత్రులు హరీష్ రావు, నిరంజన్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణలో రైతులు కలెక్టరేట్ల >>2



న్యూఢిల్లీలో గురువారం ఎం.ఎస్.స్వామినాథన్ శతాబ్ది అంతర్జాతీయ సదస్సులో పోస్టల్ స్టాంపును విడుదల చేస్తున్న ప్రధాని మోడీ

## రిజర్వేషన్లు తీసేయాలి!

>> ఎన్నో ప్రగల్భాలు పలికారు. పార్టీ పెద్దలందరూ వస్తారన్నారు. కానీ చివరకు ఢిల్లీలో కూడా పార్టీ ముఖ్యనాయకులెవరూ కనీసం కన్నెత్తి కూడా చూడలేదు. 31 నిమిషాల ఉపన్యాసంలో.. సోనియా కుటుంబాన్ని పొగిడేందుకు.. మోడీని తిట్టేందుకే ఎక్కువ సమయం కేటాయించారు. బిసిలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో న్యాయబద్ధంగా చర్చించి ఇచ్చే ప్రయత్నం చేయాలి కానీ.. రేవంత్ రెడ్డి రాజకీయంగా, పాలనలో, ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంలో వైఫల్యం చెందారు. కానీ అవినీతిలో మాత్రం బిఆర్ఎస్‌తో పోటీ పడుతుందన్నారు. నాడు కెసిఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రైవేట్ లిమిటెడ్ సంస్థగా మార్చి హోల్ సేల్ అవినీతి చేస్తే.. కాంగ్రెస్ పార్టీ రిటెయిల్‌గా అవినీతికి పాల్పడుతుందన్నారు. అవినీతిలో అగ్రస్థానం, అప్పుల్లో అగ్రస్థానంలో ఇవాళ తెలంగాణ రాష్ట్రం ఉందన్నారు. గతంలో తెలంగాణ రాష్ట్రంలో.. స్థానిక సంస్థల్లో 34శాతం రిజర్వేషన్ బిసిలకు అమలైంది. దాన్ని కెసిఆర్ 27శాతానికి తగ్గించారు. ఆయన 12శాతం ముస్లిం రిజర్వేషన్ ఇచ్చేందుకు అనేక రకాల కుట్రలు కుతంత్రాలు చేశారు. మజ్లిస్ కనుసన్నల్లో 12శాతం బిసి రిజర్వేషన్లను ముస్లింలకు ఇచ్చే ప్రయత్నం జరిగిందన్నారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కూడా 34శాతం ఉన్న రిజర్వేషన్‌ను 32శాతంకు తగ్గించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. బిసి జనాభా ప్రాతిపదికన 42శాతం ఉండాల్సిన బిసి రిజర్వేషన్‌కు అన్యాయం చేశారు. సర్వేలోనూ అనేక రకాల తప్పులు చేశారు. కేంద్ర మంత్రి వర్గంలో 27 మంది ఓబిసిలకు, 12 మంది ఎస్సీలకు, 8 మంది ఎస్టీలకు, ఐదుగురు మైనార్టీలకు అవకాశం కల్పించిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వం అన్నారు.

## టాస్క్‌ఫోర్స్ కమిటీ

>> ఎన్‌హెచ్ ప్రాజెక్ట్స్ 12 ఉంటే అందులో 6 ప్రాజెక్టులు ఫారెస్ట్ క్లియరెన్స్ లేక పెండింగ్ లో ఉన్నాయని అధికారులు వివరించారు. ఫారెస్ట్ అధికారులు క్లియరెన్స్ కోసం వెంటనే చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. కల్వకుర్తి శ్రీశైలం 62 కి.మీ ఎలివేటెడ్ కారిడార్ కు కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా ఉన్నారనీ, ఫారెస్ట్ అధికారులు అందుకు తగ్గట్టుగా సమన్వయంతో పనిచేస్తే గొప్ప ప్రాజెక్ట్ పూర్తి చేసిన సంతృప్తి ఉంటుందని తెలిపారు. విద్యుత్‌శాఖతో సమన్వయంగా ఉంటే హైటెన్షన్ స్థంబాలు తీగల తొలగింపు కూడా త్వరగా పూర్తిచేసుకోవచ్చని మంత్రి సూచించారు. 220కెవి, 400కెవి లైన్ సమస్యలతో పాటు, 33కెవి, 11కెవి లైన్ షిఫ్టింగ్ సమస్యలున్నాయని అధికారులు మంత్రికి వివరించారు. ఏ ఏ ప్రాంతంలో ఏ సమస్య ఉందో వివరాలు ఇవ్వాలని, వాటిని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారి ముషారఫ్ ఆలీకి బాధ్యతలను మంత్రి అప్పగించారు. మైనింగ్ డిపార్ట్ మెంట్ నుండి కొన్ని అనుమతులు రావాల్సి ఉందని అధికారులు వివరించగా సంబంధిత అధికారి శ్రీధర్ కు పనులు వెంటనే క్లియర్ చేసేలా చొరవ తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రధానంగా భూసేకరణలో భాగంగా రెవెన్యూ కు సంబంధించిన అంశాలే ఎక్కువ ఉన్నాయని వాటిని వెంట వెంటనే పరిష్కరించేందుకు సిసి ఎల్ ఏ కమిషనర్ లోకేష్ కృషి చేయాలన్నారు. కొన్ని చోట్ల సున్నిత అంశాలు ఉంటాయని వాటి పట్ల మానవతా దృక్పథంతో అధికారులు మెదలాలని సూచించారు. అన్ని శాఖల అధికారులతో సుదీర్ఘంగా చర్చించిన మంత్రి ఇక నుండి రెగ్యులర్ గా భేటి అవుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామన్నారు. టి ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ సూచనల మేరకు ఈనెల 18న మరోమారు భేటీ అవుదామని, ఆయా జిల్లా కలెక్టర్లు హాజరు అయ్యేలా చూడాలని మంత్రి చెప్పారు. తర్వాతి మీటింగ్ కు ఇప్పుడు వచ్చిన అంశాల పై క్లారిటీ వచ్చేలా సంబంధిత కలెక్టర్లు, ఆర్డీవో లను తను కో ఆర్డినేట్ చేస్తానని స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్ తెలిపారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పనిచేస్తేనే టాస్క్ ఫోర్స్ బాగా పని చేసినట్టు అవుతుందని, ఇవాళ చర్చించిన అంశాలు త్వరగా పూర్తి అయ్యేలా నిబద్ధతతో పనిచేయాలని కోరుతున్నానని మంత్రి అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణ కు మణిహారమణి, రెండు మూడు నెలల్లో పనులు ప్రారంభించాలానే చిత్తశుద్ధి తో ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. ఉత్తర భాగం భూసేకరణ దాదాపు పూర్తి అయింది. సిక్స్‌లేన్ గా అప్గ్రేడ్ చేయడం వల్ల పనులు ఆలస్యం అయ్యాయన్నారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, భువనగిరి జిల్లాల్లో అక్కడక్కడ ఉన్న చిన్న సమస్యలు పరిష్కరించాలని అన్నారు. భూ పరిహారం చెల్లింపు ప్రక్రియ వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తమకు రాజకీయాల కంటే రాష్ట్రాభివృద్ధే ముఖ్యమని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పునరుద్ఘాటించారు. రాష్ట్ర ప్రాజెక్టుల క్లియరెన్స్ కోసం త్వరలో ప్రధాని మోడీని కలుస్తామని మంత్రి ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ టాస్క్ ఫోర్స్ కమిటీ సమీక్షలో రాష్ట్ర స్పెషల్ సి.ఎస్ వికాస్ రాజ్, పిఆర్ అండ్ ఆర్ డి, మైనింగ్ శాఖల సెక్రటరీ ఎన్ శ్రీధర్‌సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్ కుమార్, విద్యుత్ శాఖ అధికారి ముషారఫ్ అలీ, అటవీ శాఖ అధికారి శరవణన్, ఎన్ హెచ్ ఎం ఐ , ఎం ఒ ఆర్ టి హెచ్ రీజినల్ ఆఫీసర్స్ కృష్ణ ప్రసాద్, శివ శంకర్, నీటిపారుదల శాఖ సి.ఈ లు హారనాథ రావు, శ్రీనివాసరెడ్డి, ఆర్ అండ్ బి ఈఎన్సి జయ భారతి, సి.ఈలు, పలువురు అధికారులు, రైల్వే అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 20 వేల డాలర్లకే గ్రీన్‌కార్డు!

>> చూపేందుకు ఈ బిల్లును ప్రవేశపెట్టాం' అని చట్టసభ సభ్యురాలు మారియా ఎల్విరా సలజార్ పేర్కొన్నారు. ఇమిగ్రేషన్ చట్టాల ప్రకారం అమెరికా యేటా.. 2,26,000 ఫ్యామిలీ ప్రిఫరెన్స్, 1,40,000 ఉపాధి ఆధారిత గ్రీన్‌కార్డులను జారీ చేసేందుకు వీలుంటుంది. ఈ 20 వేల డాలర్ల ప్రీమియం ప్రాసెసింగ్ ఫీ ద్వారా గ్రీన్‌కార్డు బ్యాక్‌లాగ్‌లను క్లియర్ చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఉపాధి కోసం అగ్రరాజ్యానికి వెళ్లి అక్కడే శాశ్వతంగా స్థిరపడాలనుకునే వలసదారులకు అమెరికా పర్మనెంట్ రెసిడెంట్ కార్డు (గ్రీన్‌కార్డు)లను ఇస్తుంటుంది. అయితే, ఒక్కో దేశానికి నిర్ణీత సంఖ్య(కోటా)లో మాత్రమే వీటిని జారీ చేస్తుంటారు. మొత్తం దరఖాస్తుల్లో ఒక్కో దేశానికి కేవలం 7 శాతం మాత్రమే కేటాయించాలన్నది ప్రస్తుత విధానం. అయితే ఈ బిల్లులో దానిని 15 శాతానికి పెంచారు. అలాగే అమెరాకు వర్క్‌పర్మిట్‌పై వచ్చిన దంపతుల పిల్లలు (డ్రీమర్ల)కు శాశ్వత నివాస హోదా పొందడానికి ఈ ప్రతిపాదిత బిల్లు వీలు కల్పిస్తుంది. కాగా.. భారత్, చైనా, మెక్సికో, ఫిలిప్పీన్స్ వంటి దేశాల నుంచి గ్రీన్‌కార్డుల కోసం విపరీతమైన పోటీ ఉంటుంది. యేటా లక్షల మంది వీటి కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు.

## స్థానిక ఎన్నికలు ఆపితే కేంద్రాన్ని నిధులు అడుగుతాం

### మీడియాతో చిట్‌చాట్‌లో సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు7:** బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లు కోసం పోరాడుతామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రపతి స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నామని చెప్పారు. ఆమె సమయం ఇవ్వలేదంటే ప్రధాని ఒత్తిడి చేసినట్టు భావించాల్సి ఉంటుందిని రేవంత్ స్పష్టం చేశారు. 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ఉన్న మార్గాలన్నింటిని ప్రయత్నించామన్న రేవంత్ రెడ్డి కుదరనప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల్లో స్థానిక ఎన్నికలకు వెళ్లాలన్నారు. గురువారం దిల్లీలో ఆయన మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నామ న్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు తమ వద్ద 3 మార్గాలు ఉన్నాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. 50 శాతం సీలింగ్‌పై గత ప్రభుత్వం తెచ్చిన చట్టాన్ని పక్కన పెట్టి జీవో ఇవ్వాలని అన్నారు. జీవో ఇస్తే ఎవరైనా న్యాయస్థానానికి వెళ్తే స్టే వస్తుందని, జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లే మొదటి మార్గం సాధ్యం కాదని ఆయన వివరించారు. ఇప్పుడే స్థానిక ఎన్నికలు పెట్టకుండా ఆపడం రెండో మార్గమని రేవంత్ చెప్పారు. స్థానిక ఎన్నికలు ఆపితే కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆగుతాయన్నారు. కేంద్ర నిధులు రాకుంటే గ్రామాల్లో వ్యవస్థలు కుప్పకూలుతాయని వివరించారు. మూడవ మార్గం పార్టీ పరంగా బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వడమని రేవంత్ అన్నారు. బీసీలకు 42శాతం సీట్లపై ఇతర పార్టీలపైనా ఒత్తిడి తెస్తామని ఆయన వెల్లడించారు. విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లలో మాత్రమే ఏబీసీడీ వర్గీకరణ ఉందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయ రిజర్వేషన్లలో ఉపవర్గీకరణ లేదని వెల్లడించారు. బీసీలందరికీ కలిపి 42 శాతం రిజర్వేషన్లు చేశామన్న ఆయన ఒక వర్గానికి ప్రత్యేకంగా రిజర్వేషన్లు లేవని వివరించారు. కిషన్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ముందుగా చట్టం చదవాలి అని హితవు పలికారు. రాజకీయంగా ఓబీసీ రిజర్వేషన్లలో వర్గీకరణ లేదని ఆయన తెలిపారు. బీసీఈ వర్గానికి ఇప్పటికే 4శాతం రిజర్వేషన్లు ఉన్నాయన్న రేవంత్ రెడ్డి కొత్తగా 10 శాతం రిజర్వేషన్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు.

## వారం - వర్జ్యం

8-08-2025, శుక్రవారం (వరలక్ష్మీ వ్రతం)
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
శ్రావణ మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం
చతుర్దశి మ.2.08
ఉత్తరాషాఢ మ.2.24
వర్జ్యం : సా.6.23-7.59
దు.ఉ.8.24-9.15, 2) మ.12.40-1.31
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం :** భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. దైవ సందర్శనం చేసుకుంటారు.

**వృషభం :** ఆర్థికలావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. సన్నిహితుల నుండి ముఖ్యమైన సమాచారం అందుకుంటారు.

**మిథునం:** ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. కుటుంబసభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**కర్కాటకం:** దూరపు బంధువులనుండి ఆహ్వానాలు అందుకుంటారు. కోర్టు వివాదాలనుండి బయటపడతారు.

**సింహం:** తండ్రినుండి ఆస్తి లాభం పొందుతారు. వృత్తి, వ్యాపారలు విస్తరిస్తారు.

**కన్య :** ఉద్యోగులకు పదోన్నతులు లభిస్తాయి. ధన, వస్తు లాభాలు పొందుతారు.

**తుల :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**వృశ్చికం:** దూరప్రాంతాలనుండి అనుకోని ఆహ్వానాలు అందుకుంటారు. వస్తువుల కొనుగోలు.

**ధనుస్సు:** వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహకరంగా వుంటుంది. వాహనయోగం పొందుతారు.

**మకరం:** ఆస్తి విషయంలో నూతన ఒప్పందాలు కుదుర్చుకుంటారు. సోదరుల కలయిక.

**కుంభం:** సహోదర, సహోదరీ వర్గంతో మాటపట్టింపులు రాకుండా జాగ్రత్తలు పాటించండి.

**మీనం :** క్రీడారంగా యందు ఆసక్తి కలిగి ఉంటారు. దీర్ఘకాలిక ఋణాలు తీరి ఊరటచెందుతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఆ రెండు పార్టీలే అడ్డు

>> సింగ్, సోనియాగాంధీ ఆ రిజర్వే షన్లను అమలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు మేం మొదలు పెట్టిన ఓబీసీ రిజర్వేషన్ల పెంపును అడ్డుకోవాలని చూస్తున్నారు బీసీ రిజర్వేషన్లలో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారంటూ బీజేపీ వితండ వాదం చేస్తోందని ఆరోపించారు. మేం పంపించిన బిల్లుల్లో ఏదైనా మతానికో, కులానికో రిజర్వేషన్ ఉందా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లు ఎన్ బ్లాక్‌గా కేటాయి స్తారని, కులాలు, ఉపకులాల రిజర్వేషన్లు ఎక్కడా లేవు ఇప్పటి వరకు జరగలేదని స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఏదేదో మాట్లాడుతున్నారు వారు చట్టాన్ని చదివారో లేదో, లేక రాజకీయ ప్రేరేపిత ఉద్దేశంతో మాట్లాడుతున్నారో నాకు తెలియదని పేర్కొన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తున్నారు కాబట్టి 42శాతం బీసీ రిజర్వేషన్లను అడ్డుకుంటామని వితండవాదం చేస్తున్నారు. 2017లో రాజస్థాన్ నుంచి అబ్దుల్ సత్తార్ ఒక వెనకబడిన ముస్లిం అయినా యూపీఎస్ లో ఓబీసీ రిజర్వేషన్ సాధించాడు. 1971 నుంచి నూర్ బాషా, దూదేకుల, ఇతర వివిధ వృత్తులను చేసే ముస్లింలకు చట్టంలోనే రిజర్వేషన్లు ఉన్నాయి, ఆ రిజర్వేషన్లు ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యాలయం ఉన్న మహారాష్ట్రలో ఉన్నాయని పేర్కొన్నారు. మోదీ జన్మించిన గుజరాత్‌లో ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్లు ఉన్నాయి. మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తర్ ప్రదేశ్ లో ఉన్నాయి. మీరే కేంద్రంలో ఉండి ఆ రాష్ట్రాల్లో ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్లకు అనుమతిస్తున్నారు అని చెప్పారు. ముస్లింలకు ఓబీసీ రిజర్వే షన్లు ఇచ్చానని నరేంద్ర మోదీ ఓ ఇంటర్వ్యూలో స్వయంగా చెప్పారని పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక వెనకబాటు ఆధారంగా రిజర్వేషన్లు నిర్ణయింపబడతాయి, మతాల ప్రాతిపదికన రిజర్వేషన్లకు రాజ్యాంగంలోనే తావు లేదు, మేం అలాంటి రిజర్వేషన్లు చేయలేదు అని స్పష్టం చేశారు. ముస్లింల సాకుతో బీజేపీ ఓబీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూస్తోంది, బీఆరెస్ శిఖండి పాత్ర పోషిస్తోంది. ఎలాగైనా కాంగ్రెస్ ను దెబ్బతీయడానికి బీజేపీతో బిఆర్ఎస్ నేతలు అంటకాగుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ చేస్తున్న తప్పిదాలను బీఆరెస్ ఎందుకు ప్రశ్నిచడంలేదు? ఎందుకు ఢిల్లీలో జరిగిన మహా ధర్నాలో బీఆరెస్ రాజ్యసభ సభ్యులు పాల్గొనలేదు? ప్రశ్నించారు. మాకు మద్దతు ఇవ్వకపోగా మేం చేసిన ధర్నాను అవహేళన చేస్తున్నారని పేర్కొన్నారు. తాటి చెట్టంత పెరిగితే సరిపోదు.. ఆవగింజంత అవగాహన కూడా ఉండాలి బిఆర్ఎస్ నేతలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. మా చేతులు కట్టేసేలా బీఆరెస్ వ్యవహరిస్తుంది తప్పు.. బీసీలకు మద్దతు ఇవ్వాలన్న సోయి లేదన్నారు. బీజేపీ, బీఆరెస్ లను బీసీ ద్రోహులుగా, బీసీ వ్యతిరేకులుగా తెలంగాణ సమాజం భావిస్తోందన్నారు. తాత్కాలికంగా మీరు విజయం సాధించారని అనుకోవచ్చు, కానీ ఏ సమస్యనైనా దీర్ఘకాలికంగా సాగదీస్తే అది మిమ్మల్నే బలి తీసుకుంటుందన్నారు. ఇప్పటికైనా తక్షణమే బిల్లులను, ఆర్డినెన్స్ ను ఆమోదించాలి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బీజేపీ, బీఆరెస్ తప్పుడు నిర్ణయాలను ప్రశ్నించేలా కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణ తీసుకుంటుందన్నారు. బీసీ రిజర్వేషన్లు, ఆర్డినెన్స్ ఆమోదం కోసం రాష్ట్రపతిని కలిసి విజ్ఞప్తి చేయాలని పది రోజుల క్రితమే అపాయింట్మెంట్ కోరాం. కేంద్ర ప్రభుత్వం, నరేంద్ర మోదీ మాకు రాష్ట్రపతి అపాయింట్మెంట్ ఇవ్వకుండా అడ్డుకున్నారని పేర్కొన్నారు. అయినా 5,6,7 తేదీల్లో తెలంగాణ ప్రభుత్వం మొత్తం ఢిల్లీకి వచ్చింది మంత్రివర్గం మొత్తం ఢిల్లీలోనే రాష్ట్రపతి అపాయింట్మెంట్ కోసం ఎదురుచూశాం, దురదృష్టవశాత్తు రాష్ట్రపతి అపాయింట్మెంట్ మాకు దొరకలేదు ఇది శోచనీయం.. బాధాకరం.. ఇది తెలంగాణ ప్రజలకు అవమానకరమని పేర్కొన్నారు. స్థానిక సంస్థల్లో మొత్తం రిజర్వేషన్లు 50శాతం కంటే మించి ఉండటానికి వీలు లేకుండా గతంలో చేసిన చట్టం అడ్డంకిగా మారడంతో ఆ పరిమితిని ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేసిందని, ఆ ఆర్డినెన్స్ ను కూడా గవర్నర్ రాష్ట్రపతికి పంపించారని గుర్తు చేస్తూ ఈ మూడింటిని తక్షణం ఆమోదించాలని కోరారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న చిత్తశుద్ధితో రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేసిందని, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న కారణంగానే వారిని కలిసి విజ్ఞప్తి చేయడానికి మొత్తం మంత్రివర్గంతో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలంతా ఢిల్లీకి వచ్చినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ పరంగా చిత్తశుద్ధితో అన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ఈ విషయంలో కేంద్ర నుంచి సహకారం లభించలేదని పేర్కొన్నారు. తదుపరి కార్యాచరణపై హైదరాబాద్‌లో పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు.

## అమెరికాకు తగ్గనున్న ఎగుమతులు

>> శాతం ప్రభావం ఉంటుందని అంచనావేసారు. ఈ అదనపు 25 శాతం సుంకం ఆగస్టు 27 నుంచి అమలులోకి రానుంది. అంతకు ముందు విధించిన 25 శాతం సుంకం నేటి నుంచి అమల్లోకి వచ్చింది. 2024 25 ఆర్థిక సంవత్సరంలో భారతదేశం, అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 131.8 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో 86.5 బిలియన్ డాలర్ల ఎగుమతులు, 45.3 బిలియన్ డాలర్ల దిగుమతులు ఉన్నాయి. 50 శాతం టారిఫ్ వల్ల ఎక్కువగా ప్రభావితమయ్యే రంగాలలో వస్త్రాలు/దుస్తులు (10.3 బిలియన్ డాలర్లు), రత్నాలు, ఆభరణాలు (12 బిలియన్ డాలర్లు), రొయ్యలు (2.24 బిలియన్ డాలర్లు), లెదర్ వస్తువులు, పాదరక్షలు (1.18 బిలియన్ డాలర్లు), రసాయనాలు (2.34 బిలియన్ డాలర్లు), ఎలక్ట్రికల్, మెకానికల్ యంత్రాలు (సుమారు 9 బిలియన్ డాలర్లు) ఉన్నాయి. ఇండియన్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీ సమాఖ్య (సీఐటీఐ) ఈ నిర్ణయంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అమెరికా భారతదేశానికి అతిపెద్ద వస్త్ర, దుస్తుల ఎగుమతి మార్కెట్ అని పేర్కొంది. ఈ టారిఫ్‌ల వల్ల ఇతర దేశాలతో పోటీ పడే సామర్థ్యం గణనీయంగా తగ్గుతుందని అభిప్రాయపడింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో భారత్, అమెరికా మధ్య 131.8 బిలియన్ డాలర్లు విలువైన ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది. ఇందులో 86.5 బిలియన్ డాలర్లు విలువైన ఎగుమతులు, 45.3 బిలియన్ డాలర్లు విలువైన దిగుమతులు ఉన్నాయి. భారత్‌కు చెందిన వజ్రాలు, రత్నాలు, ఆభరణాలకు అమెరికా అతిపెద్ద మార్కెట్. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో ఈ విభాగంలో భారత్ రూ.83వేల కోట్లు విలువైన ఎగుమతులు చేసింది. 50 శాతం దిగుమతి సుంకం వల్ల భారత్‌కు చెందిన వజ్రాలు, రత్నాలు, ఆభరణాలతో ముడిపడిన పరిశ్రమలు ప్రభావితం అవుతాయి. దీంతో ఆయా పరిశ్రమలు తమ తయారీ యూనిట్లను భారత్ నుంచి దుబాయ్, మెక్సికో వంటి చోట్లకు తరలించే అవకాశాలు ఉన్నాయి. టైటాన్ కంపెనీ సైతం తమ తయారీ యూనిట్‌ను ఒక మిడిల్ ఈస్ట్ దేశానికి తరలించే యోచనలో ఉందని వినిపిస్తోంది.



హైదరాబాద్ మలక్‌పేటలో గురువారం భారీ వరదలో కొట్టుకుపోతున్న బైకులు

## హైదరాబాద్‌లో కుండపోత

>> పడ్డారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులకు ఫోన్ చేసి పరిస్థితిపై ఆరా తీసి వారికి కీలక ఆదేశాలు జారీ చేశారు. సిఎస్, డిజిపితో పాటు జిహెచ్ఎంసి, హైడ్రా కమిషనర్, విద్యుత్ విభాగం అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. విపత్తు నిర్వహణ బృందాలను సంసిద్ధంగా ఉంచాలని సూచించారు. దీంతో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. అందులో భాగంగా హైదరాబాద్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు ఏర్పాటు చేశారు. భారీ వర్షాలతో హిమాయత్‌సాగర్ వరద ప్రవాహం పెరిగింది. హిమాయత్‌సాగర్ గేట్లు తెరిచి దిగువన మూసీలోకి నీటిని విడుదల చేసేందుకు సన్నద్ధమయ్యారు. కాగా, ప్రజలు అత్యవసరమైతే తప్ప తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. నగరంలో కురుస్తున్న కుండపోత వానలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించి, అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరా బాద్‌లో అర్ధరాత్రి వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు సీఎం తెలిపారు. ఈ నేపథ్యంలో జీహెచ్ఎంసీ, పోలీసు, ట్రాఫిక్, జలమండలి (హైడ్రా) అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, అవసరమైతే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. వర్షాలు, వరదల వల్ల ఏవైనా అనుకోని పరిస్థితులు ఎదురైతే, వాటిని ఎదుర్కొనేందుకు అధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని ఆయన గట్టిగా సూచించారు. హైదరాబాద్ నగరంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షానికి నగర వ్యాప్తంగా భారీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా శేరిలింగంపల్లిలో 12.3 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, ఖైరతాబాద్‌లో 11.13 సెం.మీ., సరూర్‌నగర్‌లో 10.6, ఉప్పల్‌లో 9.5, షేక్‌పేట్‌లో 9, ఉప్పల్ న్యూనాగోల్‌లో 8, బండ్లగూడలో 8, దిల్‌సుఖ్‌నగర్‌లో 8.2, లింగోజిగూడలో 7.6, మలక్‌పేట్ ఆస్మాన్‌గఢ్‌లో 7.6, ఉప్పల్ రామాంతపూర్‌లో 7.5, నాగోల్‌లో 7.4 బాలానగర్‌లో 7, జూబ్లీహిల్స్‌లో 6.9 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తెలంగాలో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఈ మేరకు గురువారం నల్గొండ, యాదాద్రి భువనగిరి, నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయి.

## 'మహా' ఫలితాలతో ఓట్ల చౌర్యం నిజమైంది

>> చేశారు. హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని తెలిపారు. ఏ పార్టీకైనా ప్రభుత్వ వ్యతిరేకత తప్పదు. కానీ కొన్ని కారణాల వల్ల ఒక్క బీజేపీకి మాత్రం ఆ సూత్రం వర్తించటంలేదు. రెండోది ఎగ్జిట్‌పోల్స్, ఒపీనియన్ పోల్స్ ఒకరకంగా ఉంటే హరియాణా, మధ్యప్రదేశ్ ఎన్నికలు మీరు చూశారుగా ఆకస్మాత్తుగా ఫలితాలు భిన్నంగా వచ్చాయి. అంతేకాదు భారీ ఆధిక్యంతో విజయం దక్కింది. మూడోది ప్రభుత్వ వ్యతిరేకత లేకపోవటానికి, ఫలితాలు మారటానికి వారు చెప్పిన కారణాలు అనేకం. లాడ్లీ బెహనా, పుల్వామా, ఇప్పుడు సిందూర్. వాస్తవం ఏమంటే ఎన్నికల ఫలితాలను తారుమారు చేశారు. ఈవీఎంలు లేనప్పుడు దేశమంతా ఒకేరోజు ఓటువేసేది. ఇప్పటి రోజుల్లో యూపీలో వేర్వేరుగా ఓటింగ్ జరుగుతుంది. బీహార్‌లో మరొక రోజు జరుగుతుంది. ఎన్నికల ప్రక్రియ నెలలపాటు సాగుతుంది. అది మాకు అనుమానం కలిగిస్తోంది. ఆకస్మాత్తుగా కర్ణాటక, హరియాణా ఎన్నికల తేదీలు మార్చారు. ప్రజలతోపాటు మాకు కూడా అనుమానం వచ్చింది. మా అనుమానం నిజమైంది. మహారాష్ట్ర ఎన్నికలకు ముందు రాష్ట్రాలవారీగా అనుమానాలకు కారణాలు చెప్పలేకపోయాం. మహారాష్ట్రలో 5నెలల్లో 40లక్షల మంది ఓటర్లు నమోదు కావటంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ రాహుల్ అనుమానం వ్యక్తం చేశారు. ఇది ఐదేళ్లలో నమోదైన ఓటర్ల కంటే ఎక్కువన్నారు. మహారాష్ట్రలో సాయంత్రం 5తర్వాత భారీగా పోలింగ్ నమోదైనట్లు ఆయన చెప్పారు. సీసీ ఫుటేజీ అడిగితే ఎన్నికల సంఘం ఇవ్వలేదన్నారు. మహారాష్ట్రలో లోక్‌సభ, శాసనసభ ఎన్నికల వ్యవధిలో కోటి మంది ఓటర్లు నమోదయ్యారని, ఓటర్ల జాబితా సాఫ్ట్ కాపీ ఇచ్చేందుకు ఈసీ నిరాకరించిందన్నారు. సీసీటీవీ ఫుటేజీ, ఓటర్స్ లిస్ట్ ఈ మోసానికి సాక్ష్యాలని, కానీ ఎన్నికల సంఘం వీటిని నాశనం చేసేందుకు చూస్తుందని అన్నారు. ఓటర్ల జాబితా దేశసంపద దానిని ఎందుకు చూపించట్లేదని, దాన్ని విశ్లేషించే హక్కు తమకు ఉందని రాహుల్‌గాంధీ తెలిపారు. 2024లో అధికారంలోకి వచ్చేందుకు ప్రధానికి 25 సీట్లు అవసరం కాగా, బీజేపీ 25 సీట్లలో 33వేల ఓట్ల కంటే తక్కువ మెజారిటీతో గెలిచారని పేర్కొన్నారు.

## రికవరీ చేయండి

>> పోవచ్చని న్యాయస్థానంకు వారు ఆశ్రయిస్తే వారి నుంచి రాబట్టడానికి సమయం పట్టే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఒక వేళ న్యాయస్థానాల్లో కూడా ఇదే తీర్పు వెలువడితే అంత డబ్బు చెల్లించే సామర్థ్యం అధికారులకు ఉన్నప్పటికి ఆ నాటి పాలకులు చేసిన తప్పిదాలకు తాము బలికావొస్తుందని అధికారులు ఆవేదన చెందుతున్నారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ప్రాణహిత చేవెళ్ళ ప్రాజెక్టు రిడిజైన్ చేయడంలోభాగంగా కొత్తగా సృష్టించిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా ఎక్కడ నీటి లభ్యత ఉంది, బ్యారేజీల నిర్మాణం, స్థలం తదితర సాంకేతిక విషయాలను అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించడానికి వ్యాప్కోస్ సంస్థతో సర్వే చేయించారు. అదిప్రభుత్వ రంగ సంస్థ. ఎవరికైనా సాంకేతిక సేవలు అవసరముంటే వారు అడిగిన అంశంపై సర్వే చేసి ఇస్తుంది. వ్యాప్కోస్ ప్రభుత్వ రంగ సంస్థే అయినా, సర్వే కోసం కొంత మొత్తాన్ని వసూలు చేస్తుంది. వ్యాప్కోస్ ఇచ్చే నివేదిక తుది నిర్ణయం కాదు. అధికారికం కాదు. కేవలం ప్రభుత్వ అంచనాకు సాంకేతికంగా ఉపయోగించుకోవడానికి వీలుంటుంది. ఈ క్రమంలోనే వ్యాప్కోస్ సంస్థ చేసింది ప్రభుత్వ సర్వే కాదని నీటిపారుదల రంగ నిపుణులు చెబుతున్నారు .సర్వేను పట్టించుకోకుండానే నిర్మాణంఈ సంస్థ చేసిన సర్వేను సైతం గత పాలకులు వినియోగించుకోకుండా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను ఖరారు చేశారని విచారణలో కాళేశ్వరం కమిషన్ గుర్తించింది. వ్యాప్కోస్ సంస్థ చేసిన సర్వే బుడిదలో పోసిన పన్నీరులా మారిందని వివరించింది. అప్పటి సిఎం చంద్రశేఖర్‌రావు అనేక సందర్భాల్లో వ్యాప్కోస్ సంస్థ ద్వారా సర్వే చేయించామని, ప్రభుత్వ సంస్థ అయిన వ్యాప్కోస్ విశ్వసనీయతను దెబ్బతిస్తారా? అంటూ అసెంబ్లీ సహా అనేక సమావేశాల్లో ఆయన ప్రతిపక్షాలపై సీరియస్ అయ్యారు. ప్రభుత్వ రంగ సంస్థ కాబట్టి విశ్వసనీయత ఉంటుందని అందరూ నమ్మారు. కానీ, ఆ సంస్థ విశ్వసనీయత, సర్వే రెండింటినీ అనుమానించే విధంగా దానిని సర్కార్ పట్టించుకోలేదని కమిషన్ పేర్కొంది. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణంలో పూర్తి బాధ్యత కెసిఆర్‌దే జస్టిస్‌ఘోష్ నివేదిక వెల్లడించడంతో వాప్కోస్ చెల్లించిన డబ్బులు ఆయన నుంచి రికవరి చేస్తారా లేకా ఆనాటి నీటిపారుదలశాఖ మంత్రి నుంచి రికవరి చేస్తారా లేదా ఆరోజుల్లో దీనికి సంబందించిన ఫైళ్ళను చూసిన అధికారుల వ్యక్తిగత ఖాతాల నుంచి తీసుకొంటారా అనే సంశయాలతో అధికారుల్లో వణుకు మొదలైంది. తాము చేసే ప్రతి పనికి ఫైళ్ళ్లు చేసే సంతాకినికి ఒకటి కి రెండుసార్లు ఆలోచించాల్సి వస్తుందని లేకుంటే తామే అధికారికంగా దొరికిపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుపై పిసిఘోష్ ఇచ్చిన నివేదిక న్యాయస్థానంలో తీర్పులకు ప్రామాణిక సాక్ష్యంగా నిలవదని దీనితో పెద్దగా భయాందోళన చెందాల్సిన అవసరంలేదని కొంత మంది న్యాయనిపుణులు భరోసా ఇస్తుండటంతో అధికారులు ఊరట చెందుతున్నారు. వ్యాప్కోస్ సంస్థ సర్వేను ప్రత్యేకంగా పరిగణించిన పీసీ ఘోష్ కమిషన్ ప్రజా ధనాన్ని వృథా చేశారని, దీనికి కారణమైన బాధ్యులను గుర్తించి వారి నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేయాలని రిపోర్టులో స్పష్టం చేసింది. వ్యాప్కోస్ సంస్థతో సర్వే చేయించాలని అప్పటి సీఎం కెసిఆర్, ఆనాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావులు నిర్ణయానికి వచ్చారని, అందుకు అనుగుణంగా అధికారులు ఫైల్ మూవ్ చేసి ఆ సంస్థకు నిధులు విడుదల చేశారని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు.

## వదిలేసిన కాంగ్రెస్ సర్కార్

>> ముందు ధర్నా చేసే దుస్థితి రావడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా రైతు ఆత్మహత్యలు జరుగుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 600 రోజుల్లో 600 ఆత్మహత్యలు జరిగాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతుబంధుకు రామ్ రామ్ అని కెసిఆర్ ఏనాడో చెప్పారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఎన్నికల తర్వాత పూర్తిగా మర్చిపోయిందన్నారు. రైతులకు ఎరువులను సరఫరా చేయడంలో కాంగ్రెస్ సర్కార్ పూర్తిగా విఫలమైందన్నారు. రైతులు ఎరువుల కోసం నానా అవస్థలు పడుతున్నారని, వరుసలో చెప్పులు పెట్టి పడికాపులు కాస్తున్నారని మండిపడ్డారు. రైతులకు సన్నవడ్లకు బోనస్ ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రూ.49వేల కోట్ల రుణమాఫీ చేస్తామని చెప్పి, ఇప్పటివరకు 21 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని, మిగతా రుణమాఫీ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఆర్భాటాలే తప్ప ఆచరణలో చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ బిజెపిలు మిలాఖత్ అయ్యాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బిజెపిలు ఒకరికొకరు పరస్పరం సహకారం చేసుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పద్మాదేవేందర్ రెడ్డి, పట్లోళ్ల శశిధర్ రెడ్డి, క్రాంతి కిరణ్, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్ పర్సన్ హేమలత శేఖర్ గౌడ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పది రాష్ట్రాల ప్రతినిధులతో అవగాహన ఒప్పందాలు

## ఎన్ఐఆర్‌డిపిఆర్ క్యాంపస్‌లో కార్యక్రమం

**హైదరాబాద్ (అత్తాపూర్) ఆగస్టు 7, ప్రభాతవార్త** :రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ సంస్థ (ఎన్ఐఆర్‌డిపీఆర్) ఒక కీలక శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డిడియు-జికెవై) కింద గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల ప్రాజెక్ట్ మూల్యాంకన వ్యవస్థను మెరుగుపరచేందుకు పది రాష్ట్రాల ప్రతినిధులతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. గురువారం రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్ డీపీఆర్ క్యాంపస్‌లో కార్యక్రమం జరిగింది. ఇందులో అరుణాచల్ ప్రదేశ్, త్రిపుర, జమ్మూకాశ్మీర్, తమిళనాడు, కర్ణాటక, నాగాలాండ్, అసోం, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ నైపుణ్యాభివృద్ధి (ఎంఓఆర్‌డి), భారత ప్రభుత్వం నుండి ప్రతినిధులు కూడా హాజరయ్యారు. కొన్ని రాష్ట్రాల అధికారులు తాము ముందు నుండే నిశ్చయించుకున్న కార్యక్రమాల్లో ఉండటంతో హాజరు కాలేకపోయారు.



సమావేశంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, ఎన్ఐఆర్‌డిపిఆర్ అధికారులు

డా. జి. నరేంద్ర కుమార్, ఐఏఎస్, డైరెక్టర్ జనరల్, ఎన్ఐఆర్ డి పీఆర్, మాట్లాడుతూ, 'ఈ అవగాహన ఒప్పందాల ద్వారా ప్రాజెక్ట్ మూల్యాంకన ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది. పాల్గొన్న రాష్ట్రాల్లో గ్రామీణ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమల య్యేలా చేస్తాయని అన్నారు. అలాగే, ప్రాజెక్టులకు గుణాత్మకమైన, పారదర్శకమైన మూల్యాంకన వ్యవస్థను ఏర్పరచడం అవసరమని ఆయన పేర్కొన్నారు. డిడియూజికెవై 2.0కు జాతీయ స్థాయి ప్రాజెక్ట్ అప్రైజల్ ఏజెన్సీగా ఎన్ఐఆర్ డి పీఆర్ విధేయతను మళ్లీ స్పష్టం చేశారు. సతీష్ కుమార్, డైరెక్టర్ ప్రాజెక్ట్ అప్రైజల్, ఎన్ఐఆర్‌డిపీఆర్, ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించి, మొత్తం అప్రైజల్ విధానంపై సమగ్రమైన అవగాహన కల్పించి, ఒప్పందాలపై సంతకాల ప్రక్రియను నిర్వహించారు.

మేరీ థామస్, అండర్ సెక్రటరీ (నైపుణ్యాలు), ఎంఓఆర్‌డి, శశికుమార్ యాదవ్, మిషన్ మేనేజర్, ఎఓఆర్‌డి కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వం తరఫున పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఈఓలు, ప్రాజెక్ట్ మేనేజర్లు, సీనియర్ ప్రో గ్రామ్ మేనేజర్లు తదితర రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు. చివరిలో రాష్ట్రాల ప్రతినిధులతో ప్రశ్నోత్తర సమావేశం జరిగింది.



# రాష్ట్రానికి అమిటీ యూనివర్సిటీ రాక

## ఒప్పందం చేసుకున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణ విద్యారంగం అభివృద్ధికి తమ వంతుగా సేవలు అందిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అమిటీ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ అతుల్‌చౌహాన్ తెలిపారు. గురువారం ఢిల్లీలోని సీఎం అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అమిటీ యూనివర్సిటీ ఛాన్స్‌లర్ అతుల్ చౌహాన్ కలిశారు. తెలంగాణలో తమ యూనివర్సిటీ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదముద్ర వేసినందుకు అతుల్ చౌహాన్ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీతో తాము ఒప్పందం చేసుకుంటామని... స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల్లో భాగస్వాములవుతామని చౌహాన్ సీఎంకు తెలియజేశారు. మెరుగైన వసతులు, నాణ్యమైన విద్యా బోధనతో ఇప్పటికే అమిటీకి మంచి పేరు ఉందన్నారు. తెలంగాణలో మరింతగా రాణించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమిటి యూనివర్సిటీ ప్రతినిధి రామచంద్రం పాల్గొన్నారు.




# గుండెపోటుతో న్యాయవాది మృతి

**హైదరాబాద్, ఆగస్టు 8, ప్రభాతవార్త:** తరచుగా సంభవిస్తున్న గుండెపోటు మరణాలు కలకలం సృష్టిస్తున్నాయి. ఇటీవల నాగోల్ ప్రాంతంలో ఓ యువకుడు షటిల్ ఆడుతూ గుండెపోటుకు గురైన విషయం మరవకముందే తాజాగా గురువారం హైకోర్టు న్యాయవాది గుండెపోటుతో మృతి చెందడం తీవ్రవిషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని గేట్ కారేపల్లి గ్రామానికి చెందిన పరస అనంత నాగేశ్వం రావు(45) హైకోర్టులో న్యాయవాదిగా కొనసాగుతున్నారు. అయితే విధుల్లో భాగంగా నాగేశ్వరరావు గురువారం హైకోర్టుకు వచ్చారు. కోర్టు ఆవ రణలో కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలిస్తుండగా అకస్మాత్తుగా ఛాతిలో నొప్పి రావడంతో పక్కనే ఉన్న కుర్చీలో కుర్చుండిపోయారు. గమనించిన తోటి న్యాయ వాదులు, కోర్టు సిబ్బంది హుటాహుటిన స్పందిం చి సీపీఆర్ ప్రయత్నించి, చలనం లేకపోవడంతో స్థానిక ఆసుపత్రికి తరలించారు. కానీ, పరిశీలించిన డాక్టర్లు నాగేశ్వరరావు అప్పటికే మృతి చెందినట్లు చెప్పారు. కాగా, మృతుడు నాగేశ్వరరావుకు భార్య, కొడుకు, కూతురు ఉన్నారు.

## రిజర్వేషన్ల పెంపుపై కేంద్రాన్ని బద్నాం చేస్తూ

# బిసిలను మోసగించాలని చూస్తున్న ప్రభుత్వం

### బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే కులగణన, బిసి కమిషన్ నివేదిక ఆధారంగా బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నేటికి 20 నెలలు గడిచిందని ఇప్పటి వరకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం నిర్మల్ బైంసా పట్టణంలో ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో కలిసి మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మిగిలింది ఇంకా 40 నెలలే మిగిలాయన్నారు. మూడు వంతుల పాలనాకాలంలో ఒక వంతు మిగిలిందన్నారు.

కానీ కాంగ్రెస్ మేనిఫెస్టోలోని 420 హామీలతోపాటు బిసి రిజర్వేషన్ల హామీ కూడా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండిపోయిందన్నారు. బిసి రిజర్వేషన్ల బిల్లును గత మార్చిలో అసెంబ్లీ ఆమోదించింది. ఎనిమిది మంది బిజెపి ఎమ్మెల్యేలం బిల్లుకు మద్దతిచ్చామన్నారు. గత నాలుగు నెలలుగా రేవంత్ సర్కారు బిసి రిజర్వేషన్లపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని, బిజెపిని బద్నాం చేసే రాజకీయ డ్రామాలు చేస్తూ బిసిలను మభ్యపెడుతూ మోసం చేస్తుందన్నారు. బిసి రిజర్వేషన్ల పెంపు అంశంపై నిన్న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద రేవంత్ రెడ్డి నాయకత్వంలో జరిగిన ధర్నాకు కాంగ్రెస్ అగ్రనేతలెవరూ రాకపోవడంతోనే బిసిల పట్ల కాంగ్రెసుకు చిత్తశుద్ధి లేదని మరోసారి రుజువైందన్నారు. సోనియా, రాహుల్, ప్రియాంక, మల్లికార్జున ఖర్గే, కెసి వేణుగోపాల్ వంటి కాంగ్రెస్ అగ్రనేతలెవరూ రేవంత్ రెడ్డి నిర్వహించిన ధర్నాకు రాకపోవడంతో రెండు అంశాలలపై స్పష్టత వచ్చింది. కాంగ్రెస్ అగ్రనేతలకు రేవంత్ రెడ్డి నాయకత్వంపై నమ్మకం లేదని, బిసి రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని. గత ఏప్రిల్ నెలలో కూడా బిసి సంఘాలతో రేవంత్ రెడ్డి ఢిల్లీలో పెట్టించిన ధర్నాకు కూడా కాంగ్రెస్ అగ్రనేతలు ముఖం చాటేశారని అన్నారు.

జనభాలో 50 శాతమున్న బిసిలకు కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో బిసిలకు తక్కువ సీట్లు ఇచ్చి, అన్యాయం చేసిందన్నారు. ఇపుడు క్యాబినెటులో అయినా న్యాయం చేసిందా అంటే అదీ లేదన్నారు. బిసిలకు కనీసం ఎనిమిది మంత్రి పదవులు ఇవ్వాల్సిన కాంగ్రెస్ ఇచ్చింది కేవలం ముగ్గురికే ఇచ్చిందన్నారు. ఇంకా ఖాళీగా ఉన్న మూడు క్యాబినెట్ బెర్తులను బిసిలకే ఇచ్చే దమ్ముందా కాంగ్రెసుకు అంటూ ప్రశ్నించారు. బిసిల మేలు కోసం కులగణన అంటున్న కాంగ్రెస్ సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే ఖాళీగా ఉన్న ఆరు మంత్రి పదవులను బిసిలకే కేటాయించాలని డిమాండ్ చేశారు.

# నేడు సిట్ విచారణకు హాజరవుతున్న కేంద్రమంత్రి బండి సంజయ్

## కేంద్ర హోంశాఖ అధికారులతో సమావేశం, ఆధారాలు సేకరణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 7:** తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. హైదరాబాద్‌కు గురువారం కేంద్ర హోం శాఖ అధికారులు వచ్చారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై అధికారులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ చర్చించారు. ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ భేటీకి హాజరుకావడం గమనార్హం. ఎస్ఐబి, సిట్, కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగాల్లో పని చేసిన అధికారులతో బండి సంజయ్ ప్రత్యేకంగా చర్చించారు. కెసిఆర్ ప్రభుత్వం బండి సంజయ్ ఫోన్‌ను ఎక్కువ సార్లు ట్యాప్ చేసినట్లు పోలీసులు నిర్ధారించారు. వాటికి సంబంధించి సేకరించిన ఆధారాలను కేంద్ర నిఘా వర్గాలు బండి సంజయ్ ముందుంచాయి. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ ఎదుట హాజరవుతున్న తొలి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయే కావడం గమనార్హం. ఈ క్రమంలో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన అనేక ఆధారాలను కేంద్ర మంత్రి సేకరించినట్లు తెలుస్తోంది. ఫోన్ ట్యాపింగ్ కేసులో బండి సంజయ్ శుక్రవారం సిట్ ఎదుట హాజరుకాబోతున్నారు.


తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం
రెవిన్యూ (భూ సేకరణ) శాఖ, సూర్యాపేట జిల్లా

**ఫారము-6**
**(ప్రాథమిక ప్రకటన)**
(కేంద్ర చట్టము 30/2013 యొక్క సెక్షన్ 11(1) రూల్ 19(1) అనుసరించి కలెక్టర్/అదనపు కలెక్టర్/రాజస్వ మండలాధికారి హుజూర్‌నగర్)

జిల్లా కలెక్టర్, సూర్యాపేట ఫైల్ నెం. బి/1958/2025 తేది: 04.08.2025
రెవెన్యూ డివిజనల్ అధికారి, హుజూర్‌నగర్ ఫైల్ నెం. ఎఫ్/2859/2025 తేది: 04.08.2025
గెజిట్ నెంబరు. 40/2025 తేది: 04.08.2025

తెలంగాణ ప్రభుత్వం/జిల్లా కలెక్టర్, సూర్యాపేటగారు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ & సి.ఏ.డి ఇరిగేషన్ డివిజన్ నెం 3 హుజూర్‌నగర్ గారు పాలకవీడు మండలం పాలకవీడు గ్రామములో ఇచ్చిన రిక్విజేషన్ లెటర్ నెం. ఇ.ఇ/ఐ.డి 3 /HZNR/DB/LA of JBCLIS/347M, తేది: 19.07.2025 ప్రకారం ఈ దిగువ షెడ్యూల్‌లో నిర్దిష్టపరచిన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం, జాన్‌పహాడ్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 335 & 336 లలో విస్తీర్ణం ఎ.1.11 గుంటలు పట్టా భూములు ప్రజా ప్రయోజన నిమిత్తము అనగా పాలకీడు మండలము, జాన్ పహాడ్ గ్రామము నుండి జాన్ పహాడ్ బ్రాంచ్ కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు కొరకు అవసరమైనదని భావించినందున, భూసేకరణ పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ 11(1) అనుసరించి భూసేకరణ నిమిత్తము ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (తెలంగాణ సవరణ) చట్టం 2016 (చట్టం 21 ఆఫ్ 2017)ననుసరించి సదరు భూసేకరణ చట్టం 30/2013 (ఛాప్టర్ 2)లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు ఛాప్టర్-3 ప్రకారం సెక్షన్-10ఎ ఆహారభద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.

కావున సూర్యాపేట జిల్లా, పాలకవీడు మండలం, జాన్‌పహాడ్ గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 335 & 336లలో విస్తీర్ణం ఎ. 1.11 గుంటలు పాలకీడు మండలము, జాన్ పహాడ్ నుండి జాన్ పహాడ్ బ్రాంచ్ కెనాల్‌కు లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు కొరకు అవసరమైనదని ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

గ్రామం : జాన్ పహాడ్ మండలం : పాలకవీడు జిల్లా : సూర్యాపేట

| క్రమ సంఖ్య | సర్వే నం బరు | భూమి స్వభావము | భూమి రకం | భూసేకరించబడు భూమి | పట్టాదారు పేరు/ ఆస్తి గల వ్యక్తుల పేరు/ చిరునామా | అనుభవదారు పేరు | సరిహద్దులు ఉత్తరం | దక్షిణం | తూర్పు | పడమర | చెట్లు/ నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | | | | 9 |
| 1 | 335 | పట్టా | మెట్ట | 0.36 | సపావత్ సైదా తండ్రి: బద్య, సపావత్ జాను తండ్రి: బద్య, బాణోతు అంజలి తండ్రి: చంద్రమౌళి, రమావత్ లిలిని భర్త: మెషా, బాణోతు రెడ్యా తండ్రి: పీమ్యా, సపావత్ లిలిని భర్త: బద్య, బాణోతు నాగు తండ్రి: బాలు, బాణోతు ధర్మా తండ్రి: జగ్గా, బాణోతు రామచంద్రు తండ్రి: భీమ్లా, బాణోతు హరిచంద్రు తండ్రి: భీమ్లా, బాణోతు సర్య తండ్రి: భీక్య, బాణోతు రవి, బాణోతు దేవి భర్త: నాగరాజు | సపావత్ సైదా తండ్రి: బద్య (0.02) (ప & అ), సపావత్ జాను తండ్రి: బద్య (0.01) (ప & అ), బాణోతు అంజలి భర్త: చంద్రమౌళి (0.05½) (ప & అ), రమావత్ లిలిని భర్త: మెష్యా (0.05) (ప & అ), బాణోతు నాగేంద్ర బాబు తండ్రి: ధర్మ (0.08) (అ), బాణోతు లక్ష్మీ భర్త: కోక్యా (0.05½)(అ), బాణోతు రెడ్యా తండ్రి: పీమ్యా (0.05½)(ప & అ), బాణోతు సైదా తండ్రి: సూర్యా (0.01½) (అ), కుర్రా నాగులు (0.02) (అ) | 337 | 334 | 336 | పిపి | (27) పిపిసి పైపులు (1) బోరు |
| 2 | 336 | పట్టా | మెట్ట | 0.15 | అజ్మీర అరుణ భర్త: హుస్సేన్, రమావత్ మధూ భర్త: కున్యా, సపావత్ సైదా తండ్రి: బద్య, సపావత్ సుధీర్ తండ్రి: జాను, అజ్మీర సైదా తండ్రి: బాన్యా, అజ్మీర హరిక భర్త: రవి, సపావత్ నాగు తండ్రి: సైదా | అజ్మీర అరుణ భర్త: హుస్సేన్ (0.03)(ప & అ), రమావత్ మధూ భర్త: కున్యా (0.03) (ప & అ), సపావత్ సైదా తండ్రి: బద్య (0.05½)(ప & అ), సపావత్ జాను తండ్రి: బద్య (0.01½)(అ), సపావత్ సుధీర్ తండ్రి: జాను (0.02)(ప & అ) | 337 | 334 | 337 | 335 | (21) పిపిసి పైపులు (2) బోర్లు |
| | మొత్తం | | | 1.11 | | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013 (నెం. 30/2013)లోని నియమములోని సెక్షన్ 11(1) ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూ నష్ట పరిహారం చెల్లింపుటకుగాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండల అధికారి, హుజూర్‌నగర్ గారి కార్యాలయంలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము/జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు రాజస్వమండల అధికారి, హుజూర్‌నగర్ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారము పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశంలోకి ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ 11(4) ప్రకారం భూసేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకము, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టములోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు రాజస్వ మండల అధికారి, హుజూర్‌నగర్‌గార్లకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసి యున్నది. ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినములలోపల ఏమైనా అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు రాజస్వ మండల అధికారి, హుజూర్‌నగర్‌గార్లకు లిఖిత పూర్వకంగా తెలియజేయవలసియున్నది.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి, హుజూర్‌నగర్ | సం/- అదనపు కలెక్టర్, సూర్యాపేట | సం/- జిల్లా కలెక్టర్, సూర్యాపేట

DIPR RO.NO: 451/LA/PP/Advt/Pub/2025-26


# సినిమా కార్మికులకు వేతనాలు పెంచాల్సిందే

**పెద్ద బడ్జెట్ సినిమాలకు 30 శాతం, చిన్నచిత్రాలకు 15 శాతం వేతనాలు పెంచాలి: సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ**


గురువారంనహైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో మాట్లాడుతున్న పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** సినిమా రంగంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాల్సిందేనని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ డిమాండ్ చేశారు. పెద్ద బడ్జెట్ సినిమాలకు 30 శాతం, చిన్న చిత్రాలకు 15 శాతం వేతనాలు పెంచాలన్నారు. సినీ రంగ కార్మికులకు న్యాయం జరిగే వరకు సిపిఐ పూర్తిగా అండ గా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని సినీమా కార్మికులకు న్యాయం చేయాలన్నారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో జాతీయ కార్య వర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఇటి నరసింహతో కలిసి నారాయణ గురువారం మీడియాతో మాట్లాడారు. తెలుగు సినిమా కార్మికులు తమకు వేతనాలు పెంచమంటే ముంబయి నుంచి సినీకార్మికులను తీసుకువచ్చి పనిచేయించుకుంటామని సినీనిర్మాతలు బెదరింపులకు పాల్పడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇక్కడి కార్మికులకు అన్యాయం చేయాలని చూస్తే సిపిఐ ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొనడమే కాకుండా ఎంతవరకైనా వెళ్తామని హెచ్చరించారు. తెలుగు సినిమా రంగంలో కేవలం 10 కుటుంబాల చేతుల్లో.. థియేటర్లు 4 కుటుంబాల చేతుల్లో ఉన్నాయని.. వారే మొత్తం ఆడిస్తున్నారని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కేవలం సందేశాత్మక చిత్రాలకు మాత్రమే ప్రోత్సాహం అందించాలన్నారు. వందల కోట్లతో సమాజాన్ని చెడుమార్గం పట్టించేలా తీస్తున్న చిత్రాలకు ఎలాంటి పరిస్థితుల్లో రాయి తీలు ఇవ్వరాదని, టికెట్ల పెంపునకు అనుతులు ఇవ్వరాదన్నారు. పెద్దపెద్ద నిర్మాతలు, హీరోలను పిలిచి మాట్లాడే ముఖ్య మంత్రి.. సినిమా కార్మికులను పిలిచి ఎందుకు మాట్లాడటం లేదని నారాయణ ప్రశ్నించారు.

ప్రభుత్వానికి పక్ష పాతం సరికాదని.. కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకూడ చూడాలన్నారు. గతంలో ఓ సందర్భంలో సినీ నటుడు చిరంజీవిపై తాను చేసిన వ్యాఖ్యల పట్ల అప్పుడే క్షమాపణలు చెప్పి వెనక్కి తీసుకున్నానని నారాయణ ఈ సందర్భంగా గుర్తు చేశారు. చిరంజీవి తనపై చేసిన వ్యాఖ్యలకు నారాయణ కౌంటర్ ఇచ్చారు. చిరంజీవిని ఉద్దేశించి గతంలో తాను చేసిన వ్యాఖ్యల పట్ల అప్పుడే క్షమాపణలు చెప్పడంతో ఈ అంశం ముగిసి పోయిందన్నారు. కానీ చిరంజీవి మళ్లీ ఆ ప్రస్తావన తేవడం, ఆ విడియోలను వైరల్ చేయడ సరికాదన్నారు. ఈ అంశాన్ని చిరంజీవి నైతికతకు, విజ్ఞతకే వదిలేస్తున్నట్టు నారాయణ తెలిపారు.

# వనమహోత్సవం లక్ష్యాలను సాధించాలి

### ఫారెస్టు శాఖ ముఖ్యకార్యదర్శి నదీమ్ అహ్మద్

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** వన మహోత్సవంలో శాఖల వారీగా కేటాయించిన లయాలను త్వరితగతిన పూర్తిచేయాలని అటవీ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ నదీమ్ అహ్మద్ అధికా రులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో వన మహోత్సవంపై రాష్ట్రస్థాయి పర్యవేక్షణ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శాఖల వారీగా నాటిన మొక్కల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అత్యధి కంగా పంచాయతీరాజ్ శాఖ 81 శాతం మేరా లక్ష్యం సాధించిన వివరాలు అడిగి తెలుసు కున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో కార్య దర్శులు గ్రామపరిధిలో ప్లాంటేషన్ పనులు చేపట్టడంతో పాటుగా గ్రామాల్లో ప్రతి ఇంటికి మొక్కలు డిస్ట్రిబ్యూషన్ చేస్తారని అవి కార్యదర్శులు తమ రికార్డుల్లో కూడా నమోదు చేస్తారని పంచాయతీరాజ్ శాఖ అధికారులు వివరించారు. హెచ్ఎండిఏ లక్ష్యసాధనలో కొంత వెనుకబడి ఉందని, సాధ్యమైనంత త్వరగా లక్ష్యం పూర్తి చేయాలన్నారు.

అనంతరం చీఫ్‌కన్జర్వేటివ్ ఆఫీసర్ డాక్టర్ సువర్ణ మాట్లాడుతూ జిల్లాల వారీగా ఇచ్చిన టార్గెట్లను వెంటనే పూర్తి చేయా లని, పూర్తిచేసిన వివరాలని వెంటనే డేటా అప్లోడ్ చేయాల న్నారు. అంతేకాకుండా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని, వర్షాలు పడని సమ యంలో వాటరింగ్ కూడా చేపట్టాలన్నారు. బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా ఈత మొక్కలను ఎక్కువగా పెంచాలని, హైబ్రిడ్ ఈత మొక్కలను నాటడంపై దృష్టి సారిం చాలని ఎక్సైస్ అధికారులకు సూచించారు. వనమహోత్సవ కార్యక్రమంలో పిల్లల భాగ స్వామ్యం ఎక్కువగా ఉండేలా చూడాలన్నారు. హెచ్ఎండిఏ మినహా మిగతా శాఖలన్నీ ఎట్టి పరిస్థితుల్లో సెప్టెంబర్ 30 లోపు 100శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. అంతే కాకుండా ప్లాంటేషన్ పూర్తైన చోట మొక్కలకు జియో ట్యాగింగ్ చేయా లన్నారు.. వనమహోత్సవంలో జనగాం జిల్లా 91.93 శాతంతో మొదటి స్థానంలో ఉండగా కామారెడ్డి జిల్లా 80.82 శాతంతో రెండో స్థానంలో, జోగులాంబ గద్వాల్ జిల్లాలో 78.70శాతంతో మూడో స్థానంలో, రాజన్న సిరిసిల్ల 75.03 శాతంతో నాలుగో స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 71.84 శాంతో 5వ స్దానంలో ఉన్నట్లు తెలిపారు.

# కోల్డ్ స్టోరేజీలో భారీ అగ్నిప్రమాదం

**12 గంటలు గడిచినా ఎగసిపడుతున్న మంటలు**
**రంగంలోకి 10 అగ్నిమాపక శకటాలు.. అదుపులోకి అగ్నికీలలు**


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక ఇంజన్లు

**గుమ్మడిదల, ఆగస్టు 7, ప్రభాతవార్త :** గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని అన్నారం వార్డు శివారులో బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా మంటలు అంటుకొని కోల్డ్‌స్టోరేజీ శీతల గిడ్డంగి పూర్తిగా తగలబడిపోయింది. ప్రభుత్వ అగ్నిమాపక శకటాలు సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. రసాయన కెమికల్ తో ఉండడం మూలంగా మంటలను అదుపులోకి తేవడానికి 10 గంటల సమయం పట్టింది. స్థానిక పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జిన్నారం, గుమ్మడిదల, పోలీస్ సిబ్బందితోపాటు అగ్నిమాపక సిబ్బంది సంగారెడ్డి, నర్సాపూర్, జీడి మెట్ల, సనత్‌నగర్, పటాన్ చెరువు, దుండి గల్ ఎయిర్‌ఫోర్స్‌కు సంబంధించిన అగ్నిమా పక శకటాలతో మంటలను రాత్రంతా శ్రమించి అదుపులోకి తెచ్చారు. సుమారు 100 మంది పైగా సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఇలాంటి భారీస్థాయిలో అగ్ని మంటలు చెలరేగడం అన్నారం పరిసర ప్రాంతాల్లో ఇది మొదటిది. ఈ కోల్డ్ స్టోరేజీలో వివిధ ప్రాంతాల పరిశ్రమలకు సంబంధించిన రసాయన ఉత్పత్తులు నిల్వ ఉం చారు. ఇతర పదార్థాలు పూర్తిగా కాలి బూడిదగా అయినవి. స్థానికంగా ఉన్న సమీప ప్రాంతాలు, జిన్నారం, జంగంపేట్, గ్రామాలను పూర్తిగా పొగ కమ్మేసింది రెండు గ్రామాల ప్రజలకు ఏం జరిగిందో తెలియక భయాందోళనలో బిక్కుబిక్కు మంటూ కాలం గడిపారు. పరిశ్రమ పూర్తిగా ధ్వంసమైంది స్థానిక ఎస్సై లక్ష్మీ మ్రకాంత్‌రెడ్డి మాట్లా డుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయను న్నట్లు తెలిపారు. ప్రాణనష్టం జరగలేదు పరిశ్రమ, ఉన్న నిల్వ ఉన్న రసాయన, పరిశ్రమ మిషన్లు, ఇతర వస్తువుల నష్టం ఇంకా తెలియాల్సి ఉంది.

# ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ లిస్టు విడుదల

### త్వరలో సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల కోసం నిర్వహించిన పరీక్షలకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్‌ను తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు విడుదల చేసింది. మెరిట్ లిస్టులోని అభ్యర్థులకు త్వరలోనే సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించనున్నట్టు రిక్రూట్‌మెంట్ బోర్డు గురువారం ప్రకటనలో తెలిపింది.

రాష్ట్రంలోని 1284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్ నెం.3/2024ను 2024 సెప్టెంబర్ 11న జారీ చేసింది.

ఈ పోస్టులకి కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సిబిటి)ను నవంబర్ 10, 2024లో నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకి 24,045 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 23,323 మంది పరీక్షకు హాజరయ్యారు.

# ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలకు ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ, ప్రభుత్వానికి నోటీసులు అందజేసింది. గత నెల ఒక పబ్లిక్ మీటింగ్‌లో జాగృతి నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అనుచిత వ్యాఖ్య లు చేసిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌లో హైదరా బాద్‌కు చెందిన న్యాయవాది కారుపోతుల రేవంత్ ఫిర్యాదు చేసింది తెలిసిందే. విచారణ చేపట్టిన కమిషన్ మహిళా ఎమ్మెల్సీపై అనాలోచితంగా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని డీజీపీకి ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసుల్లో పేర్కొంది. నాలుగు వారాల్లో నివేదికను సమర్పించాలని సదరు డీజీపీకి, రాష్ట్ర ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ వివరించింది.


దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను చూడవచ్చును.

టెండర్ ప్రకటన
No. 21-GSU-25-26-Sr.DEE-M-HYB & 22-GSU-25-26-Sr.DEE-M-HYB
PUB/0949

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ Sr.DEE/M/HYB, తేది: 02.09.2025 15.00 గం. ముగింపు తేదీగా క్రింది టెండర్లకు ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు. బిడ్డర్లు వారి ఒరిజినల్/సవరింపు బిడ్స్ ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే దాఖలు చేయగలరు. ఈ టెండర్‌కు మేన్యువల్ ఆఫర్లు అనుమతించబడవు మరియు అటువంటి మేన్యువల్ ఆఫర్లు వచ్చినా పట్టించుకోబడవు.

క్ర.సం. 1. పని వివరణ: టెండర్ నం. 21-GSU-25-26-Sr.DEE-M-HYB: హైదరాబాద్ డివిజన్: SC-DHNE: స్టేషన్ ప్రాంగణాలు మరియు స్టేషన్ ప్లాట్‌ఫారాలు కలిపి ప్యాసింజర్ ఏరియాల వద్ద విద్యుద్దీపాలు వెలుగు స్థాయి అభివృద్ధి-విద్యుత్ ఏర్పాట్లు (మిగిలి పోయిన పనులు). సుమారు ధర (రూ): 5,31,16,722.00, బయానా (రూ): 4,15,600.00, పూర్తి చేయు కాలం: 12 నెలలు, ముగింపు యొక్క తేది: 02.09.2025.

క్ర.సం. 2. పని వివరణ: టెండర్ నం. 22-GSU-25-26-Sr.DEE-M-HYB: హైదరాబాద్ డివిజన్: SC-MUE: స్టేషన్ ప్రాంగణాలు మరియు స్టేషన్ ప్లాట్‌ఫారాలు కలిపి ప్యాసింజర్ ఏరియాల వద్ద విద్యుద్దీపాలు వెలుగు స్థాయి అభివృద్ధి-విద్యుత్ ఏర్పాట్లు (మిగిలి పోయిన పనులు). సుమారు ధర (రూ): 3,79,47,912.00, బయానా (రూ): 3,39,700.00, పూర్తి చేయు కాలం: 12 నెలలు, ముగింపు యొక్క తేది: 02.09.2025.

టెండర్ యొక్క పూర్తి వివరాలు చూడగల నోటీస్ బోర్డ్ ఉంటే లొకేషన్: Sr.DEE-M-HYB, కార్యాలయం, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్-500071.

తదుపరి వివరాలకు మా వెబ్‌సైట్ www.ireps.gov.in వీక్షించండి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/హైదరాబాద్

టెండర్ ప్రకటన నం. 17-2025-26_Sr_DEE_Tr_HYB, తేది: 06.08.2025
PUB/0952

Sr.DEE/TR/HYB, భారత రాష్ట్రపతి తరపున టెండర్ నం. 17-2025-26_Sr_DEE_Tr_HYB, తేది: 06.08.2025కు ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ముగింపు తేది: 28.08.2025 15.00 గం. బిడ్డర్లు వారి ఒరిజినల్/సవరింపు బిడ్స్ ముగింపు తేదీ మరియు సమయం వరకు మాత్రమే దాఖలు చేయగలరు. ఈ టెండర్‌కు మేన్యువల్ ఆఫర్లు అనుమతింపబడవు. అటువంటి మేన్యువల్ ఆఫర్లు వచ్చినా పట్టించుకోబడవు.

క్ర.సం. 1. పని వివరణ: టెండర్ నం. 17-2025-26_Sr_DEE_Tr_HYB : హైదరాబాద్ డివిజన్: MBNR-GWD, GWD-DHNE & MOB-MUE సెక్షన్‌లో SCADA సిస్టమ్స్‌కు సైబర్ సెక్యూరిటీ ఫీచర్ యొక్క ఏర్పాటు. సుమారు ధర (రూ): 1,93,93,080.00, బయానా (రూ): 2,47,000.00, పూర్తి చేయు కాలం: 06 నెలలు, ముగింపు యొక్క తేది: 28.08.2025

టెండర్ పూర్తి వివరాలు చూడగల నోటీస్ బోర్డ్ ఉంటే లొకేషన్: Sr.DEE/TR/HYB, కార్యాలయం, హైదరాబాద్ భవన్, సికింద్రాబాద్- 500025

తదుపరి వివరాలు మా వెబ్‌సైట్ www.ireps.gov.in వీక్షించండి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ (ట్రాక్షన్)/సికింద్రాబాద్
A1175

తదుపరి టెండరు నిబంధనలు/వివరములు మరియు టెండరు డాక్యుమెంట్లు డౌన్‌లోడింగ్‌కు, దయచేసి వెబ్‌సైట్లు http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వద్ద చూడవచ్చును.

వార్త

ఈ ప్రపంచంలో ఓ పేదవాడు ఆధ్యాత్మికంగా ఎదగడానికి ఉన్న అవకాశం, ఆర్థికంగా ఎదగడానికి లేదు.

-జార్జి వాషింగ్టన్

# భారత్‌కు బలనిరూపణ తప్పదా?

**భారత్ స్పష్టమైన స్టాండ్ ప్రతి సమస్యపై తీసుకోవాల్సిన అగత్యం ఇప్పుడు ఏర్పడింది. చైనా, అమెరికాల పద్మవ్యూహంలో చిక్కుకోకుండా భారత్ సొంత నిర్ణయాలు ప్రస్ఫుటించేలా దక్షిణ ఏషియా, తూర్పు ఏషియా దేశాలతో సమిష్టి నాయకత్వం తలపెట్టి చైనా, పాకిస్థాన్ ఎత్తుగడలను త్రిప్పి కొట్టే ప్రయత్నాలు చేయక తప్పదు. నాయకత్వం కావాలని నెత్తిన వేసుకోవాల్సిన అవసరం లేదు. కానీ భారత్ జనాభా దృష్ట్యా చైనాను అధిగమించి మొదటిస్థానానికి వచ్చింది. ఆర్థికంగా ప్రగతి సాధించిన మొదటి అయిదు దేశాలలో భారత్ ఉంది. అవసరమొస్తే తొణక్కుండా మిలటరీ పరంగా బలాన్ని ప్రదర్శించే శక్తియుక్తులున్నాయని ఇప్పటికే నిరూపించుకున్న ఈ తరుణంలో ఏఅవకాశం జారవిడవకుండా తననుతాను కుట్రలూ కుతంత్రాల నుంచి రక్షించుకోవడానికి మరింత బలమైన దేశంగా, ఇతర దేశాలను ప్రభావితం చేసేవిధంగా ఉండకతప్పదు. అప్పుడే భారత్ సార్వభౌమాధికారాన్ని ప్రజాస్వామ్యాన్ని నిలుపుకోగలదు.**



రావులపాటి సీతారాం రావు

అంతర్జాతీయ వాస్తవ పరిస్థితులు నిశితంగా పరిశీలించిన తర్వాత భారత్ ప్రస్తుతం ఆర్థిక వ్యవహారాల మాట అటుంచి భౌగోళికంగా స్థిరంగా తలెత్తుకొని ప్రపంచ రాజకీయ పటంలో వైభోవోపేతమైన కార్యాచరణతల పెట్టాల్సిన అవసరం ఏర్పడింది. ఆపరేషన్ సిందూర్ ముందు భారత్‌కు అనుకూలంగా అంతర్జాతీయ పరిస్థితులు ఉన్నాయని చెప్పలేని స్థితి. టెర్రరిస్టులను బాహాటంగా ఖండించడానికి పూనుకోలేని అగ్రరాజ్యాలు (యూరప్ దేశాలతో సహా) ఇప్పుడు పాకిస్థాన్, చైనా కుటీల దాడులను ఉగ్రవాదుల వెనుక ఉండి చేయించిన దాఖలాలు నెమ్మది నెమ్మదిగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అగత్యం ఏర్పడింది. అమెరికన్ ప్రసిడెంట్ ట్రంప్ కప్పదాటు వ్యవహారాలనుఅన్ని దేశాలూ గమనించే స్థితి నెలకొంటున్నది. పాకిస్థాన్ ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్, అమెరికన్ ప్రసిడెంట్ ట్రంప్‌తో జరిపిన అట్టహాసపు లంచ్ భోజనం 'పహల్గాం దాడి మేము చేసిందే' అని ఫారిన్ టెర్రరిస్టు ఆర్గనైజేషన్‌గా ఏర్పడిన అమెరికన్ డిజిగ్నేటెడ్ ది రిసిస్టెన్స్ ఫ్రంట్ (టి.ఆర్.ఎఫ్) ప్రకటించటంతో ప్రాధాన్యత కోల్పోయింది. యు.ఎన్. సెక్యూరిటీ కౌన్సిల్ మానిటరింగ్ టీమ్ కూడా పహల్గాం దాడి టి.ఆర్.ఎఫ్ చేసిందే అని రిపోర్టు ద్వారా ప్రకటించడంతో అంతర్జాతీయంగా దౌత్యపరమైన ప్రాముఖ్యత, భారత్ తిరిగి సంపాదించుకున్నట్లయింది. నిజానికి భారత్‌కు ట్రంప్ ఎన్నో అవరోధాలు సృష్టించాడు. ఒకవైపు భారత్‌తోస్నేహం ఉందని నటిస్తూనే, రష్యా వల్ల చమురు ఖనిజాల విషయంలో లాభం పొందుతూనే రష్యాకు భారత్ దగ్గరగా జరుగుతున్నదన్న అనుమానాలు అంతర్జాతీయంగా సృష్టించడానికి విఫల ప్రయత్నాలు చేశాడు. డోనాల్డ్ ట్రంప్ ఎత్తుగడలు అడ్డగోలుగా అనిపిస్తాయి కానీ ట్రంప్‌కు తన ఎత్తుగడలూ, వ్యూహాలూ ప్రతివ్యూహాల పట్ల పూర్తి అవగాహన ఉంది. తనదేశం పరాయి దేశాల మీద ఆధారపడి ఉండటం ఒకప్పుడు లాభించింది. అమెరికాను సుసంపన్నం చేసింది. కానీ ఆ బలమే ఇప్పుడు బలహీనత అయింది. తమ దేశంలోని వలసదారులు తమ దేశవాసులకంటే అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారు. అగ్రరాజ్యంగా ఉన్నంతవరకూ ఆ విధమైన వారి అభివృద్ధి, అమెరికాకు ఇబ్బందికరంగా పరిగణించలేదు. కానీ ఇప్పుడు వారే తమను దాదాపు అగ్రరాజ్యం స్థాయి నుంచి కిందికి దింపుతున్నారు. అది వారు కావాలని చేయడం లేదు. కానీ అమెరికాలో సంపాదించింది తమ దేశాలకు పంపుతుండటం వల్ల అది దాదాపు అమెరికా స్థాయిలో ఆర్థికంగా బలపడటమే కాకుండా, తమనే శాసించే స్థాయికి చేరుకుంటున్నాయి. ఈ పరిణామం ఇంతకుముందు ఉన్న అధ్యక్షులు పట్టించుకోలేదు. కానీ ట్రంప్ రాకతో దీనిని ముఖ్యాంశంగా మార్చి అమెరికన్ ప్రజల్లోకి తీసుకుని వెళ్లడంలో కొంతవరకు కృతకృత్యుడయ్యాడు. చైనా మళ్లీ భారతదేశ సరిహద్దులలో 'యాక్టివ్'గా ఉండటానికి సాధన సంపత్తులను సిద్ధం చేసుకుంటున్నది. కొత్తగా కొన్ని దేశాలతో గ్రూపులు కట్టి తన ఆధిపత్యాన్ని అజమాయిషీని ఇటు



తూర్పు ఏషియాలోనూ, అటు పశ్చిమ ఏషియాలోనూ చెలాయించడానికి ఆరాటపడుతున్నది. జూన్ 19, 2025న కున్మింగ్‌లో పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో సమావేశం ఏర్పాటు చేసుకుంది. త్రైపాక్షిక ఒడంబడిక లాంటిది తెరమీదికి తేవాలని ప్రయత్నించింది కానీ బంగ్లాదేశ్ చిన్నగా తప్పుకొని, పెద్దగా ఆసక్తి కనపర్చకపోవటంతో ఆ ఒప్పందం ఆదిలోనే ఆగిపోయింది. అయినా బంగ్లాదేశ్‌లోని లాల్ మొనిర్‌హాట్ రెండవ ప్రపంచ యుద్ధంలో వాడిన ఎయిర్‌బేస్‌ను తిరిగి సిద్ధం చేయడానికి చైనా ముందుకు వచ్చింది. ఈ ఎయిర్ బేస్ సిలిగురి కారిడార్‌కు దగ్గరగా ఉంటుంది. పాకిస్థాన్‌కు, ఆపరేషన్ సిందూర్ ఇండియా తలపెట్టినప్పుడు చైనా అనేక రకాలుగా సహాయసహకారాలు అందించింది. దీనికి తగ్గరుజువులు కూడా భారత్‌కు దొరికాయి. ఆ సాక్షాలను చాలా దేశాలు కూడా బయటపెట్టకపోయినా వాస్తవాలుగా గుర్తించాయి. అది ఒక విధంగా దౌత్యపరంగా భారత్ సాధించిన విజయం. అరుణాచల్‌ప్రదేశ్ మీద చైనా ఎన్నో సంవత్సరాల నుంచి కన్నేసి ఉంది. చైనా పైచేయిని ప్రస్ఫుటించేలా పేచిపెట్టి అరుణాచల్‌లో తమ పేర్లను ప్రపంచ పటాలపై తేవటానికి ప్రయత్నిస్తున్నది. దలైలామా వ్యవస్థను కూడా భవిష్యత్తులో భారత్ నుంచి లాక్కోవాలనే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నది. ట్రేడ్ లావాదేవీలలో కూడా చైనా ఆధిపత్యం భారత్‌పై స్పష్టంగా కనపడుతున్నది. ఇవ్వన్నీ అటుంచితే ప్రమాదకరమైన విధంగా చైనా అతిపెద్ద డామ్ టిబెట్‌లో యార్లంగ్ జాంగ్బో (బ్రహ్మపుత్రకు టిబెట్ పేరు) కట్టున్నది. ఇది భారతదేశ సరిహద్దులకు చాలా దగ్గర! మాల్దీవ్స్‌లో ప్రధాని మోడీ ఈ మధ్యనే పర్యటించి చైనా ప్రభావాన్ని అక్కడ తగ్గించే ప్రయత్నం చేశారు. యూరప్ దేశాలు కూడా ఆపరేషన్ సిందూర్ ముందు భారత్‌తో అంత సఖ్యతగా లేకపోవడం దురదృష్టకరం. అమెరికా ప్రభావం ఒక కారణమైతే భారత్ ఆర్థికాభివృద్ధిలో నాలుగోస్థానానికి ఎగబాకటం ఈ దేశాలకు కంటకంగానే ఉంది. అయితే ఈ మధ్య వాస్తవ పరిస్థితులు గమనించడం వల్లనో ఏమో యు.కే కాంప్రహెన్సివ్ ఎకనామిక్ అండ్ ట్రేడ్ అగ్రిమెంట్ (సిఇటిఏ) భారత్‌తో చేసుకోవటంతో యూరప్ దేశాల పరిస్థితులలో కొంత మార్పు వస్తున్నట్లుగా భావించవచ్చు. యు.ఎస్.ఏను చైనాను భారత్ నమ్మే పరిస్థితిలేదు. రష్యాతో సంబంధాలు బాగానే ఉన్నట్లు కన్పిస్తున్నా ఇజ్రాయిల్, ఉక్రెయిన్ గొడవల్లో కచ్చితమైన స్టాండ్ తీసుకోలేదనే కినుక రష్యాకు ఉంది. బయటపడకపోయినా, ఇజ్రాయిల్ విషయంలో భారత్ ఈ మధ్యన కొంత మార్పు, దౌత్యపరంగా చేసినట్లుంది. ఆ విధంగా రష్యా బుజ్జగించబడినట్లు దౌత్యవర్గాలు చెబుతున్నాయి. ఏదిఏమైనా భారత్ స్పష్టమైన స్టాండ్ ప్రతి సమస్యపై తీసుకోవాల్సిన అగత్యం ఇప్పుడు ఏర్పడింది. చైనా, అమెరికాల పద్మవ్యూహంలో చిక్కుకోకుండా భారత్ సొంత నిర్ణయాలు ప్రస్ఫుటించేలా దక్షిణ ఏషియా, తూర్పు ఏషియా దేశాలతో సమిష్టి నాయకత్వం తలపెట్టి చైనా, పాకిస్థాన్ ఎత్తుగడలను త్రిప్పి కొట్టే ప్రయత్నాలు చేయక తప్పదు. నాయకత్వం కావాలని నెత్తిన వేసుకోవాల్సిన అవసరం లేదు. కానీ భారత్ జనాభా దృష్ట్యా చైనాను అధిగమించి మొదటిస్థానానికి వచ్చింది. ఆర్థికంగా ప్రగతి సాధించిన మొదటి అయిదు దేశాలలో భారత్ ఉంది. అవసరమొస్తే తొణక్కుండా మిలటరీ పరంగా బలాన్ని ప్రదర్శించే శక్తియుక్తులు ఉన్నాయని ఇప్పటికే నిరూపించుకున్న ఈ తరుణంలో ఏ అవకాశం జారవిడవకుండా తనను తాను కుట్రలూ కుతంత్రాల నుంచి రక్షించుకోవడానికి మరింత బలమైన దేశంగా, ఇతర దేశాలను ప్రభావితం చేసే విధంగా ఉండక తప్పదు. అప్పుడే భారత్ సార్వభౌమాధికారాన్ని ప్రజాస్వామ్యాన్ని నిలుపుకోగలదు. •

## ఆదరణ కోల్పోతున్న ప్రభుత్వ విద్య?

ఒకనాడు ఎంతో పవిత్రంగా భావించి ఆరాధించి, పూజించిన విద్య రానురాను అంగడి సరుకుగా మారిపోతున్నది. ప్రస్తుతం విద్య ఒక వ్యాపారంగా రూపుదాల్చింది. విద్యనేకాదు విద్యార్థులతోసహా విద్యాసంస్థలను అమ్ముకునే దురదృష్టపు రోజులు దాపురించాయి. విద్యాశాఖ అసమర్థతకు నిదర్శనంగా విద్యావ్యాపారం తెలుగు రాష్ట్రాల్లోనే కాదు ఆ మాట కొస్తే దేశవ్యాప్తంగా రోజురోజుకు విస్తరించిపోతున్నది. ఇది ప్రైవేట్ రంగంలో వెర్రితలలు వేస్తున్నది. లాభసాటిగా ఉన్న ఈవ్యాపారంలో గతంలో ఇతర వ్యాపారాలు చేసేవారు, కాంట్రాక్టర్లు, అన్నింటికంటే ముఖ్యంగా రాజకీయ నాయకులు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భాగస్వాములు అవుతున్నారు. విద్యాశాఖలో పటిష్టమైన చట్టాలున్నా అమలు చేయగలిగిన సామర్థ్యం గల అధికార గణం ఉన్నాపరిస్థితి రానురాను అగమ్యగోచరంగా మారుతున్నది. వాస్తవంగా చూస్తే ఒకనాడు ప్రభుత్వ పాఠశాలలే తప్ప ప్రైవేట్ బడులు లేవు. ఎక్కడో పట్టణాల్లో, నగరాల్లో నడిచేవి. వాటిల్లో కూడా వ్యాపార ధోరణులు కన్పించేవి కావు. లాభనష్టాలతో సంబంధం లేకుండా కేవలం సేవా దృక్పథంతో విద్యాసంస్థలు సేవలు అందించేవి. నిర్వాహకులు సామాజిక బాధ్యతగా భావించి ఆ బడులను నడిపేవారు. అందువల్ల ఆనాటి ప్రైవేట్ పాఠశాలలను అరికట్టే అవసరం లేకుండాపోయింది. అందుకు అప్పట్లో చట్టాల అవసరం తలెత్తలేదు. ప్రభుత్వరంగంలో కూడా ఆనాడు అంతోఇంతో పటిష్టంగా నడిచేవి. రాజకీయ జోక్యాలుండేవి కావు. కానీ పరిస్థితులు మారిపోయాయి. పాలకుల అశ్రద్ధ, అరకొర నిధులు, ఆశ్రిత పక్షపాతం వీటన్నింటిని మించిన రాజకీయ జోక్యంతో విద్యాప్రమాణాలు నానాటికీ దిగజారిపోతున్నాయి. రాబోయే రోజుల్లో పరిస్థితులు ఎలా ఉంటుందోననే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బీదా బిక్కి జనం కూడా నాణ్యమైన విద్య ప్రైవేట్ పాఠశాలల్లోనే దొరుకుతుందనే భ్రమలో ఆవైపే మొగ్గుచూపుతున్నారు. ఏమాత్రం ఆర్థిక వసతి లేనివారు, మరోదారి లేనివారు విధిలేని పరిస్థితుల్లో ప్రభుత్వ పాఠశాలల బాటపడుతున్నారు. ఇప్పుడు ఈ వ్యాపారం గ్రామాలకే కాదు శివారు పల్లెలకు కూడా వ్యాపించింది. కొందరు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు శివారు పల్లెలకు, తండాలకు బస్సులను, ఆటోలను ఏర్పాటుచేసి పిల్లలను తమ స్కూళ్లకు రప్పించుకుంటున్నారు. రానురాను పరిస్థితి ఇలానే ఉంటే ప్రభుత్వ పాఠశాలల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల కాలంలో యేడాది యేడాదికి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే ప్రైవేట్ రంగంలో పెరిగిపోతున్నారు. 2021-22 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య ముప్పైలక్షల డెబ్బైఎనిమిది వేల నూట ఎనభై తొమ్మిది ఉండగా ప్రైవేట్ బడుల్లో ఇరవైఎనిమిది లక్షల అరవైఏడు వేల ఐదువందల తొంభైఏడు మంది ఉన్నారు. అయితే 2022-23 విద్యాసంవత్సరం నాటికి ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల సంఖ్యతగ్గి ప్రైవేట్ స్కూళ్లలో పెరిగిపోయింది. సర్కారు బడుల కంటే ప్రైవేట్ స్కూళ్లలో దాదాపు రెండులక్షల మందికిపైగా అడ్మిషన్లు అదనంగా తీసుకున్నారు. 2023-24 సంవత్సరంలో ప్రభుత్వ స్కూళ్లలో చేరేవారి సంఖ్య మరింత తగ్గిపోయింది. గత పదేళ్లుగా పరిశీలించినా ఈ తగ్గుదల నమోదవుతూనే ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి ఎటువైపు దారిస్తుందో? ఎందుకు ఈ పరిస్థితి దాపురిస్తున్నది? కారకులెవరు? కారణాలు ఏమిటి?అనేది అటు అధికార వర్గాలకు కానీ, ఇటు పాలకులకు కానీ తెలియంది కాదు. ప్రభుత్వ పథకాలు, ఆశయాలు కాగితాల వరకు బాగానే ఉన్నాయి. ఎన్నో ప్రోత్సాహకాలుప్రకటిస్తున్నారు. మధ్యాహ్న భోజనం, పుస్తకాలు లాంటి ఎన్నో ప్రోత్సాహకాలతో పాటు ఫీజులుండవు. కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వపరంగా ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా అటు ప్రైవేట్ విద్యాసంస్థలు ముక్కుపిండి ఫీజులే కాదు పుస్తకాలు, డొనేషన్ల పేరుతో పెద్దఎత్తున డబ్బులుగుంజుతున్నా ఆ మేరకు చెల్లించి అటువైపే మొగ్గుచూపుతున్నారు తప్ప ప్రభుత్వ పాఠశాలలవైపు చూడడం లేదు. పోనీ బోధకుల విషయంలో పరిశీలించినా ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొంది అర్హత, అనుభవం కలిగిన ఎందరో ఉపాధ్యాయులున్నారు. అదే ప్రైవేట్ పాఠశాలల్లో ఆ పరిస్థితి లేదు. పోల్చడానికే వీల్లేదు. అయినా అటువైపే మొగ్గుచూపుతున్నారు. అయితే ప్రభుత్వపరంగా కొన్ని లోపాలున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా పాఠశాలల్లో కనీస వసతుల కొరత తీవ్రంగా ఉంది. తెలుగు రాష్ట్రాల్లో పరిశీలించినా అనేక ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మంచి నీరు, మరుగుదొడ్లు వంటి కనీస వసతులు లేకపోవడం వల్ల ప్రధానంగా బాలికలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీకావు. ఏడున్నర దశాబ్దాలు దాటిపోయినా అందరికి విద్య అందించాలనే లక్ష్యం ఇప్పటికీ కనుచూపుమేరలో కన్పించడం లేదు. దేశాభివృద్ధికే కాదు మానవజాతి అభ్యున్నతికి విద్య పునాది అనేది నిర్వివాదాంశం. ఆరేళ్ల నుంచి పద్నాలుగేళ్ల బాలబాలికలందరికి ఉచిత విద్య అందించాలనే కార్యక్రమం పదేళ్లలో పూర్తి చేయాలని స్వాతంత్ర్యం రాగానే పెద్దలు నిర్ణయించారు. ఆ సంకల్పం కాగితాల్లోనే కన్నుమూసింది. ఇక డిపెప్, ఎపెప్, సర్వశిక్ష అభియాన్ వంటి కార్యక్రమాలు చేపట్టి దేశవ్యాప్తంగా లక్షలాది కోట్ల రూపాయలు వెచ్చించారు, వెచ్చిస్తున్నారు. ఆశించిన ఫలితాలు లభించడం లేదు. ఇప్పటికైనా పాలకులు కళ్లు తెరవాలి. బాలబాలికలను భావిపౌరులుగా తీర్చిదిద్దాల్సిన ప్రభుత్వ విద్యావ్యవస్థను ఇలాంటి పరిస్థితుల్లోకి నెట్టడం ఏ మాత్రం సమంజసంకాదు.

ఆకలి రుచి ఎరుగనట్లే మనకు అత్యవసరమైన దాంట్లో తప్పులు కనిపించవు.



ఆస్కార్‌వైల్డ్

ఆలోచన మనిషిని కార్యోన్ముఖుణ్ని చేస్తుంది. అందుకే ప్రతి వారికి సరైన ఆలోచన అతి ముఖ్యమైనది.



ఎమర్సన్

# సాగరాలూ మానవ మనుగడకు ఆధారం

డి జె మోహన రావు

మన భూమి ఉపరితలంపై ఏకంగా 70శాతం ఆవరించి ఉన్న సాగరాలు కేవలం నీటి రాశులు మాత్రమేకాదు. అవి ఈ భూమికి ప్రాణం, సమస్త జీవరాశి మనుగడకు అత్యంత కీలకమైన పనులు చేస్తాయి. మనం పీల్చే ఆక్సిజన్‌లో కనీసం సగానికి పైగా సాగరాలే ఉత్పత్తి చేస్తాయి. కోట్లాది మందికి అన్నం పెట్టి, ప్రపంచంలోని 80శాతం జీవవైవిధ్యాన్ని తమ ఒడిలో చేర్చుకుని, సాగరం మన మనుగడకు ప్రధాన ఆధారం. ఆర్థికంగా కూడా ఇది చాలా కీలకం. 2030 నాటికి సుమారు 4 కోట్ల మంది సాగర ఆధారిత పరిశ్రమల్లో బతుకుతెరువు పొందవచ్చని అంచనా. అయినప్పటికీ, ఈ అమూల్యమైన ప్రకృతి సంపద ఇప్పుడు ఊహించని బెదిరింపులను ఎదుర్కొంటోంది. దశాబ్దాల తరబడి మనిషి చేసిన కార్యకలాపాలు మన సాగరాలను పతనం అంచుకు నెట్టేశాయి. దీనివల్ల సాగర పర్యావరణ వ్యవస్థలకు, తద్వారా మానవ జాతికి తీవ్రమైన పరిణామాలు తప్పడం లేదు. సాగర జీవనం, జీవవైవిధ్యానికి తగులుతున్న అతి పెద్ద దెబ్బల్లో ఒకటి అతి చేపల వేట. చేపల సంఖ్య వాటి పునరుత్పత్తి సామర్థ్యం కంటే వేగంగా పట్టుబడినప్పుడు ఇది జరుగుతుంది. ఫలితంగా వాటి సంఖ్య అడుగంటిపోతుంది. 2024నాటికి, ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ పర్యవేక్షిస్తున్న 500 చేపల నిల్వల్లో 37శాతం పైగా అతిగా వేటాడబడుతున్నాయని అంచనా. ఇది 1970తో పోలిస్తే మూడు రెట్లు ఎక్కు! అతి చేపల వేట వల్ల కలిగే పరిణామాలు చాలా భయంకరమైనవి. కుప్పకూలుతున్న చేపల సంఖ్య సాగర జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తుంది. పర్యావరణ వ్యవస్థల సున్నితమైన సమతుల్యతను చిందరవందర చేస్తుంది. సముద్రపు ఆహారంపై ఆధారపడే లక్షలాది మంది ప్రజల జీవనోపాధిని, ఆకలిని ప్రమాదంలో పడేస్తుంది. 1992లో కెనడాలోని గ్రాండ్ బ్యాంక్స్ కాడ్ ఫిషరీ మొత్తం నాశనం కావడం, దానివల్ల 35,000 మంది మత్స్యకారులు నిరుద్యోగులు కావడం, ఒక గుణపాఠం లాంటిది. 2024 ప్రపంచ ఆక్వాకల్చర్ స్థితి (సోఫియా) నివేదిక ఈ సంక్షోభాన్ని మరింత స్పష్టం చేసింది. చేపల నిల్వల్లో మూడింట ఒక వంతుకు పైగా (37.7 శాతం) స్థిరమైన పరిమితులను మించి వేటాడబడుతున్నాయి. అతి చేపల వేట ప్రధానంగా స్వల్పకాలిక లాభాపేక్ష, సరైన సమాచారం లేకపోవడం, నివేదించబడని, నియంత్రించబడని చేపల వేట వల్లనే జరుగుతుంది. చేపలను ఉద్దేశపూర్వకంగా పట్టడంతో పాటు, అనుకోకుండా చిక్కిన చేపలు సమస్య పరిస్థితిని మరింత దిగజార్చుతుంది. చేపల వేట కార్యకలాపాల సమయంలో అనుకోకుండా వలలో పడే సముద్ర జాతులను ఇది సూచిస్తుంది. ఈ విచక్షణారహిత పద్ధతి తాబేళ్లు, డాల్ఫిన్‌లు వంటి అంతరించిపోతున్న, బెదిరింపులకు గురైన రక్షిత జాతుల ప్రాణాలకు ముప్పు తెస్తుంది. ఇది ఇతర జాతులు ఆహారంగా ఆధారపడే చేపలను తొలగించడం ద్వారా ఆహార గొలుసును కూడా దెబ్బతీస్తుంది. చిన్న చేపల సంఖ్యను నాశనం చేస్తుంది. అవి పునరుత్పత్తి వయస్సుకు చేరకుండా అడ్డుకుంటుంది. గత 50 సంవత్సరాలలో చేపల వేట వల్ల సాగర జీవవైవిధ్యం కోల్పోవడం మన సాగరాలపై అత్యంత తీవ్రమైన ప్రభావాన్ని చూపింది. మన భూమి వాతావరణాన్ని నియంత్రించడంలో సాగరం కీలక పాత్ర పోషిస్తుంది. భూమి వాతావరణంలో పేరుకుపోయిన వేడిలో 93శాతం శిలాజ ఇంధనాల నుండి విడుదలయ్యే కార్బన్ డయాక్సైడ్లో నాలుగింట ఒక వంతును అది గ్రహిస్తుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఆమ్లీకరణ సాగర ఆవాసాలు జాతుల నష్టానికి దారితీస్తాయి. మారుతున్న ప్రవాహాలు చేపల సంఖ్య పంపిణీని మారుస్తున్నాయి. మొత్తం పర్యావరణ వ్యవస్థల రూపురేఖలను మార్చేస్తున్నాయి. మన సాగరాలను నిలబెట్టుకోవాలంటే, మనం ఈ వాతావరణ ప్రేరిత మార్పులకు అనుగుణంగా మన చేపల వేట పద్ధతులను మార్చుకోవాలి. మనం స్థిరమైన చేపల వేట పద్ధతులను అవలంబించాలి. అక్రమ చేపల వేటను అరికట్టాలి, వాతావరణ మార్పులను తగ్గించాలి. సంరక్షణ ప్రయత్నాలలో చురుకుగా పాల్గొనాలి. •

# కట్టడి చేయకుంటే తిప్పలే!

ఫిరోజ్ ఖాన్

ఒక్క చిట్కాతో బరువు తగ్గొచ్చు. ఈ ఒక్క ఆహారంతో అన్ని రోగాలు మటుమాయం. వైద్యులు చెప్పని నిజాలు వారం రోజుల్లో క్యాన్సర్‌ను నయం చేసే ఆహారం ఇటీవలి కాలంలో సోషల్ మీడియాలో ఈ తరహా శీర్షికలు ఎక్కువయ్యాయి. ఇలాంటి వీడియోలను అనుసరిస్తూ తమ ఆహారంలో మార్పులు చేసుకుంటున్న కొందరు ఇటీవల ఆస్పత్రుల పాలయ్యారు. ఇలాంటి ఒక రకమైన డైట్‌ను పాటించి 2025 మార్చిలో కేరళలో ఓ పద్దెనిమిదేళ్ల యువతి మరణించింది. ఎలాంటి డిగ్రీలు పొందకుండా, శాస్త్రీయ ప్రయోగాలు చేయకుండా ఈ సోకాల్డ్ న్యూట్రీషియనిస్టులు, డైటీషియన్లు, థెరపిస్టులు ఇస్తున్న సలహాల వల్ల ప్రపంచవ్యాప్తంగానూ అనేక మరణాలు సంభవిస్తున్నాయి. ఇన్‌స్టాగ్రామ్‌లో దాదాపు 50డైటరీ, న్యూట్రిషన్ సలహాలు తప్పుగా లేదా శాస్త్రీయ ఆధారం లేకుండా ఉన్నాయని 2024లో డీకిన్ విశ్వవిద్యాలయం నిర్వహించిన ఒక అధ్యయనం తేల్చింది. నూటికి 60శాతం మంది భారతీయులు ఆరోగ్య సమాచారాన్ని సోషల్ మీడియా నుంచే పొందుతున్నారని ఐఏఎంఏఐ 2024 డేటా చెబుతున్నది. ఈ నేపథ్యంలో భారతదేశంలో వేగంగా వ్యాప్తి అవుతున్న తప్పుడు ఆరోగ్య సమాచారానికి అడ్డుకట్ట వేయకపోతే భవిష్యత్తులో భారీ నష్టం సంభవించే ప్రమాదముంది. ఎలాంటి చదువులు, డిగ్రీలు లేకున్నా, ప్రస్తుతం సోషల్ మీడియాలో అనేక మంది తమను తాము న్యూట్రీషియనిస్టులు, డైటీషియన్లుగా ప్రకటించుకుంటున్నారు. మరికొందరైతే వైద్యులుగా, వివిధ రకాల థెరపిస్టులుగా చెలామణి అవుతున్నారు. ఆరోగ్యం, పోషకాహారం, వైద్యానికి సంబంధించి యూట్యూబ్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్ట్రాగ్రామ్ వంటి వేదికల్లో సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ఇంకొందరైతే ఒకడుగు ముందుకువేసి క్యాన్సర్ వంటి రోగాల నివారణకు మిరాకిల్ డైట్స్‌ను సూచిస్తున్నారు. అయితే వీటికి ఎలాంటి శాస్త్రీయ ఆధారాలు ఉండడంలేదు. వీరు చెబుతున్న అసత్యాలు, అర్ధసత్యాలను విని చాలా మంది తమ ఆరోగ్యాన్ని పాడు చేసుకుంటున్నారు. సరైన చికిత్సను నిర్లక్ష్యం చేస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. గతంలోనే ఆందోళన వ్యక్తం చేసిన ఐఎంఏ క్యాన్సర్, ఇతర తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారు సోషల్ మీడియాలో చూసిన తప్పుడు సలహాలు నమ్మి సరైన వైద్యాన్ని, చికిత్సను ఆలస్యం చేస్తున్నారు. దీని వల్ల వ్యాధి ముదురుతున్నది. అనంతరం చికిత్స చేయడం కష్టమవుతున్నది అని గతంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ చాలాసార్లు ఆందోళన వ్యక్తం చేసింది. అంతేకాకుండా తమ స్వలాభం కోసం కొంతమంది నకిలీ నిపుణులు మార్కెట్లో లభించే కొన్ని ఉత్పత్తుల అడ్వర్టయిజ్మెంట్ కోసం తక్కువ నాణ్యత గల ప్రొడక్ట్స్ గురించి సలహాలు, సూచనలు ఇస్తుండడంతో వాటిని తీసుకున్న వారి కాలేయం, కిడ్నీలపై ప్రభావం పడుతున్నట్లు తెలుస్తున్నది. 2023లో అమెరికన్ బెవరేజ్‌కెనడియన్ షుగర్ ఇన్‌స్టిట్యూట్ వంటి సంస్థలు ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్‌లో రిజిస్టర్డ్ డైటీషియన్లను పెయిడ్ ఇన్‌ఫ్లుయెన్సర్లుగా నియమించి, ఆస్పర్టమే (కృత్రిమ స్వీటెనర్), షుగర్



వినియోగాన్ని ప్రోత్సహించే వీడియోలను పోస్ట్ చేయించాయి. ఈ పోస్టుల్లో స్పాన్సర్‌షిప్‌ను స్పష్టంగా వెల్లడించకపోవడంతో, అమెరికాలో ఫెడరల్ ట్రేడ్ కమిషన్ హెచ్చరికలు జారీ చేసింది. న్యూట్రీషియన్లు, డైటీషియన్లుగా చెప్పుకుంటున్న చాలా మంది కొన్ని రకాల ఆహార పదార్థాలను పూర్తిగా మానేయమని సలహా ఇస్తున్నారు. దీనివల్ల శరీరానికి అవసరమైన పోషకాలు లభించక పోషకాహార లోపం ఏర్పడుతున్నది. బరువు తగ్గడం, లేదా ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నది. మరికొందరు ఒకే రకమైన ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని చెబుతుండడంతో అవసరమైన విటమిన్లు, ప్రొటీన్లు, మినరల్స్ అందకుండాపోతున్నాయి. అంతేకాకుండా కొంతమంది ఇస్తున్న తప్పుడు సలహాలు దీర్ఘకాలం పాటించినా.. బరువు తగ్గకపోవడం, ఆరోగ్యం మెరుగు కాకపోవడంతో అనేక మంది మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతున్నది. ఇన్‌స్టాగ్రామ్‌లో అనేక మంది ఇన్‌ఫ్లుయెన్సర్లు అపెటమిన్ వంటి ఔషధాలను ప్రమోట్ చేస్తున్నారు. ఇవి ఆకలిని పెంచే లక్షణాలతో శరీర ఆకృతిని మార్చడానికి ఉపయోగపడతాయని చెబుతారు. అయితే, ఈ ఔషధం ఎఫ్‌డీఏ ఆమోదం పొందలేదు. లివర్ టాక్సిసిటీ వంటి తీవ్రమైన దుష్ప్రభావాలను సైతం కలిగిస్తున్నది. సెలరీ జ్యూస్ డిటాక్స్ లేదా గ్రీన్‌పౌడర్స్ వంటి ఉత్పత్తులు ఆరోగ్యప్రయోజనాలను అందిస్తాయని ఇన్ ఫ్లూయెన్సర్లు చెబుతున్నా వీటికి ఇప్పటికీ శాస్త్రీయ ఆధారాలు లేవు. సంబంధిత రంగానికి సంబంధించి ఎలాంటి చదువు, డిగ్రీలు లేకుండా న్యూట్రీషియనిస్ట్, డైటీషియన్, థెరపిస్ట్ ఇలా పేర్ల పక్కన పెట్టుకుంటూ సలహాలు ఇచ్చే వారిని కట్టడి చేయకుంటే భవిష్యత్తులో ప్రజా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదముంది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించాల్సిన అవసరమున్నది. డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్ట్1954 ప్రకారం రోగ నివారణలపై ఎలాంటి ప్రమాణాలు లేకుండా ప్రకటన చేయడం నిషిద్ధం. కన్స్యూమర్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం మోసపూరిత సేవలందించిన వారిపై చర్యలు తీసుకోవచ్చు. ఐటీ యాక్ట్ ప్రకారం తప్పుడు సమాచారం పంపిన వారికి జైలు శిక్ష, జరిమానా కూడా విధించొచ్చు. 2023లో కేంద్రం తీసుకొచ్చిన డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు ఆన్‌లైన్‌లో తప్పుడు సలహాలు ఇస్తూ తప్పుడు సమాచారం వ్యాప్తి చేసే వారిపై చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడుతుంది. అనర్హులైన వ్యక్తులు వైద్యసలహాలు ఇవ్వడం భారతదేశంలో ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్, 1956లేదా డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ 1940 కింద నేరంగా పరిగణించబడవచ్చు. అయితే ఇప్పటి వరకు వీటిని కఠినంగా అమలు చేసిన సందర్భాలు చాలా తక్కువ. ఈ చట్టాలను కఠినంగా అమలు చేయడం ద్వారా నకిలీ వైద్యులను శిక్షించవచ్చు. అంతేకాకుండా ఎలాంటి శాస్త్రీయ ప్రయోగాల్లో రుజువు కాని విషయాలను చెబుతూ నకిలీ వైద్య సలహాలు ఇచ్చే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా మరిన్ని ప్రత్యేక చట్టాలను రూపొందించాల్సిన అవసరమున్నది. ఇన్‌ఫ్లుయెన్సర్లకు స్పాన్సర్‌షిప్‌ను స్పష్టంగా వెల్లడించమని అమెరికాలో ఎఫ్టీసీ ఆదేశించింది. ఇలాంటి నిబంధనలను భారతదేశంలో కూడా అమలు చేయవచ్చు. అంతేకాకుండా సోషల్ మీడియాలో వచ్చే ప్రతి సలహాను గుడ్డిగా నమ్మవద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలను రూపొందించి అమలు చేయాలి. ఐఎంఏ వంటి సంస్థలు దీనికి చొరవ చూపాలి. తమ వేదిక ద్వారా తప్పుడు సలహాలు, సమాచారం వ్యాప్తి చేయకుండా యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్ స్టాగ్రామ్, ఎక్స్‌వంటి సంస్థలు కూడా చర్యలు కఠిననిబంధనలు రూపొందించి అమలు చేయాల్సిన అవసరమున్నది. సోషల్ మీడియా వేదికలుగా సలహాలు ఇస్తున్న వారు నిజమైన వైద్యులేనా? ఆహారాన్ని సూచిస్తున్న వారు నిజంగానే డిగ్రీలు పొంది ఉన్నారా? అనేది తెలుసుకోవాలి. •

# ప్రజావాక్కు



### ఆశ్రమ స్కూల్స్‌లో ఫుడ్ పాయిజన్

జయశంకర్ భూపాల్ పల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం కోర్కిశాలలోని కస్తూర్బా గాంధీ ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్ జరిగి 32 మంది విద్యార్థినీలు వాంతులు విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురి కావడం బాధాకరం విద్యార్థినిలను మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆసుపత్రికితరలించగా, మిగతా విద్యార్థినిలను చిట్యాల మండల కేంద్రంలోని సివిల్ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. సోమవారం ఉదయం విద్యార్థినిలకు కిచిడితోపాటు టమాటపచ్చడి అల్పాహారంగా ఇచ్చారు. అల్పాహారంలో వచ్చిన పురుగుల మూలంగా విద్యార్థినిలు వాంతులు విరోచనాలతో అస్వస్థతకు గురయ్యారని తెలుస్తుంది. పరిస్థితిని గమనించిన పాఠశాల ఉపాధ్యాయినీలు విద్యార్థినీలను ఆస్పత్రికి తరలించారు. మరో మారు ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

- కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్, భూపాల్ పల్లి జిల్లా

### ప్రాణాలను కబళిస్తున్న కల్తీ కల్లు

కల్తీకల్లు తాగి ఈమధ్య కొందరు అస్వస్థకు గురయ్యారు. దాదాపు డజనుమంది దాకా మరణించారు. అయితే ఇలాంటి ఘటనలు జరగడం మొదటిసారి కాదు. అడపదడపా జరుగుతూనే ఉన్నాయి. సంబంధిత అధికారులు ముందు జాగ్రత్తలు తీసుకోకుండా ఘటన జరిగి అంతా అయిపోయాక రంగంలోకి దిగి శాంపిల్స్ అని అదని, ఇదని నానాహడావిడి చేస్తారు. తరువాత ఏమీ ఉండదు. రాజకీయపార్టీలవారేమో ఇలాంటి ఘటన జరగడం ఇంత మంది చనిపోవడం దురదృష్టమంటూ కళ్లనీల్లు పెట్టుకుంటారు. బాధిత కుటుంబాల పట్ల సానుభూతి చూపుతూ మాట్లాడతారు. అవకాశం దొరికింది కదా అని ప్రతిపక్ష పార్టీల వారు అంతా ముఖ్యమంత్రి మీదకి నెట్టేస్తారు.

- మిథునం, హైదరాబాద్

### ఆలయాలను అభివృద్ధి చేయాలి

భారత దేశంలో పురాతన ప్రసిద్ధి చెందినఆలయాలను శిథిలావస్థకు చేరిన ఆలయాలను అభివృద్ధిచేయాలి. ఆధ్యాత్మిక ప్రదేశాలైన ఆలయాలు, మసీదులు, చర్చిలు, దాతల చందాలు, హుండీ ఆదాయం, ఇతరత్రా వచ్చినడబ్బుతో భక్తులకునచ్చినవిధంగా ఆలయాలను సంరక్షిస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక ధోరణి అలవాటు చేస్తే బాగుంటుంది.

- డి చాంద్ బాషా, కర్నూలు

### పరీక్షలు ఆగస్టు 15 తర్వాత నిర్వహించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మొదటి ఫార్మెటివ్ అసెస్మెంట్ పరీక్షలను ఆగస్టు 11 నుంచి 13 వరకు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, ఆగస్టు 11నుంచి 14వరకు ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహించాలని పరీక్షల షెడ్యూల్ విడుదల చేసింది. కానీ ఆగస్టు నెలలో 15వ తేదీన ప్రతీపాఠశాలలో విద్యార్థులు స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పాల్గొంటారు. దీనికోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పాఠశాలల్లో నిర్వహించుకునేందుకు సంసిద్ధతా కార్యక్రమాల్లో ఉంటారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలు పోటీలు లాంటివి నిర్వహించడంలో నిమగ్నమైఉంటారు. ఈసమయంలో పరీక్షలు నిర్వహించడం సరైనదికాదు. కావున ఆగస్టు 15తర్వాతే నిర్వహించాలి.

-వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### తప్పలెన్నువాడు..

రెండువేల ఇరవైమూడు తెలంగాణ శాసన సభకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బొటాబొటి మెజార్టీతో అధికారంలోకి వచ్చింది. దీంతో ఆపార్టీలోఅసమ్మతి మొదలవుతుందని వారిలో వారు కొట్టుకుంటారని గెలచిన ఎమ్మెల్యేలలో చాలా మంది తమ పార్టీలోకి వస్తారని కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవటం ఖాయమని ఇలా ఎన్నో మాటలన్నారు. అయితే వారన్న ఒక్క మాట నిజం కాలేదు. టిఆర్ఎస్, ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఇదిలా ఉంటే 2018 శాసనసభకు జరిగిన ఎన్నికల్లో టిఆర్ఎస్‌కిభారీమెజారిటీ లభించింది. అయినా కెసిఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి నెమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుని ఆ పార్టీకి ముగ్గుర్ని మిగిల్చారు. టిడిపిలో ఉన్న ముగ్గురు ఎమ్మెల్యేలను లాక్కుని తెలంగాణలో ఆపార్టీకి స్థానం లేకుండా చేశారు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### చేతులారా చేసుకున్నారు

రెండువేల ఇరవైమూడు అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ని పీకిపడేసారు. ఆయన సారథ్యంలోనే బిజెపి జి.హెచ్.ఎమ్‌సి ఎన్నికల్లోఅత్యధిక స్థానాలను గెలుచుకుని సంచలనం సృష్టించింది. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఆ తరువాత కూడా బండి సంజయ్‌నీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగాకొనసాగించిఉంటే అసెంబ్లీఎన్నికల్లో కూడా మెజార్టీ స్థానాలను దక్కించుకుని పార్టీ అధికారంలోకి వచ్చి ఉండేది. పోనీ ఇప్పుడయినా బి.సి వర్గానికి చెందిన వ్యక్తికి అధ్యక్ష పదవి ఇచ్చారా అంటే అదీ లేదు.

-ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# వారసునిపై స్పష్టత ఇచ్చిన ట్రంప్




## ఉపాధ్యక్షుడు జెడివాన్స్‌కే మొగ్గుచూపిన రిపబ్లికన్‌నేత

**వాషింగ్టన్, ఆగస్టు 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి తన రాజకీయ వారసుడి గురించి మాట్లాడారు. ప్రస్తుతం అమెరికా ఉపాధ్యక్షుడిగా పని చేస్తున్న జెడి వాన్స్ తన మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ (ఎంఎజిఎ) ఉద్యమానికి స్పష్టమైన వారసుడు అని పేర్కొన్నారు. ప్రస్తుత విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ఏదో ఒక రూపంలో వాన్స్‌తో కలిసి పనిచేయవచ్చని ట్రంప్ అన్నారు. నేను చాలా వరకు అనుకుంటున్నాను. న్యాయంగా చెప్పాలంటే జెడి వాన్స్ మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ ఉద్యమానికి స్పష్టమైన వారసుడని డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ట్రంప్ ఆరు నెలల క్రితమే అమెరికా అధ్యక్షునిగా రెండోసారి బాధ్యతలు చేపట్టారు. ఆ సమయంలో తన వారసుడి గురించి విలేకరులు అడిగినప్పుడు, తొందరెందుకు, వారసుడి ఎంపికకు ఇంకా చాలా సమయం ఉందనిఅన్నారు. అయితే జెడి వాన్స్ గొప్పగా పనిచేస్తున్నాడు. ఇప్పటికైతే ఆయనే నాకు ఇష్టమైన వ్యక్తి అని ట్రంప్ అన్నారు. అక్కడితో ఆగకుండా రూబియో కూడా ఏదో ఒక రూపంలో జెడి వాన్స్‌తో కలిసి పనిచేస్తాడు అని అన్నారు. తన తరువాత 2028లో అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా ఎవరు ఉంటారనేది చెప్పడానికి అప్పట్లో ట్రంప్ నిరాకరించారు. 40 ఏళ్ల జెడి వాన్స్ మాజీ మెరైన్‌ఇంజనీర్. 2023 నుంచి 2025 వరకు ఆయన ఓహియో సెనేటర్‌గా పనిచేశారు. ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పదవిచేపట్టాక, వాన్స్ ఉపాధ్యక్షుడు అయ్యారు. ప్రస్తుతం ట్రంప్ ట్యారిఫ్ ఉద్యమానికి పూర్తి మద్దతుగా పనిచేస్తున్నారు. మార్కో రూబియో ప్రస్తుతం అమెరికా విదేశాంగ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కొంత కాలం క్రితం, ఓ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో 2028లో అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేస్తారా అనే ప్రశ్నకు, నేను ప్రస్తుత పని మీద మాత్రమే దృష్టి సారించాను. కానీ భవిష్యత్‌లో ఏం జరుగుతుందో చెప్పలేం అని అన్నారు.

అంటే అధ్యక్ష రేసులో ఉన్న విషయాన్ని ఆయన తోసిపుచ్చలేదు. వాస్తవానికి అమెరికా ఉపాధ్యక్ష పదవికి రూబియో, వాన్స్ ఇద్దరూ పోటీ పడ్డారు. చివరికి ఉపాధ్యక్ష పదవి వాన్స్‌ను వరించింది. అయితే ప్రస్తుతం ఇద్దరూ ట్రంప్ ప్రభుత్వంలో కీలక పదవులు నిర్వహిస్తున్నారు. ఓ సందర్భంలో మార్కో చాలా సమర్థుడు, నమ్మదగినవాడు, అతను నా స్నేహితుల్లో ఒకరు అని వాన్స్‌చెప్పారు. గతంలో వాన్స్, రూబియో ఇద్దరికీ అమెరికా అధ్యక్ష పదవి చేపట్టే సామర్థం ఉందని ట్రంప్ పేర్కొన్నారని ఓ అమెరికా వెబ్‌సైట్ పేర్కొనడం గమనార్హం.

# రైతు ప్రయోజనాలపరంగా రాజీ ప్రశ్నేలేదు!



## ఎంతటిమూల్యం చెల్లించుకునేందుకైనా నేను సిద్ధమే!

### ట్రంప్ సుంకాలపై ప్రధాని మోడీ స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** దేశ రైతుల ప్రయోజనాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదని, వారి కోసం ఎంతటి మూల్యం చెల్లించడానికైనా తాను సిద్ధంగాఉన్నానని ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల యుద్ధాన్ని మరింత తీవ్రతరం చేసిన మరుసటి రోజే ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. రష్యా నుంచి ముడి చము రును దిగుమతి చేసుకుంటున్నందుకు ప్రతీకార చర్యగా భారత ఎగుమతులపై అమెరికా బుధ వారం అదనంగా 25 శాతం సుంకాన్ని విధిం చిన విషయం తెలిసిందే. గత నెల 20న విధించిన 25 శాతంతో కలిపి ఇప్పుడు మొత్తం సుంకం 50 శాతానికి చేరింది. ఈ నేపథ్యంలో ఢిల్లీలో జరిగిన ఎం.ఎస్. స్వామినాథన్ శతాబ్ది అంతర్జాతీయ సదస్సులో ప్రధాని మోడీ మాట్లాడారు. రైతులు, పశుపోషకులు, మత్స్యకారుల ప్రయోజనాలే మాకు అత్యంత ప్రాధాన్యం. ఈ విషయంలో భారత్ ఎన్నటికీ రాజీపడదు. ఇందుకోసం నేను వ్యక్తిగతంగా భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందనితెలుసు. అయినానేను సిద్ధంగా ఉన్నాను. దేశ రైతులకోసం భారత్ సిద్ధంగా ఉందని, ఆయన తేల్చిచెప్పారు. అమెరికా చర్యపై భారత విదేశాంగ శాఖకూడా తీవ్రంగా స్పందించింది. రష్యా చమురు దిగుమ తుల విషయంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవడం అన్యాయమైన, అహేతుకమైన చర్యఅనిపేర్కొంది. దేశ ప్రయోజనాల పరిరక్షణకు అవ సరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని స్పష్టంచేసింది. 140 కోట్ల మంది ప్రజల ఇంధనభద్రతను దృష్టిలో ఉంచుకునే తమ దిగుమతులు ఉంటాయని తెలిపింది.



## లోయలో పడిన సిఆర్పీఎఫ్ వాహనం

### ముగ్గురు జవాన్లు మృతి, 10 మందికి తీవ్రగాయాలు

**జమ్ము, ఆగస్టు 7:** జమ్మూ కశ్మీర్‌లో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్పీఎఫ్) జవాన్లు ప్రయా ణిస్తున్న వాహనం లోతైన లోయలో పడిపోవడంతో ముగ్గురు జవాన్లు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దుర్ఘటనలో మరో 10 మంది జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. ఉధంపుర్ జిల్లాలోని బసంత్‌గఢ్ ప్రాంతంలో ఈ విషాదం జరిగింది. కొండ ప్రాంతంలోని ఒక ప్రదేశానికి వెళ్తుండగా, మలుపు వద్ద డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. దీంతో వాహనం రోడ్డుపై నుంచి జారి పక్కనే ఉన్న లోతైనలోయలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు జవాన్లు దుర్మరణం పాలయ్యారని అధికారులు ధ్రువీకరించారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే స్థానిక అధికారులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. గాయపడిన 10 మందిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో, మెరుగైన చికిత్స కోసం వారిని ఆసుపత్రికి తరలించారు. ఉధంపూర్ డిప్యూటీ కమిషనర్ అభ్యర్థన మేరకు, తీవ్రంగా గాయపడిన వారిని తరలించేందుకు ఆర్మీ హెలికాప్టర్లను రంగంలోకి దించారు.

# ఇజ్రాయెల్ లక్ష్యం గాజా హస్తగతం



**టెల్‌అవీవ్, ఆగస్టు 7:** గాజాలో పరిస్థితులు రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతున్నాయి. ఓ వైపు అక్కడి ప్రజలు ఆకలి అలమటిస్తున్నప్పటికీ.. ఇజ్రా యెల్ మాత్రం దాడులను ఆపడం లేదు. ఆహార పంపిణీ కేంద్రాలను కూడా లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరుపుతోంది. ఈ తరహా ఘటనల్లో ఇప్పటివరకు 1000 మందికిపైగా సాధారణ పౌరులు ప్రాణాలు కోల్పోయారు. అయితే, హమాస్‌ను అంతంచేయడమే లక్ష్యంగా యుద్ధం ప్రారంభించిన ఇజ్రాయెల్.. ఇప్పుడు గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలన్న కోరికతో ముందుకు వెళ్తోంది. అందుకు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు చర్యలు బలం చేకూరుస్తున్నాయి. ది టైమ్స్ ఆఫ్ ఇజ్రాయెల్ నివేదిక ప్రకారం.. దశలవారీగా గాజాను స్వాధీనం చేసుకునేందుకు ఇజ్రాయెల్ పావులు కదుపుతోంది. మరో ఐదు నెలల్లో ఆ ప్రాంతాన్ని హస్తగతం చేసుకునేలా అడుగులు వేస్తోంది. ఈ క్రమంలోనే గురువారం ఆ దేశ సెక్యూరిటీ కేబినెట్ కీలక సమావేశం నిర్వహించనుంది. గాజాపై చేపట్టాల్సిన నూతన కార్యాచరణ గురించి ఇందులో చర్చించనున్నారు. మరోవైపు గాజాలోని ఉత్తర, ఖాన్‌యూనిస్‌లోని దక్షిణ ప్రాంత ప్రజలకు ఇజ్రాయెల్ మిలిటరీ బుధవారం కీలక హెచ్చరికలు జారీచేసింది. వారంరోజుల్లోగా నెతన్యాహు ప్రభుత్వం గాజాను స్వాధీనం చేసుకోబోతుందని, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లిపోవాలని వాటిసారాంశం. మరోవైపు గ్రౌండ్ ఆపరేషన్లను కూడా విస్తరించబోతున్నట్లు మిలిటరీ అధికార ప్రతినిధి వెల్లడించారు.

**ఇజ్రాయెల్ వ్యూహం ఇదేనా?**

హమాస్ ఉగ్రవాదులే లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడులు చేస్తున్నప్పటికీ.. పూర్తి స్థాయి విజయం సాధించలేకపోతోంది. దీంతో కీలక వ్యూహాన్ని అమలుచేసే యోచనలో ఉంది. తొలుత గాజా సిటీమొత్తాన్ని తన అధీనంలోకి తీసుకొని.. సహాయ పంపిణీ కేంద్రాలను పెద్ద ఎత్తున పెంచాలని భావిస్తోంది. దీంతో.. సాధారణపౌరులంతా సహాయంకోసం ఒకచోటుకు చేరిన తర్వాత.. ఆ ప్రాంతంలోని మిగతా భూభాగంలో బాంబుల వర్షం కురిపించాలని భావిస్తోంది. వ్యూహం అమలులో భాగంగా తొలివిడతగా.. దాదాపు 10 లక్షల మందిని గాజాను ఖాళీ చేయాలని హెచ్చరికలు పంపనున్నారు. దీంతో గాజా స్ట్రిప్‌లోని సగభాగం ఖాళీ అయినట్లవుతుంది. రెండో విడతగా.. సాధారణ ప్రజలు ఖాళీ చేసిన ప్రాంతాల్లో మిలటరీ ఆపరేషన్ చేపట్టనున్నారు. తద్వారా మూల మూలల్లో దాక్కున్న హమాస్ ఉగ్రవాదులను మట్టుబెట్టాలన్నది ఇజ్రాయెల్ ప్లాన్.

**మరో ప్లాన్ ఇదే..!**

సైనిక చర్య చేపడితే హమాస్ చేతిలో బందీలుగా ఉన్న తమ పౌరుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందని ఇజ్రాయెల్ భావిస్తే.. మరో వ్యూహాన్ని తెరమీదక తెచ్చే అవకాశాలున్నాయి. అమెరికా మధ్యవర్తిత్వంలో హమాస్‌తో చర్చలు జరిపి, అవి విజయవంతం అయితే ఇజ్రాయెల్ సైనిక కార్యకలాపాలు నిలిపివేసే అవకాశంఉంది. అయితే, అందుకు నెతన్యాహు అంగీకరించకపోవచ్చు. లేదంటే గాజాను చుట్టుముట్టి, ఆ ప్రాంతాలకు సహాయాన్ని నిలిపివేసే అవకాశాన్ని కూడా ఇజ్రాయెల్ పరిశీలిస్తోంది. అయితే, ఇది చాలా ఎక్కువ సమయం తీసుకుంటుంది.

మరోవైపు ప్రభుత్వానికి, ఐడిఎఫ్‌కు పొరపొచ్చాలు వచ్చినట్లు తెలుస్తోంది. ఐడిఎఫ్‌ను ఉద్దేశిస్తూ ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను బాధ్యతతో సక్రమంగా అమలుచేయడమే సైన్యం విధి అని, ప్రభుత్వ నిర్ణయాలకు సైన్యం కట్టుబడి ఉండాలని తెగేసి చెప్పారు. ఈ నేపథ్యంలో అంతర్గత సమస్యలను పరిష్కరించుకుంటూ, హమాస్‌ను అంతం చేసేందుకు ఇజ్రాయెల్ ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటుందోనన్న దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# ఉత్తరాఖండ్ వరదల్లో 27 మంది కేరళ యాత్రీకులు గల్లంతు!

**డెహ్రాడూన్, ఆగస్టు 7:** ఉత్తరాఖండ్‌లో ఆకస్మిక వరదలు సంభవించిన వేళ 28 మంది కేరళ పర్యటకుల ఆచూకీ గల్లంతైంది. వీరిలో 20 మంది మహారాష్ట్రలో స్థిరపడినవారు కాగా, మిగిలిన ఎనిమిది మంది కేరళలోని వివిధ జిల్లాలకు చెందిన వారు ఉన్నారు. వారు మాతో మాట్లాడి ఒక రోజు గడిపోయింది. ఉత్తరకాశీ నుంచి ఉదయం ఉదయం 8.30కు గంగోత్రికి బయల్దేరినట్లు వారు తెలిపారు. వారు వెళ్తున్న మార్గంలోనే కొండచరియలు విరిగిపడ్డాయి. అప్పటినుంచి వారు ఎక్కడ ఉన్నారో తెలియదు. ఫోన్ కూడా కలవడం లేదు. ఫోన్లలో బ్యాటరీ అయిపోయి ఉండొచ్చు. లేదా వాళ్లు ఉన్న చోట సిగ్నల్ లేదనుకుంటా అని బంధువు పేర్కొన్నారు. హరిద్వార్‌కు చెందిన ఓ ట్రావెల్ ఏజెన్సీ 10 రోజులపాటు ఉత్తరాఖండ్ పర్యటనకు ఏర్పాటు చేసినట్లు ఆ వ్యక్తి తెలిపారు. అయితే బృందం ఎక్కడ ఉందనే విషయంపై ఏజెన్సీ కూడా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. గంగోత్రికి వెళ్లే మార్గంలోని ధరాలీలో భారీగా వదలు సంభవించాయి. ఈ ఘటనలో మృతుల సంఖ్య ఐదుకు పెరిగింది. మరో మృతదేహాన్ని వెలికితీసినట్లు అధికారులు ప్రకటించారు. ఇక డజన్ల మంది ఆచూకీ గల్లంతైనట్లు తెలిపారు. ఇప్పటి వరకు రెస్క్యూ సిబ్బంది 150 మందిని రక్షించారు. సహాయక చర్యల్లో సైన్యం, పోలీసులు, ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ పాల్గొన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్‌నుంచి ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను ఉత్తరాఖండ్‌కు విమానంలో తరలించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేసింది. మరోవైపు హిమాచల్‌ప్రదేశ్‌లో కూడా ఆకస్మిక వరదలు బీభత్సంసృష్టించాయి. కిన్నౌర్ జిల్లాలో కైలాస్‌యాత్ర ట్రెక్కింగ్ మార్గంలో వందలాది మంది యాత్రికులు వరదల్లో చిక్కుకుపోయారు. వరదల ధాటికి ట్రెక్కింగ్ మార్గాలు ధ్వంసం కావడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రతికూల పరిస్థితుల దృష్ట్యా, కిన్నౌర్ కైలాష్ యాత్రను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. బుధవారం రాష్ట్రంలోని పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీనితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

## ఇంటిముందు ఆడుకుంటున్న బాలికపై జాతివివక్ష దాడి!

**డబ్లిన్, ఆగస్టు 7:** ఐర్లాండ్‌లోని భారత సంతతికి చెందిన ఆరేళ్ల చిన్నారిపై జాతి వివక్ష దాడి జరిగింది. ఇంటి ముందు ఆడుకుంటున్న బాలికపై స్థానిక పిల్లలు దాడిచేశారు. సౌత్ ఈస్ట్ ఐర్లాండ్‌లోని వాటర్ ఫోర్డ్ సిటీలో చోటుచేసుకుంది ఘటన. అసభ్యంగా దూషిస్తూ, ఇండియాకు వెళ్లిపొమ్మని బెదిరించారని బాధితురాలి తల్లి మీడియాకు వెల్లడించారు. తన బిడ్డపై చేయిచేసుకోవడంతో పాటు ప్రైవేట్ పార్టులపై దాడి చేశారని తెలిపారు. స్థానికంగా ఉంటున్న పది నుంచి పద్నాలుగేళ్ల వయసున్న బాలురు ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. గడిచిన ఎనిమిదేళ్లుగా తాము ఇక్కడే ఉంటున్నామని, ఇటీవలే పౌరసత్వం కూడా వచ్చిందని ఆమె తెలిపారు.

తాను నర్సుగా స్థానిక ఆసుపత్రిలో సేవలందిస్తున్నానని, తనలాంటివారి అవసరం ఐర్లాండ్‌కు ఉందని ఆమె తెలిపారు. తన పిల్లలు ఇక్కడ సురక్షితంగా ఉంటారని భావిస్తే, తమ సొంత ఇంటి ముందు కూడా పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. తన కూతురుపై దాడి చేసిన పిల్లలలో ఎనిమిదేళ్ల పాప కూడా ఉందని, మొత్తం ఐదుగురు దాడి చేశారని బాధితురాలి తల్లిఆరోపించారు. అయితే, అధికారులు వారినిశిక్షించడం కాకుండా కౌన్సెలింగ్ ఇవ్వాలని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. కాగా, ఈ ఘటనపై స్థానిక పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.

## త్వరలో భారత్ పర్యటనకు పుతిన్!

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో భారత్ పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. ఆయన పర్యటన తేదీలు ఖరారు చేస్తున్నట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోబాల్ వెల్లడించారు. ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న దోబాల్ రష్యా భద్రతా మండలి సెక్రటరీ సెర్గీ షొయిగుతో సమావేశమైన అనంతరం ఈ ప్రకటన చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల నేపథ్యంలో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించిన వేళ ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ యేడాది చివర్లో పుతిన్ భారత్‌కు వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

# ఓటర్లజాబితా ముసాయిదాపై ఎలాంటి అభ్యంతరాలు రాలేదు!


## బీహార్ జాబితాపై ఎన్నికల సంఘం వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** బీహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ(సర్)పై భారత ఎన్నికల సంఘం కీలక ప్రకటన చేసింది. ఆగస్టు 1వ తేదీన విడుదల చేసిన ఓటర్ల జాబితా ముసాయిదాకు ఏ రాజకీయ పార్టీ కూడా అభ్యంతరాలు తెలపలేదని గురువారం పేర్కొంది. ఓటుకు అర్హత ఉన్నవారిని వదలిపెట్టబోమని, అనర్హులను ఓటరు లిస్టులో చేర్చబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు పై రోజువారీ బులెటిన్‌లో ఈసీ తెలిపింది. ఇప్పటివరకు ఓటరు ముసాయిదా జాబితాకు సంబంధించి 5,015 అభ్యంతరాలను స్వీకరించామని ఎన్నికల సంఘం చెప్పింది. కొత్త ఓటర్ల నుంచి 27,517 పైగా దరఖాస్తులను స్వీకరించామని, ముసాయిదా జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమకు చెప్పాలని కోరింది.

నిబంధనల ప్రకారం, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఏడు రోజుల గడువు ముగిసిన తర్వాత సంబంధిత ఎలక్ట్రోలర్, అసిస్టెంట్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు వాటిని పరిష్కరించాలి. అదే సమయంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ బీహార్ రాజకీయాల్లో తీవ్ర వివాదానికి దారితీసింది. ఎన్నికల సవరణలో పెద్ద సంఖ్యలో ఓటర్ల తొలగింపు జరిగిందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కూడా ఎస్ఐఆర్‌పై గళమెత్తాయి. పార్లమెంట్ ఆవరణలో నిరసనలు కూడా తెలిపాయి. ఇదిలా ఉండగా, బీహార్ ఓటరు జాబితాలో 65 లక్షల ఓటర్ల పేర్లు చేర్చలేదని తేలింది. దీంతో వారి వివరాలను బహిర్గతం చేయాలని ఎన్‌జీవో ఒకటి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఆగస్టు 9లోగా వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఎన్నికల సంఘాన్ని కోరింది. ఎన్‌జిఒ తరఫున కోర్టులో హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తన వాదనలు వినిపించారు. ఎవరు చనిపోయారు, ఎవరు వలసవెళ్లారనే దానిపై స్పష్టత ఇవ్వలేదని తెలిపారు.

తొలగించిన ఓటర్ల వివరాలను, ఎన్‌జిఒకి కాపీని ఇవ్వాలని ఎన్నికల తరఫున న్యాయవాదిని ధర్మాసనం పేర్కొంది. కొన్ని రాజకీయ పార్టీలకు తొలగించిన ఓటర్ల జాబితాను ఇచ్చామని, అయితే ఆ ఓటరు చనిపోయాడా లేదా వలస వెళ్లాడా అనే దానిపై ఇంకా స్పష్టత ఇవ్వలేదని ప్రశాంత్ భూషణ్ తెలిపారు. అయితే ఓటర్లు తమ ఐడి నంబర్‌లను ఉపయోగించి అధికారిక లింక్ ద్వారా తమ పేర్లను తెలుసుకునే అవ కాశాన్ని కమిషన్ కల్పించింది. ఆ పోర్టల్ ద్వారా పేర్లను చేర్చడం లేదా తొలగించడం, అభ్యంతరాలు ఉంటే తెలియజేయడం వంటివి చేయవచ్చు. 2025 సెప్టెంబర్ 1వ తేదీ నాటికి ఓటర్లందరూ తమ బూత్ లెవల్ అధికారులకు కొత్త ఫొటోలను సమర్పించాలని ఇసి కోరింది.

# ఆరు నెలల్లో 529 బాంబింగ్‌లు.. నోబెల్ ఇవ్వాల్సిందే..!



**వాషింగ్టన్, ఆగస్టు 7:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నోబెల్ శాంతి బహుమతి కోసం నానా తంటాలు పడుతున్నారు. ప్రపంచంలో ఎక్కడ చిన్న ఘర్షణ జరిగినా.. అక్కడి వాలిపోయి పంచాయితీలు చేస్తున్నారు. ఆయనను ఒక శాంతి దూతగా చిత్రీకరించేందుకు శ్వేతసౌధంలోని కార్యవర్గం కిందామీదా పడుతోంది. మా అధ్యక్షుడు సగటున నెలకో శాంతి సంధిని కుదురుస్తున్నారంటూ ఇటీవల ప్రకటన జారీ చేసింది. అసలు ట్రంప్‌నకు నోబెల్ బహుమతివచ్చే అవకాశం ఉందా? ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రయోగించిన బాంబులు ఎన్ని.. ఎంత మంది ప్రాణాలను ఫణంగా పెట్టి డబ్బు ఆదా చేస్తున్నారో తెలుసా?

**అంత పిచ్చి ఎందుకు?**

అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో నోబెల్ విషయంలో ట్రంప్‌నకు వైరం కొనసాగుతోంది. ట్రంప్ తొలిసారి అధ్యక్ష పదవి చేపట్టడానికి ప్రయత్నాలు మొదలుపట్టినప్పటి నుంచే ఒబామాతో విభేదాలు ఉన్నాయి. తన శత్రువు అధ్యక్ష పదవి చేపట్టిన 9నెలల్లోనే నోబెల్ శాంతి బహుమతి అందుకోగా లేనిది తన విషయంలో ఎందుకు సాధ్యం కాదని ట్రంప్ అనుకొంటున్నారు. ఒబమాకు బహుమతి రావడంపై కూడా బహిరంగంగానే కొన్నేళ్ల నుంచి అక్కసు వెళ్లగక్కుతున్నారు. 2019లో ఓ సందర్భంలో మాట్లాడుతూ 'బరాక్ ఒబామాకు ఎందుకు వచ్చిందో నాకు తెలియదు.. మీకేమైనా తెలుసా..?' అని వ్యాఖ్యానించారు. తనకు ఇప్పటికే పలు అంశాల్లో ఈ ప్రైజు ఇచ్చి ఉండాల్సిందన్నారు.

**ఇదేం శాంతి..?**

ట్రంప్ ఆశలకు గండికొట్టే అంశాలు కూడా బలంగానే ఉన్నాయి. జనవరి 20న పగ్గాలు చేపట్టిన నాటి నుంచి జూలై 15 నాటికి ఆరు నెలల వ్యవధిలో ఆఫ్రికా, పశ్చిమాసియా, మధ్య ఆసియాలోని 240 ప్రదేశాల్లో 529 బాంబింగ్‌లను ట్రంప్ చేయించారు. ఈ విషయాన్ని 'ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్ లొకేషన్ అండ్ ఈవెంట్ డేటా' గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అదే ఆయన కంటే ముందు అధికారంలో ఉన్న జోబైడెన్ నాలుగేళ్లలో 555 బాంబింగ్‌లను చేయించారు. ఇరాన్‌పై అతిపెద్ద బంకర్‌బస్టర్ల వర్షం కురిపించారు.

**మూడుసార్లు తిరస్కరణలకు గురైన నామినేషన్లు..**

ఇదంతా ఒక ఎత్తయితే.. ట్రంప్ పట్టువదలని విక్రమార్కుడిలా నోబెల్‌కు నామినేషన్లు పంపిస్తూనే ఉన్నారు. ఇప్పటికే ఆయనవి మూడుసార్లు తిరస్కరణక గురయ్యాయి. 2018లో అణు నిరాయుధీకరణ యత్నాలకు ఇద్దరు నార్వే ప్రజాప్రతినిధులు, 18 మంది రిపబ్లికన్ సభ్యులు ఆయన పేరును ప్రతిపాదించారు. నాడు ఉత్తర కొరియా, అమెరికా మధ్య చర్చలను దీనికి కారణంగా చూపారు. కానీ, బహుమతి రాలేదు. 2020లో మరోసారి ట్రంప్ బృందం నోబెల్ యత్నాలు చేసింది. పశ్చిమాసియాలో అబ్రహం ఒప్పందాలు చేయించినందుకు ఓ స్వీడిష్ చట్టసభ సభ్యుడు, కొందరు ఆస్ట్రేలియా లా ప్రొఫెసర్లు, ఫిన్లాండ్ చట్టసభ సభ్యుడు, ఐరోపా పార్లమెంట్ సభ్యుడు ఆయన పేరును ప్రతిపాదించారు. అప్పుడు కూడా నోబెల్ మొహం చాటేసింది. ఇక 2024లో ఆయన అధ్యక్ష పదవి చేపట్టేందుకు సిద్ధమైన వేళ కూడా ఆయన పేరును కాంగ్రెస్ ఉమెన్ క్లాడియా టెన్నీ నోబెల్‌కు నామినేట్ చేశారు. దాదాపు ఆరు వరకు నామినేషన్లు రాగా.. ఆ సారీ బహుమతి ట్రంప్‌ను వరించలేదు. జపాన్‌కు చెందిన ఓ సంస్థకు దక్కింది.

# సంక్షిప్తంగా..

## అమెరికా విధించిన సుంకాలపై తీవ్రంగా విమర్శించిన కాంగ్రెస్ ఎంపి



**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50 శాతం సుంకాలు విధించడాన్ని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. అమెరికా దిగుమతులపై కూడా భారత ప్రభుత్వం అలాంటి చర్యలే తీసుకోవాలన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికా విధించిన సుంకాలు మనపై కచ్చితంగా ప్రభావం చూపిస్తాయన్నారు. దాదాపు 90 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. సుంకం ఎక్కువగా ఉన్నప్పుడు భారత్ వస్తువులు ఎందుకు కొనాలి అని కొనుగోలుదారులు కూడా ఆలోచిస్తారన్నారు. రష్యా నుంచి భారత్ కంటే చైనా ఎక్కువ చమురు కొనుగోలు చేస్తోందని కానీ ఆదేశానికి ట్రంప్ సుంకాల నుంచి 90 శాతం ఉపశమనంకల్పించారన్నారు. మనకుమాత్రం మూడువారాలే ఉపశమనం కల్పించడం సమంజసం కాదన్నారు. కేంద్రం కూడా యుఎస్ దిగుమతులపై 50 శాతం సుంకం విధించాలని కోరారు.

## ధర్మస్థలిలో పురుషుడి అస్థిపంజరం లభ్యం!

**బెంగళూరు, ఆగస్టు 7:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ధర్మస్థల సామూహిక ఖననాల కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసుకు సంబంధించి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) జరుపుతున్న తవ్వకాల్లో పురుషుడి అస్థిపంజరంతో పాటు పలు మానవ ఎముకలు లభ్యమైనట్లు కర్ణాటక హోంశాఖ మంత్రి జి. పరమేశ్వర తొలిసారి అధికారికంగా ధృవీకరించారు. గురువారం బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన హోంమంత్రి పరమేశ్వర, ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఒక గుర్తుతెలియని వ్యక్తి తాను 13 ప్రాంతాల్లో మృతదేహాలను పాతిపెట్టినట్లు ఫిర్యాదు చేశాడు. అతని వాంగ్మూలం ఆధారంగా సిట్ బృందాలు ఆ ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టాయి. ఆరో ప్రదేశంలో ఒక పురుషుడి అస్థిపంజరం దొరికింది. దీంతో పాటు మరో కొత్త ప్రదేశంలోనూ కొన్ని ఎముకలు లభ్యమయ్యాయి. లభ్యమైన అన్ని అవశేషాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి (ఎఫ్ఎస్ఎల్) పంపామని ఆయన స్పష్టం చేశారు. 13వ స్థానంలో మాత్రం ఇంకా ఏమీ దొరకలేదని ఆయన తెలిపారు. ఫిర్యాదుదారుడు మెజిస్ట్రేట్ ముందు సెక్షన్ 164 కింద వాంగ్మూలం ఇస్తూ, తాను వందల సంఖ్యలో మృతదేహాలను పూడ్చిపెట్టినట్లు చెప్పడంతో ప్రభుత్వం ఈ కేసును తీవ్రంగా పరిగణించి సిట్ ఏర్పాటు చేసిందని పరమేశ్వర గుర్తుచేశారు. దర్యాప్తులో ప్రభుత్వం ఎలాంటి జోక్యం చేసుకోదని, శాస్త్రీయంగా, సాంకేతిక పరిజ్ఞానంతో నిజానిజాలు నిగ్గ తేల్చాలని సిట్‌కు పూర్తి స్వేచ్ఛనిచ్చామని ఆయన వివరించారు.

## బిజెపి నేత కాన్వాయ్‌పై దాడిపట్ల బిజెపి చీఫ్ సీరియస్

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** పశ్చిమబెంగాల్‌లో బిజెపి కీలకనేత సువేందు అధికారి కాన్వాయ్‌పై ఇటీవల జరిగిన దాడి ఘటనపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూచ్ బెహార్‌లో ఆయన కాన్వాయ్‌పై టిఎంసి గూండాలు దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లోపోస్టు పెట్టారు. ఈ దాడి పోలీసుల సమక్షంలోనే జరగడం ఇంకా ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ ఘటన మమతా బెనర్జీ ప్రభుత్వంలో శాంతిభద్రతలు క్షీణించాయనడానికి నిదర్శనమన్నారు. ఇది కేవలం ఒక ప్రజాప్రతినిధిపై జరిగిన దాడి కాదు. ప్రజాస్వామ్యంపైనే జరిగిన దాడిగా అభివర్ణించారు. తాను సువేందు అధికారితో మాట్లాడి ఆయన పరిస్థితి గురించి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. బెంగాల్‌లో ప్రతిపక్షనేతకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల దుస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చున్నారు.

## ఘనాలో టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కుప్పకూలిన హెలికాప్టర్

**ఒబువాసి(ఘనా), ఆగస్టు 7:** పశ్చిమాఫ్రికా దేశం ఘనాలో నిన్న ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కేంద్ర మంత్రులు, కీలక అధికారులతో బయలుదేరిన సైనిక హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో దేశ రక్షణ మంత్రి, పర్యావరణ మంత్రి, కీలక అధికారులు సహా మొత్తం ఎనిమిది మంది దుర్మరణం పాలయ్యారు. రాజధాని అక్రా నుంచి ఒబువాసి వెళ్లడానికి రక్షణ మంత్రి ఎడ్వర్డ్ ఒమానే బోమా, పర్యావరణ శాఖ మంత్రి ఇబ్రహీం ముర్తాలా ముహమ్మద్ అధికారులతో కలిసి జెడ్9 అనే సైనిక హెలికాప్టర్‌లో బయలుదేరారు. కాసేపటికే హెలికాప్టర్‌తో కమ్యూనికేషన్ తెగిపోయిందని, ఆతర్వాత హెలికాప్టర్ కూలిపోయిందనే సమాచారం అందిందని అధికారులు వివరించారు. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లో ప్రయాణం చేస్తున్నవారంతా చనిపోయారని ప్రభుత్వం ప్రకటిం టచింది. ఈ ప్రమాదంగురించి సమాచారం అందినవెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మృతదేహాలను ఆసుపత్రికి తరలించినట్టు అధికారులు తెలిపారు.

# హైదరాబాద్‌లో యుఎస్ కాన్సుల్ జనరల్‌గా లారా విలియమ్స్



**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో కొత్త యుఎస్ కాన్సుల్ జనరల్‌గా లారా విలియమ్స్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్లో యుఎస్ కాన్సుల్ జనరల్గా పనిచేయడం తనకు ఎంతో గర్వకారణమన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా అంతటా యుఎస్ ఇండియా భాగస్వా మ్యాన్ని బలోపేతం చేయడానికి తాను ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. భారత్, అమెరికా మధ్య దౌత్య సంబంధాలను మెరుగు పర్చడానికి తాను ప్రాధాన్యమిస్తానని స్పష్టం చేశారు. ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలను బలోపేతం చేసేందుకు తాను కట్టుబడి ఉన్నానన్నారు. హైదరాబాద్‌ను గొప్ప ప్రాంతంగా అభివర్ణించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న యుఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ స్థానంలో లారా విలియమ్స్ వచ్చారు. ఆమె గతంలో యుఎస్ డిపార్ట్ మెంట్ ఆఫ్ స్టేట్‌లో ఎంటర్‌ప్రైజ్ సర్వీసెస్ డిప్యూటీ చీఫ్ ఇన్ఫ ర్మేషన్ ఆఫీసర్‌గా పనిచేశారు. వాషింగ్టన్‌లోని దౌత్యవేత్తలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న రాయబార కార్యాలయాలను అనుసంధానించే సమాచార సాంకేతిక వేదికల సూట్ను నిర్వహించారు. తన కెరీర్ మొత్తంలో సున్నితమైన డేటాను భద్ర పరచడం, ప్రపంచవ్యాప్తంగా విస్తృత వేదికనే విన్యాశ్య సాంకేతిక పరి జ్ఞానాన్ని ఉపయోగించడం వంటి విధులు చేపట్టారు. నికోసియా, అల్జీర్స్, రోమ్, మెక్సికో నగరాల్లోని అమెరికా రాయబార కార్యాలయాల్లో విధులు నిర్వర్తించారు. వాషింగ్టన్, డి.సి.లోని విదేశాంగ శాఖ ప్రధాన కార్యా లయంలో సైతం డిప్లొమాటిక్ టెక్నాలజీ బ్యూరో, సెక్రటరీ ఆపరేషన్స్ సెంటర్, రిక్రూట్‌మెంట్ ఆఫీస్, ఫారిన్ సర్వీస్ ఇన్‌స్టిట్యూట్ స్కూల్ ఆఫ్ అప్లైడ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సైబర్‌సెక్, డిజిటల్ పాలసీ బ్యూరో, సెంటర్ ఫర్ అనలిటిక్స్ వంటి పదవులతో సహా విభిన్న పోర్ట్‌ఫోలియోలను నిర్వహించారు.

# వ్యవసాయంలో బయోటెక్నాలజీ వినియోగం పెరగాలి

## రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో పలువురు వక్తలు

**హైదరాబాద్ (అత్తాపూర్) ఆగస్టు 7, ప్రభాతవార్త :** వ్యవసాయ రంగంలో బయోటెక్నాలజీ వినియోగాన్ని మరింతగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం బయోటెక్నాలజీ సాధ నాల వినియోగంపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్ నిర్వ హించారు. పంటల అభివృద్ధికి బయోటెక్నాలజీ విని యోగం, ముఖ్యమైన పురోగతులు అనే శీర్షికతో సదస్సును ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంతో బయోటెక్ కన్సార్టియం ఆఫ్ ఇండియా లిమిటెడ్ సంయుక్తంగా నిర్వహించాయి. ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా మద్దతు ఇచ్చింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్ఎం సుందరం, బయోసీడ్స్ డివిజన్, డీసీఎం శ్రీరామ్ లిమిటెడ్ డాక్టర్ పరేష్ వర్మ, బయోటెక్ కన్సార్టియం ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ డాక్టర్ విభా ఆహుజా, ఐసీఏఆర్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ కాటన్ రీసెర్చ్ మాజీ డైరెక్టర్ డాక్టర్ వైజీ ప్రసాద్‌లు హాజరై మాట్లాడారు...బయోటెక్నాలజీ ఆవిష్కరణలను అర్థం చేసుకోవడానికి, సమర్థవంతంగా ప్రజలకు వివరించడానికి, బాధ్యతగా అమలు చేయడానికి అధికారుల నుంచి పాలసీ మేకర్ల వరకు సామర్థ్యాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ గత కొన్ని దశాబ్దాలుగా వ్యవసాయ ఉత్పాదకతలో పురోగతి సాధించిందన్నారు. అయినా, భవిష్యత్తు అవసరాల కోసం భూమి విస్తీర్ణాన్ని పెంచడం కాకుండా, సాంకేతిక పురోగతిపై దృష్టి పెట్టాలని కోరారు. బయోటెక్నాలజీ అనేది తుది లక్ష్యం కాదన్నారు. కానీ స్థిరమైన వ్యవసాయం సాధించడానికి ముఖ్యమైన మార్గమన్నారు. జన్యు మార్పు ద్వారా తక్కువ ఎరువులు, తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే పంటలు సాధ్యమన్నారు. దీని వల్ల రైతులకు తక్కువ ఖర్చు అవుతుందన్నారు. పంటలు వాతావరణ మార్పులు, తెగుళ్లకు తట్టుకునేలా మారతాయని తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అయిన వాతావరణ మార్పులు, తెగుళ్ల, పోషక లోపాలు పరిష్కరించేందుకు ఇప్పుడు శాస్త్రవేత్తలకు జన్యు మార్పు, జీనోమ్ ఎడిటింగ్ అనే రెండు శక్తివంతమైన టెక్నాలజీలు అందు బాటులో ఉన్నాయని చెప్పారు. శాస్త్రీయ అభివృద్ధిని ప్రజలకు ఉపయో గపడే విధంగా చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వాలు, విశ్వవిద్యాలయాలు, రైతు సముదాయాలతో చర్చలు జరపడం అవసరమని సూచించారు. ఈ చర్చలు పత్తి పంటల నుండి జన్యు సవరణ పంటలపై ఉన్న నియంత్రణ విధానాల వరకు చేశారు. ఈ చర్చలో ఫీల్డ్ ట్రయల్స్ కు అనుమతుల ప్రక్రియను సరళతరం చేయాలని, రైతులు, ప్రజలతో




వర్క్‌షాప్‌లో పాల్గొన్న ముఖ్యఅతిథులు

కమ్యూనికేషన్ చేయడానికి కొత్త వ్యూహాలు అమలు చేయాలని అభిప్రాయపడ్డారు. వ్యవసాయ బయోటెక్నాలజీపై చర్చలు జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పాలసీ తీసుకున్నా బయోటెక్నాలజీని ఎంత వేగంగా, ఎంత విస్తృతంగా అమలు చేయాలో నిర్ణయించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలదేనని చెప్తారు.

# నిర్భయ నిధి కింద రూ.10 కోట్లు మంజూరు చేస్తామన్న కేంద్రం

## కేంద్రమంత్రి అన్నపూర్ణాదేవితో సమావేశమైన మంత్రి సీతక్క

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణా దేవితో తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క భేటీ అయ్యారు. ఈ సందర్భంగా, తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ నిధుల విడుదల కోసం విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం మహిళా, శిశు సంక్షేమ రంగాల్లో అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తోందని, అందుకు అదనపు నిధులు మంజూరు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. మిషన్ వత్సల్య పథకం కింద 22 వేల మంది అనాథ పిల్లల సంరక్షణ కోసం రూ.105 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీవీటీజీ ప్రాంతాల్లో 216 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం కోసం రూ.5 కోట్లు, పోషణ అభియాన్ కింద పెండింగ్‌లో ఉన్న రూ.71 కోట్లతో పాటు, అదనంగా రూ.17 కోట్లు మంజూరు చేయాలని అభ్యర్థించారు. కౌమార బాలికల నైపుణ్యాభివృద్ధి కోసం రూ.220 కోట్లు, అలాగే అడోలెసెంట్ గర్ల్స్ ప్రోగ్రామ్ కింద రూ.7 కోట్లు విడుదల చేయాలని కోరారు. గత ఆర్థిక సంవత్సరంకి చెందిన 4వ త్రైమాసిక నిధులు రూ.54 కోట్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 1వ త్రైమాసికానికి రూ.200 కోట్లు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిధులు అంగన్‌వాడీ సేవల బలోపేతానికి ఉపయోగపడతాయని తెలిపారు. వీటిపై స్పందించిన కేంద్ర మంత్రి ములుగు జిల్లాకు నిర్భయ ఫండ్ కింద రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే, పెండింగ్ నిధులను త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కేంద్ర మంత్రి హామీకి మంత్రి సీతక్క ధన్యవాదాలు తెలిపారు.

# 2017 నుండి ఆర్‌పిఎస్ అలవెన్సులను పెంచి అమలు చేయాలి

## టిజిఎస్ ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్‌టిసి)లో పనిచేస్తున్న కార్మికులకు 2017 నుండి ఆర్‌పిఎస్ అలవెన్సులను పెంచి అమలు చేయాలిటిజిఎస్ ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. 2013 వేతన సవరణ జరిపినప్పుడు పెంచబడిన అలవెన్సు, ఫ్రింజ్ బెనిఫిట్స్ 12 యేళ్లు దాటినా నేటికీ ఆర్‌టిసి కార్మికులు అవే పొందు తున్నారని ఎంప్లాయీస్ యూనియన్ ఆవేదన వ్యక్తం చేసింది. 2017 వేతన సవరణ జరిగినప్పటికీ అలవెన్సులు, ఫ్రింజ్ బెనిఫిట్స్ ఆర్‌టిసి కార్మికులకు పెంచకుండా యాజమాన్యం విస్మరించడం పట్ల కార్మిక వర్గమంతా అసంతృప్తితో ఉన్నారని ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న తెలిపారు. అధికా రుల అలవెన్సులు వేలాది రూపాయలు ఇష్టానుసారంగా పెంచేసుకుని, కష్ట పడి పనిచేసే కిందిస్థాయి ఉద్యోగులకు అలవెన్సులు అమలు చేయక పోవడం యాజమాన్యం చూపుతున్న వివక్షతకు నిదర్శనమని విమర్శించారు. గతంలో ఆర్‌టిసిలో వేతన సవరణతో పాటు అలవెన్సులు కూడా పెంచేవారని... ఆ అనవాయితిని తుంగలో తొక్కిన యాజమాన్యం.. 2024 లో 2017 వేతన సవరణ చేసినప్పటికీ దీనితోపాటే అలవెన్సులు, ఫ్రింజ్ బెనిఫిట్స్ ఇవ్వాల్సి ఉండగా ఉద్దేశపూర్వకంగా ఆ అలవెన్సులను విస్మరించి ఆర్‌టిసి యాజ మాన్యం కార్మికుల కడుపు మీద కొట్టిందన్నారు. సంస్థ అభివృద్ధికి పాటు పడుతూ నిత్యం కష్టపడుతున్న కార్మికవర్గాన్ని గట్టెక్కించడానికి వారికి రావలసిన ఆర్థిక సదు పాయాలన్నింటిని సమకూర్చవలిసిన బాధ్యత ఆర్‌టిసి యాజమాన్యాదేనని అన్నారు.



# రాజకీయ లబ్ధి కోసం ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్

## బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్

**హైదరాబాద్, ఆగస్టు 7. ప్రభాతవార్త:** తెలంగాణలో 42శాతం బిసి రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ పార్టీ గత కొంత కాలంగా రాజకీయ లబ్ధి కోసం ప్రజలను మభ్యపెడుతుందని బిజెపి ఒబిసి మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రిపై, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులపై, బిజెపి నాయకులపై ఇష్టానుసారంగా విమర్శలు చేయడం పద్ధతి కాదన్నారు. బిసి బిల్లు, బిసిల రిజర్వేషన్ల విషయంలో రేవంత్ రెడ్డికి మొదటి నుంచే స్పష్టత లేదన్నారు. ఈ అంశాలను బిజెపిపై నెట్టే ప్రయత్నం, స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందాలనే ప్రయత్నమే తప్ప, బిసిలకు మేలు చేయాలన్న ఉద్దేశ్యం ఆయనకెప్పుడూ లేదన్నారు. బిసిల రిజర్వేషన్ బిల్లు ప్రక్రియను ఆయన రాజ్యాంగబద్ధంగా అమలు చేయలేదన్నారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కూడా పట్టించుకోలేదని, బిసి కోటాలో ముస్లింలకు రిజర్వేషన్ ఎందుకు ఇస్తున్నారో రేవంత్ రెడ్డి ఇప్పటి వరకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేదన్నారు. కులగణనలో బిసిల సంఖ్య ఎందుకు తగ్గిందో రేవంత్ రెడ్డి చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాల్లో ఏవీ రాజ్యాంగబద్ధత పాటించడం లేదని, బిసి రిజర్వేషన్ల విషయంలో తమ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పలుమార్లు సరైన సూచనలు చేసినా కాంగ్రెస్ పార్టీ పట్టించుకోలేదన్నారు. 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలంటే అందులో 10 శాతం ముస్లింలను కలపవద్దని, బిసి కోటాలో ముస్లింలకు రిజర్వేషన్ ఇవ్వడాన్ని మేము వ్యతిరేకిస్తున్నామన్నారు. గవర్నర్, రాష్ట్రపతి లాంటి రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలపై ఒత్తిడి తేవాలని చెబుతూనే, వారిపై విమర్శలు చేయడం రెండు నాల్కల ధోరణికి నిదర్శనమని అన్నారు.

# బలహీనవర్గాల సామాజిక న్యాయం కోసం మద్దతు ఇవ్వండి

## అఖిలేష్‌యాదవ్‌తో మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్ భేటీ



ఢిల్లీలో ఇండియా కూటమి నేత అఖిలేష్ యాదవ్‌తో సమావేశమైన మాజీ ఎంపి అంజన్‌కుమార్‌యాదవ్

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** తెలంగాణలో ఆర్థికంగా సామాజికంగా వెనుకబడిన తరగతుల సామాజికవర్గాలకు సమాన అవకాశాలు కల్పించడానికి రిజర్వేషన్ పెంపు బిల్లుకు మద్దతు తెలుపాలని మాజీ ఎంపి అంజన్‌కుమార్ యాదవ్ కోరారు. గురువారం ఢిల్లీలో అఖిలేష్ యాదవ్ తో అంజన్ కుమార్ సమావేశమై తెలంగాణ ప్రభుత్వం జరిపిన కులగణన సర్వేను వివరించారు. శాసనసభ ఎన్నికలలో సామాజిక న్యాయం కోసం రిజర్వేషన్ విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు అత్యధికంగా కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కృషిచేస్తుందని ఇచ్చిన హామిని నిలబెట్టకోవడానికి ప్రయత్నం చేస్తున్నదని ఆయన అఖిలేష్‌కు తెలిపారు బలహీన వర్గాల సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం చేసిన 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలుకు మద్దతు ఇవ్వాలని సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి అ ఖిలేష్ యాదవ్ ను మాజీ ఎంపీ, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం. అంజన్ కుమార్ యాదవ్ కోరారు. గురువారం ఢిల్లీలోని నివాసంలో అఖిలేష్ యాదవ్ తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన చట్టానికి సంబంధించిన వాస్తవ స్థితిగతులను వివరించారు. బలహీన వర్గాల జనాభా లెక్కలు సేకరించి వారికి 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ప్రత్యేక చట్టం చేశామని తెలిపారు.

పార్లమెంట్ లో బిసి బిల్లు ఆమోదానికి మద్దతు ఇవ్వాలని, తద్వారా బలహీన వర్గాల అభ్యున్నతికి సహకారం అందించాలని అఖిలేష్ యాదవ్ కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అసెంబ్లీలో బిసి బిల్లుకు బీజేపీ ఎమ్మెల్యేలు మద్ద తు ప్రకటించారని, తీరా పార్లమెంట్ ఆమోదానికి వచ్చిన తర్వాత బిల్లును వ్యతిరేకిస్తూ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నారని తెలిపారు. బడు గులకు స్థానిక సంస్థలతో పాటు అన్ని రంగాల్లో సరైన వాటా కల్పించడానికి ప్రతిపాదిం చిన బిల్లు కార్యరూపం దాల్చడానికి సమాజ్ వాదీ పార్టీ పరంగా సహకారం అందించాలని మాజీ ముఖ్యమంత్రికి అంజన్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

# ఇంజిన్ లోపంతో 'బసవ ఎక్స్‌ప్రెస్' ఆలస్యం

## 15 గంటలుగా ప్రయాణికుల అవస్థలు

## ప్రమాదాన్ని గుర్తించి డెమో ప్యాసింజర్ రైలు రద్దు

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** మైసురుకు చేరుకోవాల్సిన బసవ ఎక్స్‌ప్రెస్ రైలు 15గంటలు ఆలస్యంగా గుంతకల్లుకు చేరుకుంది. నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ బాగల్ కోట్ నుంచి రాయలసీమ జిల్లాల మీదుగా మైసురుకు బయలుదేరిన బసవ రైలులో ఇంజిన్ లోపం ఏర్పడడంతో లోకోఫైలట్ తీవ్రంగా శ్రమించి ఆదోని వరకు చేరుకోగా.. అక్కడి నుంచి డెమె రైలులో ప్రయాణీకులను గుంతకల్లుకు చేర్చారు. అయితే ఇంజిన్‌లోని లోపాలను ఎంత వెతికిన ప్రయోజనం లేకపోవడంతో ఇక్కడ నుంచి మైసురుకు వెళ్లేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రిలీఫ్ రైలును ఏర్పాటు చేశారు. ప్రయాణీకుల ఇబ్బందుల దృష్ట్యా సీనియర్ డిఓఎం శ్రావణ్ కుమార్, సీనియర్ డిసిఎం మనోజ్, ఏసిఎం ధనుంజయ కుమార్ సింగ్, సిబ్బంది తీవ్రంగా కృషి చేశారు. ప్రయాణీకుల సౌకర్యాలకు ఎలాంటి ఆటంకాలు ఏర్పడకుండా ఉచిత భోజన వాటర్ బాటిల్స్‌ను సమకూర్చారు. రాత్రి భోజనం ధర్మవరం స్టేషన్‌లో పంపిణి చేశారు. అదేవిధంగా ప్రతి భోగిలో టిటిఇ, ఆర్‌పిఎఫ్‌ఎస్ఐ అధికారుల పటిష్ట భద్రత మధ్య గురువారం సాయంత్రం బసవ ఎక్స్‌ప్రెస్ రిలీఫ్ ట్రైన్ కొనసాగింది.

**నేడు రెండు ప్యాసింజర్ రైళ్లు రద్దు..**

బసవ ఎక్స్ ప్రెస్ ఘటన కారణంగా శుక్రవారం గుంతకల్లు నుండి తిరుపతికి బయలుదేరే నెంబర్ 57404 పాసింజర్, తిరుపతి నుంచి కదిరి దేవరపల్లి కి వెళ్ళే నెంబర్ 57405 పాసింజర్ రైలు సర్వీసులను రద్దు చేసినట్లు రైల్వే అధికార వర్గాలు వెల్లడించాయి.

# బనకచర్లకు బదులుగా ఫోర్‌వాటర్ కాన్సెప్ట్‌ను ఉపయోగించాలి

## శాశ్వతంగా కరవును నివారించవచ్చు:

## ఎపి సిఎం చంద్రబాబుకు శశిధర్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 7, ప్రభాతవార్త:** బనకచర్ల ప్రాజెక్టు వల్ల ఉపయోగం కంటే అధిక ఖర్చు అవుతుందని, చివరికి తెల్ల ఏనుగుగా మారు తు ందని డాక్టర్ ఎం.చెన్నారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ట్రస్టీ, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి చెప్పారు. దీనికి బదులుగా నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేపట్టిన 'నీరు-మీరు' కార్యక్రమాన్ని అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు చంద్రబాబునాయుడుకు తాను లేఖ రాయడం జరిగిందని, అవకాశం ఇస్తే అన్ని అమరావతిలో కలిసి చర్చిస్తానని చెప్పారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ 2001లో దివంగత హనుమంత రావు అధ్యక్షతన ఒక సాంకేతిక కమిటీని చంద్రబాబు ఏర్పాటు చేయడం జరిగిందని ఫోర్ వాటర్ కాన్సెప్ట్ (ఎఫ్‌డబ్ల్యూసి) ఆధారంగా వాటర్ షెడ్ ప్రాజెక్టులను అమలు చేయాలని సిఫార్సు చేయడం జరిగిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా తెలంగాణ-రాయల సీమలో 84-120 గ్రామాలను కవర్ చేయడం జరిగిందని, అదు భుతమైన ఫలితాలను గుర్తించలేక పోయిన జహీరాబాద్ సమీపంలోని కోహీర్ మండలం, గొట్టిగారిపల్లి గ్రామం విజయం సాధించి, మీడియా దృష్టిని అకర్షించిందన్నారు. నాడు ఎకరానికి 5 వేలు రూపాయలు ఖర్చు చేస్తే, ఒక ఏడాదిలో మూడు పంటలకు నీరు లభించేదని, అయితే తెలుగు రాష్ట్రాలు ఎఫ్‌డబ్ల్యూసిని పూర్తిగా విస్మరించబడా యన్నారు. గతంలో ప్రధాన నరేంద్రమోదీ 2017లో మన్ కి బాత్ ఎపిసోడ్ కార్యక్రమంలో ఈ కార్యక్రమం విజయం గురించి ప్రస్తావన చేయడం జరిగిందని శశిధర్‌రెడ్డి వివరించారు. ఎఫ్‌డబ్ల్యూసి వల్ల ఆనేక ప్రయోజనాలు ఉన్నాయని, బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆపి శాశ్వితంగా కరువు నివారణ కోసం ఫోర్ వాటర్ కాన్సెప్ట్‌ను ఎంపిక చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చంద్రబాబునాయుడు బనకచర్ల ప్రాజెక్టును ప్రక్కన బెట్టి దానికి అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని ఎఫ్‌డబ్ల్యూసికి అమలు చేయాలని, దీంతో ఏడాదికి మూడు పంటలకు నీరు అందించి మూడు రెట్లు ప్రయోజనం పొందే అవకాశం ఉందని, అలా చేస్తారని తాను భావిస్తున్నట్లు చెప్పారు. నా శేష జీవితాన్ని హనుమంతరావు, ఎఫ్‌డబ్ల్యూసికి అంకితం చేస్తున్నానని, ఎఫ్‌డబ్ల్యూసి మనదేశానికి గోప్పవరమని, జాతీయ స్థాయిలో విధాన మారు ్పలు అవసరమని, ఎపి ప్రభుత్వం నాయకత్వం వహించగలదని అశిస్తున్నట్లు చెప్పారు.



గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీమంత్రి మర్రి శశిధర్‌రెడ్డి

# తెలుగు చలనచిత్ర కార్మికుల సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు

## రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** తెలుగు చలనచిత్ర కార్మికుల సమ్మెకు సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సంపూర్ణ మద్దతుప్రకటిస్తుందని రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 4 నుంచి తెలుగు రాష్ట్రాల్లోని చలనచిత్ర కార్మికులు చేస్తున్న సమ్మెకు తమ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందన్నారు. 24 క్రాఫ్ట్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌లో పని చేస్తున్న వేలాది కార్మికులకు సంబంధించిన వేతనాల పెంపు విషయంలో చలనచిత్ర రంగంలోని నిర్మాతలు మొండి పట్టుదలకు పోకుండా వారితో చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు వేతనాలు పెంచాలని కార్మికులు కోరుతున్నారు. 2022 సంవత్సరంలో అగ్రిమెంట్ జరిగిందని.. గత మూడేళ్ల నుండి వేతనాలు పెంచలేదని.. పైగా గతంలోనే వేతన ఒప్పందం సందర్భంగా 30 శాతం పెంపుదలకు హామీనిచ్చారన్నారు. ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని కార్మికులు డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేస్తున్నారని జాన్ వెస్లీ తెలిపారు. అసంఘటిత రంగంగా వున్న కార్మికులు ఏరోజు కారోజు పని దొరికితేగానీ కుటుంబాలు గడవని వారే ఎక్కువగా ఉన్నారన్నారు.

# ఎసిబికి చిక్కిన ఇరిగేషన్ డిఇ

**మానవపాడు ఆగస్టు 7, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో అవినీతి అధికారుల బర్ధం పడుతున్న ఏసీబీ అధికారులు వివిధ పనులకు లంచాలు అడుగుతూ పట్టు బడుతున్న అధికా రులపై ఏసీబీ అధికారులు వాళ్ల గుండెలలో రైలు పట్టాల మాదిరి బెంబేలెత్తి స్తున్నారు. గురువారం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ లోని ఇరిగేషన్ డిఇ జోగులాంబ వాగులో 4 లక్షల రూపాయలు చేసిన పనులకు 12 వేల రూపాయలు డిమాండ్ చేయడంతో కాంట్రాక్టర్ 11 వేలకు ఒప్పందం కుదుర్చుకోవడం జరి గింది. చేసిన పనులలో నష్టం వచ్చిందని కాం ట్రాక్టర్ సంబంధిత డి ఈ శ్రీకాంత్ నాయుడు కి వేడుకున్న సనేమిర అనడంతో 12000 ఇవ్వాలని డిమాండ్ చేయడంతో చేసేది ఏమీ లేక 11 వేలకు ఒప్పందం చేసుకొని ఏసీబీ అధికారులను ఆశ్రయించడం జరిగింది. గురు వారం ఏసీబీ అధికారులు ఇరిగేషన్ డిఇ శ్రీకాంత్ నాయుడుకి 11,000 రూపాయలు ఇస్తుండగా రెడ్‌హ్యాండ్‌గా పట్టుకొని అరెస్టు చేశారు. పట్టుబడిన ఇరిగేషన్ డి ఈ శ్రీకాంత్ నాయుడును అరెస్టు చేసి ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.



ఎసిబికి చిక్కిన ఇరిగేషన్ డిఇ

# పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా ఖమ్మంలో భారీ ప్రదర్శన

## సామ్రాజ్యవాదంపై పెల్లుబికిన నిరసన

**ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త:** పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ఖమ్మం ప్రజలు గొంతెత్తి నిరసించారు. మానవత్వం మరిచి మహిళలు, వృద్ధులు, పసిపిల్లలపై చేస్తున్న దాడులను ముక్త కంఠంతో ఖండించారు. సామ్రాజ్యవాదులారా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. గురువారం ఖమ్మంలో రాజకీయ పార్టీ లు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, మేధావులు, పాలస్తీనా సంఘీభావ కమిటీ నేతృత్వంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సామ్రాజ్యవాదాన్ని కాంక్షి స్తూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై అమానవీయ దాడులు చేస్తున్న తీరును నిరసిస్తూ వేలాది మంది పాలస్తీనా సంఘీభావ ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీతో వైరా రోడ్డు కిటకిట లాడగా ర్యాలీ ముగింపు జరిగిన ఖమ్మం జెడ్పి సెంటర్ జన సంద్రమైంది. స్థానిక పెవిలియన్ మైదానం నుంచి పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా జరిగిన ర్యాలీ స్థానిక పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైంది. మయూరిసెంటర్, పాత బస్టాండ్ మీదుగా జెడ్పి సెంటర్ వరకు సాగింది. సేవ్ గాజా సేవ్ పాలస్తీనా అంటూ ప్లేకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, విద్యార్థి, మేధావి సంఘాల నేతలు మాట్లాడుతూ పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల మూలంగా పాలస్తీనా ప్రజలు నీరు, ఆహారం, మందులు, నిత్యావసర వస్తువులు అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే గాజాలో 20 లక్షల మంది ప్రజలు దుర్భర దారిద్ర్యాన్ని గడుపుతుండగా వేలాది మంది ప్రజలు మరణించారని అక్కడి ప్రజలకు ఆహారాన్ని అందించకుండా ఇజ్రాయిల్ దాడులు చేస్తుందని ఆరోపించారు. ఒక పక్క దాడులు మరో పక్క ఆకలి కేకలతో ప్రజలు అల్లాడిపోతున్నారని సామ్రాజ్యవాద కాంక్షతోనే ఇటువంటి అమానవీయ ఘటన చోటు చేసుకుంటుందని వారు తెలిపారు. గాజాకు స్వేచ్ఛ ఇచ్చినట్లు ఇచ్చి భూ గగనతలంపై ఆంక్షలు విధించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్ పాషా, సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంక టేశ్వర్లు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మధు, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్, మైనార్టీ నాయకులు మహ్మద్ హుస్సేన్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొ. గడ్డం లక్ష్మణ్, పాలస్తీనా సంఘీభావ కమిటీ నాయకులు రవిమారుత్, భాస్కర్, మువ్వా శ్రీనివాస్, ఐవి రమణారావు, దేవిరెడ్డి విజయ్, బండారు రమేష్, మనోహర్ రాజు, ఎంఎఫ్ గోపీనాథ్, రవీంద్రనాథ్, కిషన్ నాయక్, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు పరిశ పుల్లప్రసేన్, న్యాయవాదులు తిరుమలరావు, ఒరుగంటి శేషగిరిరావు, సుగుణారావు, పోటు కళావతి, జర్నలిస్టు సంఘాల నాయకులుఆకుతోట ఆదినారాయణ, చిర్రా రవి ఏను వెంకటేశ్వర్లు శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు. ప్రభాత సామ్రాజ్యవాదాన్ని ఖమ్మం ప్రజలు గొంతెత్తి నిరసించారు. మానవత్వం మరిచి మహిళలు, వృద్ధులు, పసిపిల్లలపై చేస్తున్న దాడులను ముక్త కంఠంతో ఖండించారు. సామ్రాజ్యవాదులారా ఖబడ్దార్ అంటూ హెచ్చరించారు. గురువారం ఖమ్మంలో రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, విద్యార్థులు, మేధావులు, పాలస్తీనా సంఘీభావ కమిటీ నేతృత్వంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. సామ్రాజ్య వాదాన్ని కాంక్షి స్తూ ఇజ్రాయిల్ పాలస్తీనాపై అమానవీయ దాడులు చేస్తున్న తీరును నిరసిస్తూ వేలాది మంది పాలస్తీనా సంఘీభావ ర్యాలీలో పాల్గొన్నారు.

ర్యాలీతో వైరా రోడ్డు కిటకిట లాడగా ర్యాలీ ముగింపు జరిగిన ఖమ్మం జెడ్పి సెంటర్ జన సంద్రమైంది. స్థానిక పెవిలియన్ మైదానం నుంచి పాలస్తీనా ప్రజలకు సంఘీభావంగా జరిగిన ర్యాలీ స్థానిక పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైంది. మయూరిసెంటర్, పాత బస్టాండ్ మీదుగా జెడ్పి సెంటర్ వరకు సాగింది. సేవ్ గాజా సేవ్ పాలస్తీనా అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అజీజ్ పాషా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్) మాస్లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మధు, బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కాంగ్రెస్ నాయకులు శేఖర్ గౌడ్, మైనార్టీ నాయకులు మహ్మద్ హుస్సేన్, పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొ. గడ్డం లక్ష్మణ్, పాలస్తీనా సంఘీభావ కమిటీ నాయకులు రవిమారుత్, భాస్కర్, మువ్వా శ్రీనివాస్, ఐవి రమణా రావు, దేవిరెడ్డి విజయ్, బండారు రమేష్, మనోహర్ రాజు, ఎంఎఫ్ గోపీనాథ్, రవీంద్రనాథ్, కిషన్ నాయక్, పెన్షనర్ల సంఘం అధ్యక్షులు పరిశ పుల్లప్రసేన్, న్యాయవాదులు తిరుమలరావు, ఒరుగంటి శేషగిరిరావు, సుగుణారావు, పోటు కళావతి, జర్నలిస్టు సంఘాల నాయకులు ఏనుగు వెంకటేశ్వరరావు, ఆకుతోట ఆదినారా యణ, శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపా ధ్యాయ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.



గురువారం ఖమ్మంలో పాలస్తీనాపై ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న దాడులను నిరసిస్తూ వేలాది మంది సంఘీభావ ర్యాలీలో పాల్గొన్న దృశ్యం





# గ్రీన్‌ఎనర్జీ కారిడార్ స్టేజ్-3కి అనుమతి ఇవ్వండి

## కేంద్రమంత్రి మనోహార్‌లాల్ కట్టర్‌తో డిప్యూటీ సిఎం విక్రమార్క భేటీ

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** గ్రీన్ ఎనర్జీ కారిడార్ స్టేజ్-3 కింద రాష్ట్రానికి విద్యుత్ పంపిణీ వ్యవస్థ ప్రతిపాదనలకు సంబంధించి అనుమతులు ఇవ్వాలని కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహార్‌లాల్ కట్టర్‌కు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మల్లు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రీన్ ఎనర్జీ కారిడార్ దశలో సౌర విద్యుత్ సంస్థ మొదట తెలంగాణలోని ఐదు జిల్లాల్లో మొత్తం 13.5 గిగావాట్ల సామర్థ్యం గ్రీన్ పవర్ జోన్‌లను గుర్తించింది. వీటి ద్వారా విండ్, సోలార్, పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను ఎగుమతి చేయాల్సి ఉంటుందని కేంద్రం దృష్టికి తీసుకొచ్చారు. ఎస్ఇసిఐ, టిజిఐర్కోల్లో విస్తృతంగా పర్యటించిన అనంతరం, భూమి లభ్యత, పునర్వినియోగ విద్యుత్ సాధ్యతలను పరిగణనలోకి తీసుకొని, ఈ ఆర్ఇ జోన్ల సామర్థ్యం 19 గిగావాట్లకు పెంచి నట్లు వివరించారు. ఇది రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలను కవర్ చేస్తోందని, ఈ సవరణకు అనుగుణంగా, టిజి ట్రాన్స్‌కో మొత్తం 19 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగిన 8 ట్రాన్స్‌మిషన్ పథకాలతో కూడిన సమగ్ర ప్రతిపాదనను తయారుచేసి, దాని అంచనా వ్యయం రూ. 6,895 కోట్లుగా పేర్కొంటూ కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థకు సమర్పించిందని తెలిపారు.



జడ్చర్లలోని నేతాజీ చౌరస్తా ప్రధాన రహదారిపై భారీ వర్షపు నీరు

# రెండు గంటలు కుండపోత

## పాలమూరులో భారీ వర్షం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో గురువారం సాయంత్రం ఒక్కసారిగా కుండపోత వర్షం కురిసింది. దాదాపు రెండు గంటలకు పైగా భారీ వర్షం నమోదు కావడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని న్యూ టౌన్ బస్టాండ్ ప్రాంతంతో పాటు పలు వార్డుల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరింది. పలు గ్రామాల్లోని చెరువులకు వరద నీరు చేరింది. చెరువును తలపించిన నేతాజీ చౌరస్తా..జడ్చర్ల లోని నేతాజీ చౌరస్తా ప్రధాన రహదారిపై భారీ వర్షపు నీరు చేరుకోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చాలావరకు వాహనదారులు పాత బస్టాండ్ రోడ్డు రైల్వే అండర్ పాస్ గుండా ప్రయాణం కొనసాగించారు. పద్మావతి కాలనీ తోపాటు పలు కాలనీలో జలమయమయ్యాయి.



# క్రిమినల్ గ్యాంగ్‌లపై ప్రత్యేక నిఘా

## నేర సమీక్షా ముగింపు సమావేశంలో డిజిపి జితేందర్

**హైదరాబాద్, ఆగస్టు7, ప్రభాతవార్త:** నేరాలకు పాల్పడే క్రిమినల్ గ్యాంగ్‌లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని రాష్ట్ర డిజిపి డా.జితేందర్ పోలీస్ ఉన్నతాస్థాయి అధికారులకు సూచించారు. తొలి ఏడాది అర్ధవార్షిక నేరసమీక్ష సమావేశం గురువారంతో ముగిసింది. డైరెక్టర్, టిజిపిఏ డైరెక్టర్ అభిలాష బిస్త్, జైళ్ల డిజి సౌమ్య మిశ్రా, అడిషనల్ డిజిలు మహేశ్ ఎం భగవత్ , వి వి శ్రీనివాసరావు , స్వాతిలక్రా, అనిల్ కుమార్, సంజయ్ కుమార్ జైన్, స్టీఫెన్ రవీంద్రలతో పాటు సీనియర్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ నేరాలను అరికట్టేందుకు కఠినమైన చట్టాలు ఉన్నాయన్నారు.రాష్ట్రంలో డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అరికట్టాలని పేర్కొన్నారు. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని ఉన్నతాస్థాయి అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అదేవిధంగా యువత డ్రగ్స్ బారినపడి భవిష్యత్తు నాశనం కాకుండా అవగాహన కార్యక్రమాలు, చర్యలు చేపట్టాలని సూచించారు. నిందితుల సరఫరా చేసే మాదకద్రవ్యాల రవాణాపై స్పష్టమైన వివరాలు సేకరించాలని, దాంతో ఎక్కడెక్కడ నుంచి తరలిస్తున్నారనే వాటిపై పటిష్ట నిఘా ఏర్పాటుకు వీలు ఉంటుంది. అడిషనల్ డిజి మహేష్ భగవత్ మాట్లాడుతూ పార్థీ గ్యాంగ్‌ల తరహాలో చెడ్డి, భవేరియా వంటి గ్యాంగ్ లపై దృష్టి పెట్టాలని, నకిలీ విత్తనాల విషయంలో అవసరమైతే పిడి యాక్ట్ నమోదు చేయాలని తెలిపారు. సమావేశంలో టి న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా, డ్రగ్స్ కంట్రోల్ డైరెక్టర్ షా వనాజ్ ఖాసీం, సిఐడి డిఐజి నారాయణ నాయక్, మహిళా,శిశు సంక్షేమశాఖ సెక్రటరీ అనిత రామ చంద్రన్,ఉస్మానియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్, కమిషనర్లు సుధీర్‌బాబు, అవినాష్ మహంతి తదితర అధికారులు పాల్గొన్నారు.

# తెలంగాణ చేనేతకు దేశంలోనే ప్రత్యేక స్థానం

## జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

## ఆరు ఉత్పత్తులకు జియోగ్రాఫికల్ ఇండికేషన్

**హైదరాబాద్ (బేగంపేట), ఆగస్టు 7, ప్రభాతవార్త:** దేశంలో ఎక్కడా లేని విధంగా చేనేత కార్మికులకు తెలంగాణాలో భద్రత కల్పిస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నెక్లెస్‌రోడ్డు పీపుల్స్ ప్లాజాలో గురువారం నుంచి ఈ నెల 17వరకు చేనేత వస్త్ర ప్రదర్శనను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ ప్రదర్శన ఉదయం గం 10నుంచి రాత్రి గం 10ల వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్,ప్రదర్శించిన చేనేత వస్త్రాలను తుమ్మల అధికారులు,నేత కార్మికులతో కల్సి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా 1905లో స్వదేశీ ఉద్యమం ప్రారంభించిన జ్ఞాపకార్థం 2015నుంచి ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. తెలంగాణ చేనేతలు దేశంలోనే ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయన్నారు. ఇక్కడి చేనేత కళలు నైపుణ్యత ప్రత్యేకమైనవన్నారు. తెలంగాణా చేనేతలలో ఆరింటికి జియోగ్రాఫికల్ ఇండికేషన్ (జీఐ) లభించిందన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణా ప్రభుత్వం నేత కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. చేనేత కార్మికుల కోసం కొన్ని ప్రత్యేక పథకాలను చేపట్టి వాటిని రాష్ట్ర ప్రధాన కార్యక్రమాలుగా అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో 23046 చేనేత మగ్గాలను జీయో ట్యాగింగ్ చేసారన్నారు. అన్ని మగ్గాలకు యూనిక్ ఐడితో జియో ట్యాగింగ్ చేయడం దేశంలో ఇదే మొదటిదన్నారు. తెలంగాణా నేతన్న పొదుపు పథకం అలవాటును పెంపొందించడానికి చేనేత కార్మికుల వేతనంలో 8శాతం బ్యాంకులో జమచేసే దానికి బదులుగా 16శాతం జమచేస్తుందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 40వేల మంది లబ్దిదారుల ఆర్‌డిజడ్ ఖాతాలకు ప్రయోజనం చేకూర్చడానికి రూ 100కోట్లు కేటాయించారన్నారు. నేతన్నకు భరోసా జియో ట్యాగింగ్ చేసిన ప్రతి మగ్గానికి జారీ చేసిన ప్రామాణిక వీవ్స్‌లేబుల్ సంఖ్య ఆధారంగా చేనేత మరియూ అనుబంధ కార్మికులకు వేతన మద్దతు అందించడం ఈ పథకం లక్ష్యమన్నారు. నేత కార్మికుడికి సంవత్సరానికి గరిష్టంగా రూ 18000లు, అనుబంధ కార్మికుడికి సంవత్సరానికి రూ 6000లు మద్దతు లభిస్తుందన్నారు. ఈ పథకం కింద దాదాపు 40వేల మంది లబ్దిదారులను కవర్ చేయడానికి 2025-26 సంవత్సరానికి రూ 48.00కోట్లు కేటాయించామన్నారు. తెలంగాణ ప్రభుత్వం,జౌళిశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మక ఇండియన్ ఇన్‌సిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నా లజీ (ఐఐహెచ్‌టీ)ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు.

కార్యక్రమంలో శైలజారామయ్యర్ ,గుండు సుధారాణి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలిఁగ చీరెను మంత్రి తుమ్మల చేతుల మీదుగా అవిష్కరించారు. పలు స్టాల్స్‌ను తుమ్మల ప్రారంభించారు. పలువురు చేనేత కార్మికులను మంత్రి తుమ్మల శాలువాలతో సత్కరించి అవార్డులను అందజేసారు.

# దేశవ్యాప్తంగా కులగణనతో బిసిలకు నవశకం

## ఒబిసిలకు మేలు చేయాలనే కేంద్ర కేబినెట్‌లో 27మందికి అవకాశం

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్



**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా బీసీలు కోరుకున్నట్టుగానే మొదటిసారిగా కేంద్ర ప్రభుత్వం వచ్చే సంవత్సరం 2006 నుండి దేశవ్యాప్తంగా కులగనన మొదలుపెట్టనున్నదని, కులదణ జరిగిన తర్వాత దేశంలో బీసీలకు నవశకం వచ్చే అవకాశం ఉందని తాను విశ్వసిస్తున్నట్లు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పడ్నవిస్ అన్నారు. ఈ మేరకు గురువారం గోవా రాష్ట్రంలోని గోవా యూనివర్సిటీ దగ్గర ఉన్న శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో పదవ అఖిల భారత జాతీయ ఓబీసీ మహాసభ జరిగింది. ఈమహాసభకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వం వహించగా, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ అధ్యక్షులు ప్రొఫెసర్ భవన్ రావు తైవాడే సభాఅధ్యక్షత వహిం చారు. ఈ సందర్భంగా ఫడ్నవీస్ మాట్లాడుతూ ఓబీసీ సామాజిక వర్గానికి చెందిన ప్రధాని నరేంద్ర మోదీ ఓబీసీలకు మేలు చేయాలని ఉద్దేశంతో కేంద్ర మంత్రిత్వ శాఖలో 27 మందికి బీసీలకు అవకాశం కల్పించారని, సామాజిక న్యాయ కోణంలో దేశంలో రాష్ట్ర పతులుగా బలహీన వర్గాలకు అవకాశం కల్పిం చరనీ, మహారాష్ట్రలో కానీ ఇటు దేశవ్యాప్తంగా గాని బీసీ లకు ఇంకా అవకాశాలు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొం టున్న సమస్యలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ జాతీయ ఓబీసీ మహాసభను గోవాలో నిర్వహించడం అభినంద నీయమని, మహాసభల ద్వారా బీసీల ఐక్యత చెంది తమకు కావలసిన వాటాను సాధించుకోవాలని ఆయన సూచించారు. గోవా రాష్ట్రంలో తన మంత్రివర్గంలో బీసీలకు ముగ్గురికి అవకాశం కల్పించాలని, బీసీల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది అన్నారు.

బిసిల విషయంలో కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నడానికి దేశవ్యాప్త కులగన చేపట్టడమే ఇందుకు నిదర్శనం అన్నారు. బిసిల విషయంలో మహారాష్ట్ర సిఎం పడ్నవీస్‌తో కలిసి ప్రధానితో చర్చించి బీసీల భవిష్యత్తుకు ఇద్దరం బాసటగా నిలబడతామని హామీ ఇచ్చారు ఏఐసిసి ప్రధాన కార్యదర్శి, గోవా కాంగ్రెస్ ఇంచార్జ్ మాణిక్ రావు ఠాగూర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీ కులాల లెక్కలు తీసి జనాభా ఆధారంగా బీసీలకు పంచాయతీ నుండి పార్లమెంట్ వరకు ఎవరి వాటా వారికి దక్కాలన్నది కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతమని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్.. మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులణన జరగాలని, గల్లీ నుండి ఢిల్లీ దాకా బీసీలు పోరాటం చేస్తే కేంద్ర ప్రభుత్వం స్పందించి జనగణతో పాటే కులగణను చేస్తామని ప్రకటించిందని దీనిని స్వాగతిస్తున్నామని అన్నారు.

# కరీంనగర్‌లో బిఆర్ఎస్ బిసి గర్జన సభ 14కు వాయిదా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, ఆగస్టు 7:** కరీంగనర్‌లో శుక్రవారం జరగాల్సిన బిఆర్ఎస్ బిసి గర్జన సభ వాయిదా పడింది. ఈ నెల 14వ తేదీన కరీంనగర్‌లో బిఆర్ఎస్ బిసి గర్జన సభ నిర్వహించనున్నట్లు బిఆర్ఎస్ ఎంఎల్ఎ, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో గురువారం బిఆర్ఎస్ నేతలు తలసాని శ్రీనివాస్ యాదవ్, మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్, గంగుల కమలాకర్‌లతో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ చెప్పిందని,బిసిలకు లక్ష కోట్లు బడ్జెట్ పెడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. బిసి రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ ఢిల్లీలో మూడు రోజులుగా డ్రామా చేస్తుందని విమర్శించారు. జంతర్ మంతర్ వద్ద జరిగిన ధర్నాకు సోనియాగాంధీ,రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ,మల్లిఖార్జున ఖర్గే ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఢిల్లీలో ఇండియా కూటమి మొత్తం ధర్నాకు వస్తుందని చెప్పారని, కానీ రాహుల్ గాంధీ కూడా వెళ్లలేదని విమర్శించారు. హడావుడిగా కులగణన చేశారని, తొందరపాటుతో ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చిందని అన్నారు.

# రూ.6 వేల కోట్ల హ్యామ్‌రోడ్లకు తొలిదశ టెండర్లు

## సనత్‌నగర్ టిమ్స్ అక్టోబర్‌లో ప్రారంభం: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** హ్యామ్స్ రోడ్లకు తొలిదశలో రూ.6 వేల కోట్ల వచ్చే వారం టెండర్లు పిలుస్తున్నామని ఆర్ అండ్ బి మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో గురువారం మంత్రి చిట్‌చాట్ చేస్తూ ఈ రూ.6వేల కోట్లులో 10శాతం స్టేట్ గవర్నమెంట్ వాటాగా నిర్మాణ వ్యయం పెట్టుకుంటుందని, మూడు సంవత్సరాల్లో రోడ్లను పూర్తి చేయాలని ఆలోచన చేస్తున్నామని తెలిపారు. నాకు నా డిపార్ట్‌మెంట్ తప్ప వేరే పనిలేదు అందుకే వర్క్ స్పీడ్ చేస్తున్నామని అన్నారు. ఈనెల 12న హామ్‌రోడ్‌పై కాంట్రాక్టర్ల తో మీటింగ్ ఏర్పాటు చేస్తున్నామని, కేంద్రమంత్రి గడ్కరీతో మీటింగ్ జరిగింది వాటి వివరాలు కూడా అక్కడ చర్చించుకొంటామని తెలిపారు. కేంద్రమంత్రి




గడ్కరితో రాష్ట్రంలో జాతీయ రహదారుల, రాష్ట్ర రహదారుల పనులు పై , అనుమతులు ఈ కమిటీ లో చర్చ జరిగిందని వివరించారు. ఇరిగేషన్, పవర్, పంచాయతీ ఉన్నతాధికారులు ఈ కమిటీ లో ఉన్నారని తెలిపారు. అన్ని రాష్ట్రల్లో ఈ కమిటీ ఏర్పాటు అయింది విజయవాడ కు ఫ్యూచర్ సిటీ నుంచి గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరు చేస్తారని, త్రిబుల్ ఆర్ నార్త్ పార్ట్ ఈనెల లో కేంద్ర కేబినెట్ లో ఆమోదం తెలుపువతము అని గడ్కరీ హామీ ఇచ్చారని తెలిపారు. శిబుశోరెన్ గొప్ప నేత అందు కే రాహుల్ రాంచి వెళ్ళారు ధర్నాకు రాలేక పోయారు బిఆర్ఎస్ పదేళ్ళ అవినీతి పై కమిషన్ లతో విచారణ జర్పిస్తున్నము20 నెలల కే కెటిఆర్ డైరీలో పేర్లు రాసుకొంటున్నారని పదేళ్లలో ఏళ్ల లో మా కార్యకర్తలులో ఎంతో ఇబ్బందులు పడ్డారని మేము రాయాలంటే ఎన్నో పేర్లు డైరీ లో రాసుకోవాలి అని ఆయన అన్నారు. కలెక్టర్ లను ఎస్పీ లను కూడా కెటిఆర్ తిడుతున్నారని ఆవేదన చెందారు. రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై చిట్‌చాట్‌లో విలేఖరుల ప్రశ్నలకు రోడ్లు భవనాలుశాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకటరెడ్డి మౌనం వహించి జగదీష్ రెడ్డి గురుంచి మాట్లాడే స్థాయి నాది కాదంటూ మాటమార్చారు. ఉమ్మడి నల్గొండ అభివృద్ధి నా లక్ష్యం నల్గొండ రింగ్‌రోడ్ టెండర్స్ పిలిచామన్నా రు. శుక్రవారం సినీకార్మికుల సమ్మెపై చర్చలకి పిలి చారని తెలిపారు. సనత్‌నగర్ టీమ్స్ అక్టోబర్ లో ఓపెన్ చేస్తామని, వర్క్ చివరి దశకు వచ్చింది మెడికల్ పరికరాలు వచ్చేనెలలో వస్తాయని వివరించారు.

# రైలుబండి.. పండుగొస్తే వెయింటింగేనండి!

## 'దసరా' బెర్తులపై ప్రయాణికుల నిరుత్సాహం

## సెప్టెంబరు 28, 29, 30 తేదీలు మరీ బిజీ



**హైదరాబాద్, ఆగస్టు 7. ప్రభాతవార్త:** దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్లేందుకు ఇప్పటికే రైళ్లలో రిజర్వేషన్లకు క్యూ కడుతున్నారు. అక్టోబరు 2న పండుగ ఉండడంతో మూడు రోజుల తేదీలు సెప్టెంబరు 28,29,30 తేదీలకే ఆసక్తి చూపుతున్నారు. అయితే ఇప్పటికే అవన్నీ నిండిపోయినట్లు నోటీస్‌బోర్డులో ఏర్పాటు చేశారు. లక్షలాది మంది దూర ప్రాంతాలకు వెళ్లే వారు ట్రైన్ టికెట్స్ బుక్ చేసే పనిలో పడ్డారు. అయితే ఏ ట్రైన్లో చూసినా భారీగా వెయిటింగ్ లిస్ట్ కనపడు తుంది. దీంతో ప్రయాణీకులు ఒకింత ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కొన్ని రైళ్లలో రిగ్రెట్ స్టేటస్ కూడా కనిపిస్తోంది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి విజయవాడ, బెంగళూరు, విశాఖపట్నం వెళ్లే ట్రైన్లలో రిజర్వేషన్ కు అవకాశం లేకుండా పోయింది.

### ప్రధానమార్గాల్లో వెయిటింగ్ లిస్టుయే..

కొన్ని రైళ్లలో ఏకంగా వందల సంఖ్యలో వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తుండగా.. మరికొన్ని రైళ్లలో రిగ్రెట్ స్టేటస్ కనిపిస్తోంది. ఇది ప్రయాణికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది.ప్రస్తుతం హైదరాబాద్, సికింద్రాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు, భువనేశ్వర్ వంటి ప్రధాన నగరాలకు వెళ్లే రైళ్లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంది. ముఖ్యంగా.. ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, కోణార్క్ ఎక్స్‌ప్రెస్, విశాఖ ఎక్స్‌ప్రెస్, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్, శబరి ఎక్స్‌ప్రెస్ వంటి రైళ్లలో టికెట్లు దొరకడం చాలా కష్టంగా మారింది. టికెట్లు దొరకని వారు తమ ప్రయాణ తేదీలను లేదా రైళ్లను మార్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

దసరా పండుగకు పాఠశాలలు, కళాశాలలకు సెలవులు వస్తాయి. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు తమ కుటుంబాలతో కలిసి సొంతూళ్లకు వెళ్లడానికి సిద్ధమవుతారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం గతంలో దక్షి ణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడిపింది. ఈసారి కూడా రద్దీని దృష్టిలో ఉంచుకొని మరిన్ని ప్రత్యేక రైళ్లను నడపాలని ప్రయాణికులు రైల్వే అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

### చర్లపల్లి నుంచే ట్రైన్లు..

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనుల కారణంగా పలు రైళ్లను చర్లపల్లి నుంచి నడిపిస్తున్నారు. అక్కడకు వెళ్లేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. టికెట్ ధర కంటే కూడా ఆటో, క్యాబ్ ఛార్జీలు అధికంగా ఉన్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇటువంటి వాటిని అరికట్టి.. అక్కడకు చేరుకోవడానికి మరిన్ని రవాణా సౌకర్యాలు కల్పించాలని అధికారులను కోరుతున్నారు. ఉచిత బస్సులే కానీ రద్దీ భయంతో ప్రయాణీకులు జంకుతున్నారు. రైలు టికెట్లు దొరకని ప్రయాణికులు బస్సులను ఆశ్రయిస్తారు. తెలంగాణలో మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉన్నందున, ఆర్టీసీ బస్సులలో కూడా రద్దీ విపరీతంగా పెరిగే అవకాశం ఉంది.



# తెలంగాణ అభివృద్ధిని ఆసక్తిగా గమనిస్తోన్న దేశం

## ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో సమావేశమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** తెలంగాణలో దేశంలో ఎక్కడలేని విధంగా అభివృద్ధి సంక్షేమపథకాలు అమలు చేస్తుండటంతో దేశం ఆసక్తిగా గమనిస్తోందని తెలంగాణ రోల్‌మాడల్ పాలన రేపు కేంద్రంలో అధికారంలోకి వచ్చాక దేశంలో కూడా రాహుల్‌గాంధీ నేతృత్వంలో అందిచనున్నారని ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే ప్రకటించారు. న్యూఢిల్లీలో గురువారం ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గేతో తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రుణమాఫీ, రైతుభరోసాతో ఎంతో సంతృప్తితో ఉన్నారని ఆయన ఆనందం వ్యక్తంచేశారు. తెలంగాణ కులగణనతో దేశంకు దిక్సూచిగా నిలిచిందని 42శాతం రిజర్వేషన్ బిసిలకు కల్పించడానికి పోరాటంలో తెలంగాణ ప్రజలు ముందుకు రావాలని కోరారు.

# బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది..

## అందరి లెక్కలు సరిచేస్తాం: కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు7:** రాబోయే రెండున్నరేళ్లలో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని... అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తామని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. రేవంత్ రెడ్డి పాలన విచిత్రంగా ఉందని... ఏం చేస్తున్నారో ఆయనకే అర్థం కావడం లేదని అన్నారు. యూరియా కోసం రైతులు కష్టపడాల్సి వస్తోందని చెప్పారు. రాష్ట్రంలో భూముల విలువలు పడిపోయాయని అన్నారు. బీఆర్ఎస్ పాలనా సమయంలో రేషన్‌కార్డులు ఇవ్వలేదని ఐఏఎస్ అధికారులు అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. ఐఏఎస్ అధికారులు రాజకీయాలు మాట్లాడటం సరికాదని అన్నారు. తెలంగాణ భవన్‌లో పరిగి నియోజకవర్గంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. రుణమాఫీ విషయంలో రేవంత్ ప్రభుత్వం విఫలమయిందని కేటీఆర్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత రైతుబంధును ప్రభుత్వం నిలిపివేస్తుందని చెప్పారు. కేసీఆర్ అంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని... అందుకే ఢిల్లీలో కూడా కేసీఆర్‌నే విమర్శిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన మంచి పనులను తమ పార్టీ కార్యకర్తలు ప్రజలకు చెప్పలేకపోయారని... అందుకే ఓడిపోయామని చెప్పారు. కేసీఆర్ ను మళ్లీ సీఎం చేసుకునేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# అధికారులు అప్రమత్తంగా ఉండి, ఫిర్యాదులకు స్పందించండి

## కమాండ్ కంట్రోల్ నుంచి సిఎస్ సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు7:** జీహెచ్ఎంసీ పరిధిలో కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో ఏవిధమైన ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. భారీ వర్షం నేపథ్యంలో చేపట్టాల్సిన చర్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఆదేశాలతో పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి సి.ఎస్. గురువారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వ హించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, సాయంత్రం నుండి ఆకస్మికంగా కురిసిన భారీ వర్షాల వల్ల అప్రమత్తంగా ఉండి ఎక్కడా ప్రాణ నష్టం లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నగరంలోని కొన్ని ప్రాంతాలలో 12 సె.మి. వరకు వర్ష పాతం రికార్డ్ అయిందని తెలియజేశారు. వర్షం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా, నీటి నిలిచే ప్రాంతాల (వాటర్ లాగింగ్ పాయింట్స్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సి.ఎస్ ఆదేశించారు. ముఖ్యంగా వాటర్ లాగింగ్ రిపోర్ట్ అవుతున్న ఐటీ కారిడార్, టివీ9, టైమ్స్ ఆఫ్ ఇండియా, రాజ్‌భవన్, షేక్ పేట్ ఏరియాలలో నీటి నిలువ సమస్య వస్తున్నందున తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాల వల్ల ప్రజలకు అసౌకర్యం కలగకుండా జీహెచ్ఎంసీ అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# సింగరేణి సిపిఆర్వో సుభానికి ఉత్తమ పిఆర్ మేనేజర్ పురస్కారం

**హైదరాబాద్, ఆగస్టు 3, ప్రభాతవార్త:** సింగరేణి కాలరీస్ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి, జీఎం(కో ఆర్డినేషన్) ఎస్.డి.ఎం సుభానికి జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రతి ష్టాత్మక డాక్టర్ సి. వి నరసింహారెడ్డి పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి ఉత్తమ పిఆర్ మేనేజర్ -2025 పురస్కారం అందుకున్నా రు. హైదరా బాద్‌లో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ హాల్ లో జరిగిన నేషనల్ పబ్లిక్ రిలేషన్స్ ఎడ్యుకేషన్ డే ఉత్సవంలో ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఘంటా చక్రపాణి ఈ అవార్డును సుభానికి ప్రదానం చేశారు. సింగరేణి సంస్థలోని 12 ఏరియాలలో ప్రజా సంబంధాలను పటిష్టంగా నిర్వహిస్తూ, సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ కార్మికులను చైతన్యపరచడంలో, సమాజంలో మంచి గుర్తింపు తీసుకురావడంలో సుభాని సీపీఆర్వో హోదాలో తమదైన పాత్రను పోషించారని ఈ సందర్భంగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిథమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వెంకట రమణ, పిఆర్ఎస్ఐ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అజిత్ పాఠక్, పిఆర్ఎస్ఐ హైదరాబాద్ ఛాప్టర్ అధ్యక్షులు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణలో కమీషన్ల పాలన

## బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్



**హైదరాబాద్, ఆగస్టు 7. ప్రభాతవార్త:** తెలంగాణలో కమీషన్ల పాలన కొనసాగుతుందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ అన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యం అంటే - ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల ద్వారా పాలన అని కానీ మన రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం.. ప్రజల కోసం కాకుండా, కమిషన్ల కోసం, కమిషన్ల చేత, కమిషన్ల పాలనలా వ్యవహరిస్తుందన్నారు. రేషన్ కార్డుల్లో పేర్లు చేర్చాలంటే కూడా కమిషన్ కావాలి. ఇందిరమ్మ ఇల్లు రావాలంటే కమిషన్ తప్పనిసరి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలంటే కూడా కమిషన్ చెల్లించాల్సిందేనని అన్నారు. కాంగ్రెస్ పాలన మొత్తం కమీషన్ల మయం అయిపోయిందని, ఇలాంటి విషయాలు రోజుకో ఉదాహరణగా సామాజిక మాధ్యమాల్లో, ప్రజా వేదికల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు.

# కనువిందైన కామెడీతో 'లిటిల్ హార్ట్స్'



"లిటిల్ హార్ట్స్" మూవీ చూస్తూ కుర్చీల్లోంచి కిందపడేంతలా నవ్వుకుంటారు "రాజా గాడికి" సాంగ్ లాంఛ్ లో ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్. సెప్టెంబర్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న సినిమా "90 మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ మోళితనుజ్, "అంబాజీపేట మ్యారేజి బ్యాండు" మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్ లో నటిస్తున్న మూవీ "లిటిల్ హార్ట్స్". ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్ పై దర్శకుడు సాయి మార్తాండ్ రూపొందించారు. "90s మిడిల్ క్లాస్ బయోపిక్" ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ "లిటిల్ హార్ట్స్.. మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమా కంటెంట్ నచ్చి నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి సెప్టెంబర్ 12న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నారు. ఈ రోజు ఈ చిత్రం నుంచి రాజా గాడికి సాంగ్ లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలోమ్యూజిక్ డైరెక్టర్ సింజిత్ యెర్రమల్లి మాట్లాడుతూ "లిటిల్ హార్ట్స్" సినిమాకు వేదికైన ఈటీవీ విన్ వారికి థ్యాంక్స్. అలాగే మా మూవీని థియేట్రికల్ రిలీజ్ కు వంశీ నందిపాటి, బన్నీ వాస్ తీసుకొస్తుండటం హ్యాపీగా ఉంది. ఆదిత్య హాసన్ అన్న మరో మంచి మూవీ ప్రొడ్యూస్ చేశారు. మోళి, నా ఫ్రెండ్, అతను హీరోగా నేను మ్యూజిక్ చేస్తానని అనుకోలేదు. శివానీ కూడా నాకు ఫ్రెండ్. మా అందరి కాంబోలో మూవీ రావడం సంతోషంగా ఉంది. అన్నారు. హీరోయిన్ శివానీ నాగరం మాట్లాడుతూ 'లిటిల్ హార్ట్స్" సినిమాకు సపోర్ట్ చేసేందుకు వచ్చిన మీ అందరికీ థ్యాంక్స్. నేను అంబాజీ పేట మ్యారేజి బ్యాండు మూవీ తర్వాత ఏడాది పాటు మంచి సబ్జెక్ట్ కోసం వెయిట్ చేశారు. నేను వెయిట్ చేసిన మంచి జోష్ ఉన్న క్యారెక్టర్ దొరికింది. ఈ సినిమాలో మోళితో కలిసి నటించడం హ్యాపీగా ఉంది. ఆదిత్య హాసన్‌కి 'లిటిల్ హార్ట్స్" మరో మంచి సక్సెస్ ఫుల్ మూవీ అవుతుంది. మా మూవీని థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నందుకు వంశీ గారికి, బన్నీ వాస్‌కి థ్యాంక్స్. ఈ పాటను మీరు బాగా ఎంజాయ్ చేస్తారు. అన్నారు.డైరెక్టర్ సాయి మార్తండ్ మాట్లాడుతూ 'లిటిల్ హార్ట్స్" కథను ఫస్ట్ మోళి నమ్మాడు. మోళి మీద నమ్మకంతో ఆదిత్య హాసన్ గారు నమ్మారు. అలా ఈ ప్రాజెక్ట్ కు దర్శకుడిగా మారాను. ఈ చిత్రానికి పనిచేసే అవకాశం ఇచ్చిన ఈటీవీ విన్ వారికి థ్యాంక్స్ చెబుతున్నా. మా మూవీని వంశీ, బన్నీ వాస్ గారు థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తుండటం సంతోషంగా ఉంది. అన్నారు.హీరో మోళి తనూజ్ మాట్లాడుతూ ""లిటిల్ హార్ట్స్" చాలా ఎంటర్ టైనింగ్ గా ఎగ్జైటింగ్ గా ఉండే మూవీ. ఈ చిత్రాన్ని థియేటర్స్ లోకి తీసుకొస్తున్నందుకు వంశీ, బన్నీ వాస్ గారికి థ్యాంక్స్. వాళ్లు సినిమా తీసుకోవడమే కాదు మూవీలో ఏమేం నచ్చాయో మమ్మల్ని పిలిచి మరీ చెప్పారు. అంత ప్యాషన్ ఉంది కాబట్టే సక్సెస్ ఫుల్ మూవీస్ చేయగలుగుతున్నారు అనిపించింది. ఈటీవీ విన్ నుంచి సాయి కృష్ణ, నితిన్ గారు చాలా సపోర్ట్ చేశారు. మా ఆదిత్య హాసన్ కు ప్రొడ్యూసర్ గా మంచి పేరు తెచ్చే చిత్రమవుతుంది. ఈ మూవీ కోసం సాయి మార్తండ్ తో పాటు మేమంతా ఎగ్జైటింగ్ కంటెంట్ తీసుకురావాలని బాగా ప్రయత్నించాం. శివానీ తో కలిసి నటించడం వల్ల నా కాన్ఫిడెంట్ పెరిగింది. నా ఫ్రెండ్ సింజిత్ మంచి మ్యూజిక్ ఇచ్చాడు. రాజా గాడికి సాంగ్ మీకు బాగా నచ్చుతుంది. అన్నారు. ప్రొడ్యూసర్ ఆదిత్య హాసన్ మాట్లాడుతూ ఈ వేదిక మీద అందరినీ చూస్తుంటే "90 మిడిల్ క్లాస్ బయోపిక్ష్ గుర్తుస్తోంది. ఇలాంటి మంచి స్క్రిప్ట్ సెలెక్ట్ చేసుకున్న మోళి తనూజ్ ను అప్రిషియేట్ చేయాలి. నేను ఏదైనా చెప్పాలనుకున్నా వద్దనుకునేంత బాగా మా డైరెక్టర్ సాయి మార్తండ్ స్క్రిప్ట్ రాశాడు. తను ఫ్యామిలీ ఎంటర్ టైనర్స్ చేయడంలో మంచి పేరు తెచ్చుకుంటాడని చెప్పగలను. ఫుటేజ్ చూస్తున్నప్పుడు ప్రొడ్యూసర్ గా చాలా సంతృప్తి పడ్డాను. నేనొక దర్శకుడిగా చేసే సినిమా కంటెంట్ కూడా నా ప్రొడ్యూసర్ ను అలా సంతృప్తి పరచాలనిఅనిపించింది. ఈ చిత్ర ట్యాగ్ లైన్ లాగే హార్ట్ టచింగ్ గా ఉంటుంది. ఫస్ట్ సీన్ నుంచి లాస్ట్ దాకా మీరు కథతో రిలేట్ అవుతారు. 2 గంటలు ఫుల్ ఎంటర్ టైన్ అవుతారు.

## 'వైల్డ్ అవతార్‌లో' అనుష్కశెట్టి

**అనుష్కశెట్టి,** విక్రమ్ ప్రభు, క్రిష్ జాగర్లమూడి, యువి క్రియేషన్స్ ప్రెజెంట్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ పాన్ ఇండియా ఫిల్మ్ ఘాటీ అనుష్క శెట్టి నెవర్ బిఫోర్ వైల్డ్ అవతార్‌లో గ్రిప్పింగ్ ట్రైలర్ రిలీజ్, సినిమా సెప్టెంబర్ 5న థియేటర్లలో రిలీజ్ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ డ్రామా ఘాటీ సెప్టెంబర్ 5న థియేటర్లలో విడుదలకు కానున్నట్లు మేకర్స్ అఫీషియల్ గా అనౌన్స్ చేశారు. గ్రిప్పింగ్ థియేట్రికల్ ట్రైలర్ ద్వారా రిలీజ్ డేట్ ని రివిల్ చేశారు. ఈ చిత్రంలో క్వీన్ అనుష్క శెట్టి లీడ్ రోల్ నటిస్తుండగా, విక్రమ్ ప్రభు మేల్ లీడ్ గా కనిపించనున్నారు. క్రియేటివ్ డైరెక్టర్ క్రిష్ జాగర్లముడి దర్శకత్వం వహిస్తున్నారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లముడి ఈ చిత్రాన్ని భారీగా నిర్మిస్తున్నారు. యువి క్రియేషన్స్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. బ్రిటిష్ రాజ్ కాలంలో ప్రమాదకరమైన కనుమలలో చారిత్రాత్మకంగా రోడ్లు నిర్మించిన ఘాటీ సమాజ ప్రపంచాన్ని పరిచయం చేసే పవర్ ఫుల్ వాయిస్‌ఓవర్‌తో ట్రైలర్ ప్రారంభమవుతుంది. ఇప్పుడు, వారు కొండల్లో డ్రగ్స్ మోసే పనుల్లో చిక్కుకుపోయారు. ఈ కఠినమైన పరిస్థితులు చిక్కుకున్న ప్రేమికుల జంటగా అనుష్క శెట్టి, విక్రమ్ ప్రభు కనిపించారు. అనుష్క పాత్ర అవినీతి వ్యవస్థకు వ్యతిరేకంగాపోరాడుతుంది. తప్పు చేస్తున్నామనే గ్రహించి, ఈ చెడు వ్యవస్థకి ఎదురు నిలవడానికి రెడీ అవుతుంది. తన వాళ్లని ఈ ప్రమాదకర వ్యాపారం నుంచి బయటకు లాగడానికి ప్రయత్నిస్తుంది.ట్రైలర్‌లో అనుష్కను మునుపెప్పుడూ చూడని వైల్డ్ అవతార్ లో కనిపించారు.



ఒక బలహీన మహిళ నుంచి క్రిమినల్, అక్కడి నుంచి లెజెండ్‌గా మారే ఆమె పాత్ర ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. ఆమె అద్భుతమైన పర్ఫార్మెన్స్‌తో పాత్రకి ప్రాణం పోస్తుంది. విక్రమ్ ప్రభు పర్ఫార్మెన్స్ స్ట్రాంగ్ గా వుంది .

## 'అర్జున్‌చక్రవర్తి'నుండి లవ్‌సాంగ్

**విజయ రామరాజు,** విక్రాంత్ రుద్ర, శ్రీని గుబ్బల స్పోర్ట్స్ డ్రామా.. 'అర్జున్ చక్రవర్తి నుంచి బ్యూటీఫుల్ లవ్ సాంగ్ మేఘం వర్షించదా రిలీజ్ విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాని నిర్మాత శ్రీని గుబ్బల నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమాకు 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్ వచ్చాయి. ఇటివలే రిలీజైన టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. టీజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో 16 మిలియన్ల వ్యూస్ తెచ్చుకుంది. యూట్యూబ్ లో 1.5 మిలియన్ల వ్యూస్ దాటింది. ఇప్పుడు మేకర్స్ ఫస్ట్ సింగిల్ మేఘం వర్షించదా రిలీజ్ చేసి 'అర్జున్ చక్రవర్తి మ్యూజికల్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. విఘ్నేష్ బాస్కరన్ బ్యూటీఫుల్ లవ్ సాంగ్‌గా కంపోజ్ చేశారు. విక్రాంత్ రుద్ర రాసిన లిరిక్స్ మనసుని హత్తుకునేలా వుంది. కపిల్ కపిలన్, మీరా ప్రకాష్, సుజిత్ శ్రీధర్ తమ మ్యాజికల్ వాయిస్‌తో కట్టిపడేశారు. ఈ సాంగ్‌లో విజయరామరాజు, సిజా రోజ్ కెమిస్ట్రీ లవ్లీగా వుంది. అద్భుతమైన స్పోర్ట్స్ డ్రామాతో పాటు హార్ట్ టచ్చింగ్ లవ్‌స్టొరీతో అర్జున్ చక్రవర్తి అలరించబోతుందని ఈ సాంగ్ ప్రామిస్ చేస్తోంది. ఈ చిత్రంలో హర్ష్‌రోషన్, అజయ్, అజయ్‌ఘోష్, దయానంద్ రెడ్డి కీలక పాత్రలు పోషిస్తున్నారు,ఈ చిత్రానికి జగదీష్ చీకాటి డీవోపీ, ప్రదీప్‌నందన్ ఎడిటర్, సుమిత్ పటేల్,ప్రొడక్షన్ డిజైనర్. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. నటీనటులు: విజయ రామరాజు, సిజా రోజ్, హర్ష్‌రోషన్, అజయ్, అజయ్ ఘోష్, దయానంద్ రెడ్డి, దుర్గేష్,సిబ్బంది వివరాలు:రచన దర్శకత్వం: విక్రాంత్ రుద్రనిర్మాత: శ్రీని గుబ్బల,సహ నిర్మాత: ఈడే కృష్ణ చైతన్యసంగీతం: విఘ్నేష్ బాస్కరన్ సినిమాటోగ్రఫీ: జగదీష్ చీకాటిఎడిటర్: ప్రదీప్‌నందన్ప్రొడక్షన్ డిజైనర్: సుమిత్ పటేల్ ఆడియోగ్రఫీ: అరవింద్



## 'వందే మాతరం'సాంగ్ విడుదల

**తెలుగు** హిందీ భాషల్లో రిలీజ్ కానున్న హ్యాపీ జర్నీ ఫ్యూచర్ బ్రైట్ ఫిలిమ్స్ పతాకంపై హరిప్రసాద్ కోనే, ఇషాని గోష్ హీరో హీరోయిన్లుగా చైతన్య కొండా దర్శకత్వంలో గంగాధర్ పెద్ద కొండ నిర్మించిన ఎమోషనల్ ఎంటర్టైనర్ . హ్యాపీ జర్నీ ప్రస్తుతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం పోస్ట్ కోసం కార్యక్రమాలు జరుపుకుంటుంది. కాగా ఈ చిత్రంలోని "వందేమాతరం సాంగ్ ని చిత్ర యూనిట్ ఇటీవల విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత గంగాధర్ పెద్ద కొండ



మాట్లాడుతూ ఈ చిత్రాన్ని తెలుగు హిందీ భాషల్లో నిర్మిస్తున్నాము. దేశభక్తి నేపథ్యంలో సాగే వెరైటీ కథ ఇది. ఈ చిత్రంలోని వందేమాతరం పాటను ప్రేక్షకుల ఆదరణ చూస్తుంటే ఆనందంగా ఉంది. ఓ మంచి చ్నిత్రతో ప్రేక్షకులు ముందుకు రానున్నాం. తెలుగు ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నాము. అని అన్నారు. అలాగే డైరెక్టర్ చైతన్య కొండ మాట్లాడుతూ,ఇలాంటి సినిమాలు ఎప్పుడో ఒకసారి వస్తుంటాయి నా చిన్నప్పుడు మేజర్ చంద్రకాంత్ సినిమా చూశానునేను ఇండస్ట్రీకి వచ్చాక ఖడ్గం సినిమా చూశాను అంత బలమైన ఎమోషన్స్ తో ఈ సినిమా చేశాను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారని కోరుకుంటున్నాను అని అన్నారు

హరి ప్రసాద్ కోనే, ఇషాని గోష్, దువ్వాసి మోహన్, వి6 సత్య, సంజయ్ రాయచూర, ఆనంద్ భారతి తదితరులు నటించిన ఈ చిత్రానికి నిర్మాత: గంగాధర్ పెద్ద కొండ డైరెక్టర్: చైతన్య కొండ మ్యూజిక్ :చైతన్య రాజ్డిఓపి: యు. అరుణ్ కుమార్ ఎడిటర్: కొండవీటి రావి కుమార్ ఆర్ డైరెక్టర్: వాసుపి ఆర్ ఓ; బి. వీరబాబు .

## 'సు ఫ్రం సో' ఈవెంట్‌లో నవీన్ యెర్నేని

**మైత్రీ మూవీ మేకర్స్** ప్రొడ్యూసర్ నవీన్ యెర్నేని 'సు ఫ్రం స్లో కన్నడలో బిగ్ బ్లాక్‌బస్టర్. తెలుగు ఆడియన్స్ సినిమాను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తారన్న నమ్మకం ఉంది: ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూసర్ నవీన్ యెర్నేనిలేటెస్ట్ కన్నడ బ్లాక్ బస్టర్ 'సు ఫ్రం స్లో ఇప్పుడు తెలుగు ప్రేక్షకులని అలరించడానికి రెడీ అయ్యింది. మంచి కంటెంట్ కి మద్దతుగా నిలిచ మైత్రీ మూవీ మేకర్స్ ఈ రూరల్ కామెడీ హారర్ సినిమాని ఆగస్ట్ 8న రెండు తెలుగు రాష్ట్రాల్లో గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు.ప్రీరిలీజ్ ఈవెంట్ లో ప్రొడ్యూసర్ రాజ్ బి శెట్టి మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. మైత్రి మూవీ మేకర్స్ కి ధన్యవాదాలు. మేము ఇండీ ఫిలిం మేకర్స్. మంచి కంటెంట్ తీస్తే మైత్రి మూవీ మేకర్స్ లాంటి పెద్ద వ్యక్తులు సపోర్ట్ చేస్తారని నమ్మకం కలిగింది. ఇంత మంచి కంటెంట్ ని ఆదరిస్తున్న మైత్రి శశిగకి, నవీన్‌కి థాంక్యూ సో మచ్. వారు లేకపోతే మేము ఇక్కడ ఉండే వాళ్ళం కాదు. ఈ సినిమా చాలా మంచి ఎంటర్టైనర్. ఈ సినిమా కన్నడలో అద్భుతాలు సృష్టించింది. తెలుగు ప్రేక్షకులు ఈ సినిమాని ఎప్పుడు చూస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నాను. మంచి సినిమా వస్తే తెలుగు ఆడియన్స్ ఎప్పుడూ కూడా గొప్పగా ఆదరిస్తారు. గరుడగమన రిలీజ్ అయినప్పుడు తెలుగు ప్రేక్షకుల నుంచి వచ్చిన అద్భుతమైన ఆదరణ మర్చిపోలేను. మంచి సినిమాకి తెలుగు ప్రేక్షకులు తప్పకుండా సపోర్ట్ చేస్తారని నమ్మకంతో ఈ సినిమాని మీ ముందుకు తీసుకొస్తున్నాం. మీ అందరి ప్రేమకు ధన్యవాదాలు. ఈ సినిమా మిమ్మల్ని గొప్పగా అలరిస్తుంది అన్నారు.నటుడు షనీల్ గౌతమ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమా కన్నడలో పెద్ద బ్లాక్ బస్టర్ అయింది. తెలుగులో కూడా మంచి బ్లాక్ బస్టర్ అవుతుందని నమ్ముతున్నాము. ఈ సినిమాకి గొప్పగా సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నాము. తప్పకుండా అందరూ ఈ సినిమాని థియేటర్లో చూడాలని కోరుకుంటున్నాను అన్నారు.దర్శకుడు జేపీ తుమినాడ్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. మీ అందరిని ఈ వేడుకలో కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది.



ఈ సినిమా కన్నడలో చాలా అద్భుతమైన విజయం సాధించింది. ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. తెలుగులో కూడా సినిమా మంచి విజయాన్ని సాధిస్తుందని ఆశిస్తున్నాము. మాకు ఈ అవకాశం ఇచ్చిన మైత్రి మూవీ మేకర్స్‌కి ధన్యవాదాలు. తప్పకుండా ఈ సినిమాని థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను అన్నారు. నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ, అందరికి నమస్కారం.'సు ఫ్రమ్ స్లో కన్నడలో బిగ్ బ్లాక్ బస్టర్ అయింది. తెలుగు ఆడియన్స్ ఈ సినిమాని నెక్స్ట్ లెవెల్ కి తీసుకువెళ్తారనే నమ్మకం వుంది. సినిమా తప్పకుండా ఆడియన్స్ ని ఎక్స్ట్రార్డినరీగా ఎంటర్టైన్ చేస్తుంది. టీమ్ అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్ అన్నారు. మైత్రి డిస్ట్రిబ్యూటర్ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ, అందరికీ నమస్కారం.

ఈ సినిమాని రీమేక్ చేయాలనే ఆలోచనలు కూడా వచ్చాయి. అయితే ఒరిజినల్ తెలుగులోకి వస్తేనే బావుంటుందని మేము సుప్రీత్ తో చెప్పడం జరిగింది. ఈ సినిమాని చూసి చాలా ఎంజాయ్ చేస్తారు.

## గుర్రంపాపిరెడ్డి టీజర్ లాంచ్

**సరికొత్త** డార్క్ కామెడీ థ్రిల్లర్ మూవీగా "గుర్రం పాపిరెడ్డి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది టీజర్ లాంఛ్ ఈవెంట్ లో హాస్యబ్రహ్మా బ్రహ్మానందం నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా నటిస్తున్న సినిమా "గుర్రం పాపిరెడ్డి. ఈ చిత్రాన్ని డా. సంధ్య గోలీ సమర్పణలో ప్రొడ్యూసర్స్ వేణు సద్ది, అమర్ బురా, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డార్క్ కామెడీ కథతో ఇప్పటి వరకు మనం తెరపై చూడని కాన్సెప్ట్‌తో దర్శకుడు మురళీ మనోహర్ రూపొందిస్తున్నారు. త్వరలో "గుర్రం పాపిరెడ్డి సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ రోజు "గుర్రం పాపిరెడ్డి సినిమా టీజర్ ను హైదరాబాద్ లో గ్రాండ్ గా లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలో హాస్యబ్రహ్మా బ్రహ్మానందం, సౌత్ ఇండియన్ కామెడీ సూపర్ స్టార్ యోగిబాబుతో పాటు మూవీ టీమ్ మెంబర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ జయకాంత్ మాట్లాడుతూ, ఈ రోజు మా "గుర్రం పాపిరెడ్డి సినిమా టీజర్ లాంఛ్ కు వచ్చిన అందరికీ థ్యాంక్స్. తెలుగులో వస్తున్న డిఫెరెంట్ డార్క్ కామెడీ చిత్రమని అన్నారు. మ్రూవీ ప్రెజెంటర్ డా.సంధ్య గోలీ మాట్లాడుతూ ఒక కొత్త తరహా పాయింట్ తో "గుర్రం పాపిరెడ్డి" సినిమాను నిర్మించాం. యూనిక్ డార్క్ కామెడీ మూవీగా మిమ్మల్ని ఆకట్టుకుంటుంది. ఈ టీమ్ తో ట్రావెల్ చేయడం చాలా హ్యాపీగా అనిపించింది. బ్రహ్మానందం, యోగిబాబు వంటి లెజెండ్స్ తో వర్క్ చేశాం. "గుర్రం పాపిరెడ్డి సినిమాను మీరంతా థియేటర్స్ లో ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నా. అన్నారు.

హాస్యబ్రహ్మా బ్రహ్మానందం మాట్లాడుతూ "గుర్రం పాపిరెడ్డి సినిమా నాకొక స్పెషల్ మూవీ అని చెప్పగలను. ఎందుకంటే యంగ్ స్టర్స్ అంతా కలిసి ఈ సినిమాను రూపొందించారు. ఈ చిత్రంలో జడ్జి పాత్రలో నటించాను. దర్శకుడు మురళీ మనోహర్ సినిమా అంటే ప్యాషన్ ఉన్నవాడు. నన్ను ఈ మూవీలో డిఫరెంట్ గా చూపించాడు.. మంచి కామెడీతో సాగే థ్రిల్లర్ మూవీ ఇది. హీరో నరేష్, హీరోయిన్ ఫరియా సహా "గుర్రం పాపిరెడ్డి సినిమా టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. అన్నారు.



## రీ ర్యాంప్ నుంచి ఫస్ట్ సింగిల్

**దీపావళి** పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు వస్తున్న మూవీ

సక్సెస్ ఫుల్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా రీర్యాంప్ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్‌ల మీద సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రాజేష్ దండ, శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తోంది. " రీ ర్యాంప్ష్ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీ దీపావళి పండుగ సందర్భంగా అక్టోబర్ 18న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది.ఈ రోజు "రీర్యాంప్ష్ సినిమా



నుంచి ఫస్ట్ సింగిల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్.

ఈ నెల 9వ తేదీన ..ఓనమ్.. లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ పాట కోసం ఎనర్జిటిక్ ట్యూన్ కంపోజ్ చేశారు మ్యూజిక్ డైరెక్టర్ చేతన్ భరద్వాజ్. కేరళ పండుగ ఓనమ్ నేపథ్యంగా సాగే ఈ పాటను మలయాళ ట్రెడిషన్ చూపించేలా కలర్ ఫుల్‌గా రూపొందించారు.

నటీనటులు కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా, నరేష్,సాయి కుమార్,వెన్నెల కిషోర్ తదితరులు.

టెక్నికల్ టీమ్ఊ: మ్యూజిక్ : చేతన్ భరద్వాజ్ పీఆర్ ఓ :జీఎస్ కే మీడియా(సురేష్ శ్రీనివాస్), వంశీ శేఖర్ కోప్రొడ్యూసర్బాలాజీ గుట్ట, ప్రొడ్యూసర్ , రాజేష్ దండా,శివ బొమ్మకు, రచన, దర్శకత్వం:జైన్స్ నాని .. ప్రొడక్షన్ డిజైనర్ :బ్రహ్మకడలి , యాక్షన్ : పృథ్వీ , ఎడిటర్ : ఛోటా కె ప్రసాద్ , డీవోపీ: సతీష్ రెడ్డి మాసం,

## కడుపుబ్బ నవ్వించే 'కిష్కింధపురి'

'కిష్కింధపుర్రి మంచి హారర్ మిస్టరీ. చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరికీ నచ్చే సినిమా: సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్, కౌశిక్ పెగల్లపాటి, సాహు గారపాటి, షైన్ స్క్రీన్స్ కిష్కిందపురి నుండి వైబ్రెంట్ బీట్స్ లవ్ మెలోడీ, ఫస్ట్ సింగిల్ ఉండిపోవే నాతోనే సాంగ్ లాంచ్‌యాక్షన్ హల్క్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ప్రస్తుతం కిష్కిందపురి లో నటిస్తున్నారు. షైన్ స్క్రీన్స్ బ్యానర్ పై డైనమిక్ ప్రొడ్యూసర్ సాహు గారపాటి నిర్మించి చిత్రానికి కౌశిక్ పెగల్లపాటి రచన దర్శకత్వం వహించారు. అర్చన ప్రజెంట్ చేస్తున్నారు. ఈ గ్రిప్పింగ్ హర్రర్‌మిస్టరీ థ్రిల్లర్‌లో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించింది. చిల్లింగ్ ఫస్ట్ గ్లింప్స్‌తో బజ్ క్రియేట్ చేసిన తర్వాత ఇప్పుడు మేకర్స్ ఫస్ట్ సింగిల్ ఉండిపోవే నాతోనే లాంచ్ చేశారు.ఈరోజు లాంచ్ చేసిన ఈ పాట మ్యూజిక్ ప్రమోషన్ కి శ్రీకారం చుట్టి ఆడియన్స్ లో మంచి ఇంపాక్ట్ క్రియేట్ చేసింది. చైతన్ భరద్వాజ్ స్వరపరిచిన ఈ అందమైన పాటలో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, అనుపమ పరమేశ్వరన్ అద్భుతమైన కెమిస్ట్రీతో ఆకట్టుకున్నారు. వైబ్రెంట్ బీట్స్ తో ఈ పాట కట్టిపడేసింది. టీజర్‌లో ప్రేక్షకులను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్ళిన దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి, ఈ సాంగ్ తో ఒక రొమాంటిక్ టచ్ ఇచ్చాడు. రాజు సుందరం కొరియోగ్రఫీ సాంగ్ వైబ్‌ను మరింతగా పెంచింది.సాంగ్ లాంచ్ ఈవెంట్ లో హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ..అందరికీ హాయ్. మీరందరూ ఇక్కడికి విచ్చేసినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇక్కడ మీ సమక్షంలో సాంగ్ ని లాంచ్ చేయడం చాలా హ్యాపీగా ఉంది. చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకు అందరికీ నచ్చే సినిమా ఇది. మంచి హారర్ మిస్టరీ. మీరందరు సినిమా చూసి మా టీమ్ అందరిని బ్లెస్ చేయాలని కోరుకుంటున్నాను. అందరికీ థాంక్యుఅన్నారుఇందులో చాలా స్పెషల్ మూమెంట్స్ ఉంటాయి అన్నారు,దర్శకుడు కౌశిక్ పెగల్లపాటి మాట్లాడుతూ, అందరికీ గుడ్ ఈవెనింగ్. నేను చదువుకున్న కాలేజీలో ఈ సాంగ్ ని ఆన్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇక్కడికి వచ్చిన అందరికీ థాంక్యూ సో మచ్. త్వరలోనే సినిమా రిలీజ్ అవుతుంది. తప్పకుండా మీరందరూ ఎంజాయ్ చేస్తారు.



# బాధ్యతలు చేతులు మారాలంటే !

**ఫార్మా, బ్యాంకింగ్ తదితర రంగాల్లో మహిళా టెక్ పెరుగుతోంది. గతంతో పోల్చుకుంటే కంపెనీలూ మహిళలకు ఉన్నత బాధ్యతలు అందజేయాలనుకుంటున్నాయి. మనల్ని నమ్ముతున్నారు. మరి బాధ్యతలు చేతులు మారాలంటే మనం కొన్ని నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలి. అవేటంటే**

✦ హార్వర్డ్ యూనివర్సిటీ చేసిన అధ్యయనం ప్రకారం... అన్ని శక్తి, సామార్థ్యాలు ఉన్న మహిళలు కూడా చిన్న గ్రూపుల్లో మాట్లాడటానికే ఇష్టపడుతున్నారు. పెద్ద వేదికల మీద తమ అభిప్రాయాలను చెప్పాల్సి వచ్చినప్పుడు వెనకపడుతున్నారట. స్టేజ్ ఫియర్, పబ్లిక్ స్పీకింగ్ నైపుణ్యాలు లేకపోవడమే ఇందుకు కారణం. మీరూ ఇందులో వెనకంజలో ఉన్నారేమో చూసుకోండి. వీటిని దూరం చేయండి. విషయ పరిజ్ఞానాన్ని పెంచుకుంటే ఇది సాధ్యమవుతుంది. వారాంతంలో పెట్టే చర్చల్లో మీ అభిప్రాయాలు చెప్పడం, భిన్నంగా ఆలోచించడం. వంటివన్నీ నైపుణ్యాలను పెంచేవే.



చిన్న పార్టీలూ, ఇంట్లో జరిగే విందుల్లో లీడ్ తీసుకుని మాట్లాడటం అలవాటు చేసుకోండి. ఇవేవీ ఒక్కసారిగా రావు... మాట్లాడుతూ ఉంటే క్రమంగా భయాలన్నీ దూరమవుతున్నాయి.

✦ మేనేజ్‌మెంట్ స్థానాల్లో ఉన్న కొంతమంది డిజిటల్ లిటరసీలో వెనకబడుతున్నారు. పర్యవసానంగా ఉన్నత హోదాలను దక్కించుకోలేకపోతున్నారు. అందుకే డిజిటల్ నైపుణ్యాలను అందిపుచ్చుకోండి. అప్‌గ్రేడ్‌గా ఉండండి. సమయం లేదనో... ఇప్పటికి అవసరం లేదని చాలామంది దృష్టి పెట్టారు. కొందరైతే మూస శిక్షణ ప్రపంచంగా పని చేస్తారు. ఈ ధోరణే మన వెనకబాటుకు కారణమయ్యేది. అందుకే కొత్తవి నేర్చుకోవడానికి సంశయించకండి.

✦ వ్యక్తిగత పెట్టుబడి, బడ్జెట్ ప్లానింగ్, బిజినెస్ ఫైనాన్స్ వంటి విషయాల్లో అవగాహన పెంచుకోవాలి. అందరూ మగవాళ్లు చూసుకుంటారు. మనకి అవసరం లేదు అనుకుంటారు. కొంతమంది. కానీ వీటి గురించి తెలుసుకుంటే, సంస్థాగత విషయాలకు సంబంధించిన వాటిపైనా అవగాహన వస్తుంది. అవకాశం వచ్చినప్పుడు ఇవి ఉపయోగపడతాయి.

✦. కుటుంబం, సమాజం ఒత్తిళ్ల వల్ల మహిళలు తమపై తామే నమ్మకం కోల్పోతారు. నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం చేస్తారు. ముఖ్యంగా కొత్త బాధ్యతలు తీసుకోవడానికి పరిపరి విధాలుగా ఆలోచిస్తారు. మంచి అవకాశాలను చేజార్చుకుంటారు. భవిష్యత్తు కోసం ఆలోచించడం మంచిదే... కానీ అప్పుడు ఏదో జరుగుతుందని, ప్రస్తుత అవకాశాలను వదులుకోవడం ఎంతవరకూ సమంజసం. సమయస్ఫూర్తి, సవాళ్లను స్వీకరించే గుణాలే నలుగురిలో మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెట్టేవి.

✦. బృందంలో మంచి సంబంధాలు కొనసాగించడం. ప్రతి ఒక్కరి శక్తిసామర్థ్యాలు తెలుసుకుంటే మీ నేతృత్వానికి బలమైన పునాది పడుతుంది.

✦ జీతం, పనివేళలు లాంటి విషయాల్లో ప్రశ్నించకుండా ఉండటం కూడా మీ బలహీనతలకు ప్రతిరూపమే. అందుకే వీటి గురించి తరచుగా తెలుసుకుంటూ ఉండండి. అప్పుడే ఈ వెనకబాటు తగ్గుతుంది. మీరనుకున్న స్థానాలకూ చేరుకోగలరు. ❑

# వరలక్ష్మి వ్రత వైభవం

**దివ్య తేజోవంతమైన కాంతి కిరణాలతో భూమిని పరిపాలిస్తున్న శ్రీమహావిష్ణువు యొక్క అర్థాంగి అవనిపై అడుగడుగునా దర్శనమిచ్చే ఆమె మరో రూపం మనం చలామణిలో నిత్యం మన అవసరాలు తీర్చుకుంటున్న ధనం. ఆ ధనలక్ష్మిని ప్రత్యేక విధానంలో సేవించుకునే పర్వదినం శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం.**

శ్రావణమాసం పూర్తి విష్ణు సంబంధ మాసం. కలియుగంలో వెలిసిన తిరుమలేశుని జన్మ నక్షత్రమైన శ్రవణం అనుసరించి వచ్చిన మాసం శ్రావణమాసం. ఈ మాసంలోనే ద్వారకానాథుని జన్మతిథి మొదలగు ప్రత్యేక విశేషాంశాలు కలిసిన మాసం మరియు సాక్షాత్తు లక్ష్మీదేవికి ప్రీతికరమైన మాసం. గౌరీ సంబంధ వ్రతములు చేపట్టి నిత్య సుమంగళిగా జీవితాన్ని ప్రసాదించమని ఆ పార్వతీదేవిని అభ్యర్థించే ఈ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చు శుక్రవారం సముద్రరాజు కుమార్తె, శ్రీరంగుని అర్థాంగిగా విష్ణువు వనసులో ప్రతిష్ఠింపబడిన లక్ష్మీదేవిని వరలక్ష్మిగా సమస్త దేవతలు, మానవులు కొలుచుకుందురు.





ఈ వ్రతమును సంకల్పించుకునేవారు ముందురోజు ఇల్లూ, వాకిలీ శుభ్రం చేసుకొని, గడపలకు పసుపు కుంకుమలు అద్ది, గుమ్మానికి మామిడి తోరణాలు కట్టి సిద్ధం చేసుకోవాలి. సూర్యోదయానికి ముందే మహాలక్ష్మీ ప్రతీ ఇంటికి తిరుగుతూ,. ఏ ఇంటి ముంగిట అలికి, ముగ్గులతో అలంకరించి వుంటుందో, ఆ ఇంటిలోనికి ప్రవేశిస్తుందని విష్ణుపురాణంలో చెప్పినట్లు తెలుస్తోంది. అంతులేని ఐశ్వర్యానికి, సిరిసంపదలకు, పుత్ర పౌత్రాభివృద్ధికి, కీర్తి ప్రతిష్టలకు విద్యావ్యాపారాభివృద్ధికి తోట్పాటు నందించే మహత్తర వ్రతము వరలక్ష్మీ వ్రతము. భూలోకంలో ప్రతీ హైందవ స్త్రీ తప్పక ఆచరించదగినది. అమ్మ ఆశీస్సులు అందుకొను అవకాశం కలిగినది. శ్రావణ శుక్రవారము వ్రతము. అయితే విధి విధానాలు పాటిస్తూ ఈ శ్రావణమాస శుక్రవారాలు మహాలక్ష్మిని భక్తిశ్రద్ధలతో పూజిస్తూ ప్రత్యేకించి పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారము జరుపుకునే వరలక్ష్మీ వ్రతము అత్యంత ఫలదాయకమైనది. ఈ వ్రతమును ఆచరించు స్త్రీలు సూర్యోదయానికి పూర్వమే నిద్రలేచి తలకు నువ్వులనూనె రాసుకొని ముఖమునకు, కాళ్లకు మంగళ సూత్రములకు పసుపు రాసుకొని స్నానాధికాలు ముగించుకొని, పరిశుభ్రమైన వస్త్రము ధరించి పూజ ప్రారంభం చేయాలి. ఈ పూజ చేయు మహిళలు వ్రతము పూర్తియగువరకు నిరాహారముగా నుండి పూజ జరుపవలెను. చక్కటి కలశను ఏర్పాటు చేసుకోవలెను.

ఒక కొబ్బరి కాయను ఎంచుకొని, పసుపురాసి, కుంకుమతో అలంకరించి, రాగి, వెండి, ఇత్తడి, బంగారంతో చేసిన ఏదో ఒక పాత్రను తీసుకుని పవిత్రమైన నీటితో కాని, బియ్యంతోకాని నింపి, దానికి సిద్ధం చేసుకున్న కొబ్బరికాయను అమర్చి, ఆ కొబ్బరిపై క్రొత్త వస్త్రం చుట్టవలెను, కలశమునకు చీర కట్టే అలవాటు ఉన్నట్లయితే, కొంచెం పెద్ద కలశ తీసుకుని, దానిని అలంకరించుకోవచ్చును. మనం గుర్తుంచుకోవలసినది భక్తి ప్రదానము. పూజలకు సిద్ధం చేసుకొన్న స్థలంలో వరలక్ష్మిని నిలిపి, యధావిదిని ఆరోజువున్న మంచి సమయంలో పూజ చేయాలి. శక్తిని అనుసరించి అష్టోత్తరంతో కాని, సహస్రంతో గాని పూజ చేసుకొనవచ్చును. పోషశ పూజ మాత్రం విధిపూర్వకంగా చేయాలి. లభ్యతను అనుసరించి తొమ్మిది రంగుల పువ్వులు, నవధాన్యాలు ఉపయోగించటం శ్రేష్టము. పూజలో నవ తోరం గ్రంధి పూజ చేయాలి. ఇందులో 9 ముడులు ప్రధానము ఏదైనా ఒక రకం పువ్వులను ఉపయోగించవచ్చును లేదా తొమ్మిది రకములు పుష్పములతో చేసుకొనవచ్చును. తోరగ్రంధికి ప్రత్యేక మంత్రముతో అర్చించి ధరించవలెను. వ్రతఫలము సంపూర్ణముగా లభించుటకు, ఆ వరలక్ష్మి అనుగ్రహం సిద్దించుటకు మూడు తోరములను తయారుచేసుకొని, సాక్షాత్తు అమ్మవారిగా భావించే పుణ్యస్త్రీకి ఒకటి, వరలక్ష్మికి ఒకటి, తాను ఒకటి ధరించవలెను. తోరం ధరించేటప్పుడు పఠించవలసిన మంత్రము

**బధ్నామి దక్షిణ హస్తే నవసూత్రం శుభప్రదం పుత్రపౌత్రాభివృద్ధించ దేహిమే రమే.** పూజకు సిద్ధం చేసిన స్థలంలో తమలపాకులోగాని, వెండి పళ్ళెంలో గాని, రాగి పళ్లెంలోగాని పసుపు గణపతిని పెట్టి, పూజ ప్రారంభించాలి. 'శుక్లాంభరం ధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం ప్రసన్న వదనం ధ్యాయేత్ సర్వ విఘ్నోపశాంతయే అని ఆదిదేవుని ప్రార్థించి అనంతరం మహాలక్ష్మిని వ్రతనియమానుసారంగా



పూజించి, నైవేద్యాన్ని భక్తితో సమర్పించవచ్చును. ఫలములు, పాయసము, పాలు తేనె మొదలైనవి సమర్పించవచ్చును. అలాగే పూజావిధిలో వస్త్రం సమర్పించేటప్పుడు పట్టు వస్త్రాన్నే సమర్పించనవసరం లేదు. అందుబాటులోని కొత్త వస్త్రం ఏదైనా సమర్పించేటప్పుడు పట్టు వస్త్రాన్నే సమర్పించనవసరం లేదు. అందుబాటులోకి కొత్త వస్త్రం ఏదైనా సమర్పించవచ్చును. ఆభరణ సమర్పణ విషయంలో కూడా స్వర్ణాభరణముల అవసరం లేదు. వాటి స్థానంలో మంచి పుష్పాలు సమర్పించవచ్చును. విధివిధానం ప్రకారం, భక్తితో, వరలక్ష్మిని పూజించినట్లయితే, సంపదలు సౌభాగ్యము సిద్ధిస్తాయి. పూజానంతరము సూత పౌరాణికుడు, శౌనకాది మహర్షులద్వారా పరమేశ్వరుడు పార్వతీదేవికి చెప్పిన చారుమతిదేవి కథను చదువవలెను. కథను చదివేటప్పుడు అక్షతలు చేతిలో నుంచుకొనవలెను. తరువాత అక్షతలు అమ్మవారి పాదాలవద్దనుంచి, వాటిని శిరస్సుపై ధరించవలెను. ఆ వరలక్ష్మీ దేవికి నవవిధ ప్రదక్షిణలు చేసినట్లయితే, ఒక్కొక్క ప్రదక్షిణకు ఒక్కక్క ఫలితము సంప్రాప్తిసుంది. మహాలక్ష్మి అనుగ్రహం కోసం ముత్తయిదువులకు వాయనం ఇవ్వవలెను.

**వాయన విధిః** ఏవం సంపూజ్య కల్యాణీం వరలక్ష్మీం స్వశక్తతః దాతవ్యం ద్వాదశాపూపం వాయనం పిద్విజాతయే!!

**వాయనదాన మంత్రముః** ఇందిరా ప్రతిగృహ్ణాతు ఇందిరా వైదదాతిచ, ఇందిరా తారకోభాభ్య మిందిరై నమో నమః

ఈ వాయనంలో పరావర్తనము చెందిన అనగా నానబెట్టిన శనగలు, రెండు పళ్ళు, అరటి పళ్ళు లేక నారికేళం, 5 తమలపాకులు, 2 వక్కలు, పదకొండు రూపాయల దక్షిణ, 5 లవంగాలు, 5 ఏలకులు, గాజులు, కాటుక, పసుపు, కుంకమలు, కలిగినచో చీర లేక జాకెట్టు, సిద్ధం చేసిన తోరంగ్రంది, పుష్పములు వాయనముగా దానమిచ్చి, వారినుంచి అమ్మవారి తరఫున ఆశీర్వచనం పొందవలెను.

**అనంతా వైష్ణవీ వ్యక్తా విశ్వానందా వికాసినీ**
**శక్తిర్విభిన్న సర్వార్తిః సముద్రపరితోషిణీ.**

సర్వం సన్మాంగళాని భవస్తు. సర్వం వరలక్ష్మీ దేవతార్పణమస్తు.

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

# అందంగా ముఖం



ముఖం అందంగా ఉండాలంటే పార్లర్ల వద్దకే వెళ్లాల్సిన పనిలేదు. మన ఇంట్లో దొరికే వాటితోనే చక్కటి నిగారింపును సొంతం చేసుకోవచ్చు. పైగా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అందుకోసం ముఖంపై కాస్త శ్రద్ధ పెట్టి ఇంట్లో ఉంటే సహజసిద్ధమైన వాటిని అప్లై చేసి మచ్చలేని చందమామలా ఉండే ముఖాన్ని సొంతం చేసుకుండి.

అందకు ఈ సింపుల్ రెమిడీస్‌ని ఫాలోకండి.

◆ రోజూ పెదవులకు కాస్తంత మీగడ రాసిన సున్నితంగా మర్దన చేస్తే పదవులు పగడలకుండా గులాబీ రేకుల్లా మెరుస్తాయి.

◆ ముఖాన్ని రోజుకు రెండు మూడుసార్లు గోరువెచ్చటి నీటితో కడుక్కుని పొడి టబల్‌తో చక్కగా తుడిచేస్తే మొటిమల వంటివిరావు.

◆ లేత కొబ్బరిని మెత్తగా మెదిపి ముఖానికి ప్యాక్‌లా వేసుకుని, ఆరిన తర్వాత కడిగేసుకుంటూ ఉండాలి. ఇలా చేస్తుంటే ముఖం చక్కగా అందంగా కనబడుతుంది.

◆ రకరకాల షాంపూల బదులు కుంకుడు కాయ రసం లేదా సీకాయ పొడితో తలస్నానం చేయడం వల్ల చుండ్రు, కేశ సంబంధమైన సమస్యలు రాకుండా జుట్టు ఆరోగ్యంగా నిగనిలాడుతుంది.

◆. తల స్నానం పూర్తయిన తర్వాత, చివరి మగ్గు నీటిలో కొంచెం నిమ్మరసం కలిపి తలమీద పోసుకుంటే జుట్టు, చర్మ సమస్యలు రావు. ❑

# శనగపప్పు పూర్ణం

**కావలసినవి** : శనగపప్పు, మినపగుండ్లు, బెలనం-1, కప్పు చొప్పున, బియ్యం-ఒకటింబావు కప్పు, ఉప్పు-తగినంత, నెయ్యి-చెంచా, యాలకుల పొడి-చిటికెడు, నూనె-వేగడానికి సరిపడా



**తయారీ** : మినపగుండ్లు, బియ్యం, శనగపప్పులను విడివిడిగా నానబెట్టాలి. 4 గంటల తర్వాత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్‌చేసి 2 గంటల తర్వాత ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేసి 2 గంటలు పక్కన ఉంచాలి. శనగపప్పును కుక్కర్‌లో 4 విజిల్స్ వచ్చే వరకు ఉడికించి, నీరు వడకట్టాలి. చల్లారాక పప్పు గుత్తితో మెదపాలి లేదా మిక్సీలో బరకగా వచ్చేట్లు గ్రైండ్ చేసుకోవాలి. అదే కుక్కర్‌లో పప్పుతో పాటు బెల్లం వేసి చిన్నమంట మీద కలుపుతూఉడికించాలి. ఇందులో యాలకుల పొడి వేసి, పిండి గట్టి పడుతున్నప్పుడు నెయ్యి వేసి దించాలి. చల్లారాక మనకు కావలసిన సైజులో ఉండలు చుట్టి, తయారు చేసుకున్న పిండిలో ముంచి కాగిన నూనెలో బంగారు రంగు వచ్చే వరకు వేయించాలి. ❑

# చిన్న మనసులపై భారం..

**పరీక్షలు దగ్గరికొస్తున్నాయి. ఆటలు చాలించు, ఫలానా ప్రశ్నకి సమాధానం చెప్పు, ఎన్నిసార్లు చదివించా? ఇంకా రాలేదా..** ప్రతి ఇంట్లో దాదాపుగా వినిపిస్తున్న మాటలే కదూ! కాస్త పెద్ద పిల్లలు పరీక్షలంటే భయపడతారని తెలుసు. కానీ మనం కంగారుపడి చిన్ని మనసులపైనా భారం పెంచేస్తున్నామని తెలుసా? వాళ్లకేం ఒత్తిడి అని తీసిపారేయక.. కొన్ని జాగ్రత్తలు పాటించమంటున్నారు నిపుణులు.



◆ మూడు, నాలుగు తరగతుల వరకూ పరీక్షలంటే చిన్నారులకు సాధారణ విషయమే! అమ్మో పరీక్షలు, మార్కులు తక్కువొస్తే అప్పుడు చెబుతా' అంటూ మనం కంగారుపడి, భయపెట్టడంతో వాళ్లూ దాన్నో బూచిలా చూడటం మొదలుపెడతారు. ఏడాదంతా చదివింది రివిజన్ చేయించాలన్నది మీ తాపనరతయం. నిజమే కానీ, ఆ చిన్న బుర్రలు ఆ సమాచారం మొత్తం నింపలేక ఎంత కంగారు పడతాయో గమనించారా? తీరా అసలు సమయానికి వచ్చే సరికి పొర పాట్లు చేస్తుంటారు.

◆ మనమేమో సీరియస్‌గా చెబుతుంటామా.. వాళ్లేమా అనాసక్తిగా, అయిష్టంగా రాయడం, చదవడం చేస్తుంటారు. అప్పుడు కోపం నషాళానికి అంటుతుంది కదూ! ఓసారి ఆలోచించండి. ఉదయాన్నే హడావుడిగా స్కూలుకి వెళ్లి. అన్ని గంటలు తరగతుల్లో కూర్చొని వస్తారు. ఇంటికి రాగానే గబగబా స్నానమంటూ బాత్రూమ్‌లోకి తరిమేస్తాం. ఏదో కొద్దిగా తినిపించి వెంటనే పుస్తకాలు పట్టుకోమంటే వాళ్లకి మాత్రం విసుగు రాదా?

◆ నీరసంగా, నిద్రమత్తుతో కనిపించడం లాంటివి కనిపిస్తే సరిగా తినట్లేదు, త్వరగా నిద్రపోవట్లేదు అని అరిచేస్తాం కానీ.. ఆ చిన్ని బుర్రదలు భారం మోయలేకపోతున్నాయి అనడానికి సంకేతాలే. అంతెందుకు, పట్టుమని పదేళ్లు లేని పిల్లలు నిద్ర రావట్లేదంటూ మారాం చేయడం, రాత్రుళ్లు పదే పదే లేవడం, పగలు క్లాసులో పడుకోవడం.. ఒత్తిడి సూచనలే.

◆ తలనొప్పి, కడుపులో నొప్పి అంటే సాకులు చెబుతున్నారని కొట్టిపారేయొద్దు. నేషనల్ హెల్త్ సర్వీస్ ప్రకారం.. పరీక్షల ఒత్తిడి వారి జీర్ణవ్యవస్థపై ప్రభావం చూపుతుందట. ఫలితమే కడుపుబ్బరం, నొప్పి, అజీర్తి వగైరాలన్నీ, కొందరిలో ఆకలి మందగించడం, వాంతులు, విరోచనాలకీ దారితీస్తుంది. మరేం

# రోజుకో పూట చపాతీ తినాలట !

బరువు తగ్గాలనుకునే వారు ప్రతి విషయంలోనూ ప్రత్యామ్నాయాల్ని వెతుక్కుంటుంటారు. రాత్రుళ్లు అన్నం మానేసి చపాతీ తీసుకోవడం కూడా ఇలాంటిదే! అయితే రాత్రి భోజనంలో చపాతీని భాగం చేసుకోవడం వల్ల బరువు తగ్గడంతో పాటు మరెన్నో ఆరోగ్య ప్రయోజనాల్ని సొంతం చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు ఒక్క రాత్రి పూట అనే కాదు.. రోజులో ఒకసారి చపాతీ తిన్నా కూడా సమాన ఫలితం ఉంటుందట! మరి చపాతీలో దాగున్న ఆ ఆరోగ్య రహస్యాలేంటో తెలుసుకుందాం.



**పోషకాల సమ్మేళనం...** చపాతీని పోషకాల సమ్మేళనంగా చూస్తున్నారు నిపుణులు. ఇందులో 'బి', 'ఇ' విటమిన్‌లతో పాటు కాపర్, జింక్, అయోడిన్, మాంగనీస్, సిలికాన్, పొటాషియం, క్యాల్షియం... వంటి ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. అంటే అన్ని రోజువారీ శరీరానికి కావాల్సిన పోషకాలను కొద్ది మొత్తంలో భర్తీ చేస్తాయన్నమాట! చపాతీలో ఉండే శక్తిని కార్బోహైడ్రేట్లు శరీరానికి అందిస్తాయి. వచ్చే రోజంతా ఉత్సాహంగా ఉండచ్చు. చపాతీల్లో ఉండే అధిక ఐరన్ స్థాయిలు శరీరంలో హెమోగ్లోబిన్ స్థాయుల్ని క్రమబద్ధీకరిస్తాయి. తద్వారా రక్తహీనత తలెత్తకుండా జాగ్రత్తపడచ్చు. చపాతీల్లో ఉండే జింక్, ఇతర ఖనిజాలు చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహకరిస్తాయంటున్నారు నిపుణులు. 4. ఇందులో ఉండే పీచు జీర్ణవ్యవస్థకూ మంచిదే! అజీర్తి, గ్యాస్, మలబద్ధకం.. వంటి జీర్ణ సంబంధిత సమస్యలున్న వారు నిపుణుల సలహా మేరకు రోజూ చపాతీని ఆహారంలో భాగం చేసుకోవడం ఉత్తమం. గుండె ఆరోగ్యానికీ చపాతీ మేలు చేస్తుందట! ఇందుకు దీనిలో అతి తక్కువ కొవ్వులుండడమే కారణమంటున్నారు నిపుణులు.

**పోషకాల సమ్మేళనం...** .చపాతీని పోషకాల సమ్మేళనంగా చూస్తున్నారు నిపుణులు. ఇందులో 'బి', 'ఇ' విటమిన్‌లతో పాటు కాపర్, జింక్, అయోడిన్, మాంగనీస్, సిలికాన్, పొటాషియం, క్యాల్షియం... వంటి ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. అంటే అన్ని రోజువారీ శరీరానికి కావాల్సిన పోషకాలను కొద్ది మొత్తంలో భర్తీ చేస్తాయన్నమాట!

చపాతీలో ఉండే శక్తిని కార్బోహైడ్రేట్లు శరీరానికి అందిస్తాయి. వచ్చే రోజంతా ఉత్సాహంగా ఉండచ్చు. చపాతీల్లో ఉండే అధిక ఐరన్ స్థాయిలు శరీరంలో హెమోగ్లోబిన్ స్థాయుల్ని క్రమబద్ధీకరిస్తాయి. తద్వారా రక్తహీనత తలెత్తకుండా జాగ్రత్తపడచ్చు. చపాతీల్లో ఉండే జింక్, ఇతర ఖనిజాలు చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించడంలో సహకరిస్తాయంటున్నారు నిపుణులు. ఇందులో ఉండే పీచు జీర్ణవ్యవస్థకూ మంచిదే! అజీర్తి, గ్యాస్, మలబద్ధకం.. వంటి జీర్ణ సంబంధిత సమస్యలున్న వారు నిపుణుల సలహా మేరకు రోజూ చపాతీని ఆహారంలో భాగం చేసుకోవడం ఉత్తమం. గుండె ఆరోగ్యానికీ చపాతీ మేలు చేస్తుందట! ఇందుకు దీనిలో అతి తక్కువ కొవ్వులుండడమే కారణమంటున్నారు నిపుణులు.

**ఇలా చేసుకోవాలట ...** చపాతీ ఆరోగ్యానికి మంచిదే కదా అని ఎక్కువ నూనె, నెయ్యితో చేసుకోవడం వల్ల శరీరంలో అనవసర కొవ్వులు చేరతాయంటున్నారు నిపుణులు. అందుకే వీలైనంత తక్కువ నెయ్యి/నూనెను వాడడం మంచిదంటున్నారు. అసలు ఈ రెండూ ఉపయోగించకుండా పుల్కా చేసుకొని తింటే మరీ మంచిదట!

◆ బయట దొరికే గోధుమపిండిలో మైదా కూడా కలిసి ఉంటుంది. కాబట్టి ముడిగోధుమలు తీసుకొని స్వయంగా పట్టించుకొని ఆ పిండితో చపాతీ చేసుకుంటే మంచిది. ◆ చపాతీకి జతగా రోజూ పప్పు, బంగాళాదుంప కర్రీ అని కాకుండా అన్ని రకాల కాయగూరలతో చేసిన కూరలు తీసుకోవడం వల్ల పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. ◆. బీన్స్, క్యారట్ ముక్కలు, పాలకూర.. వంటి వాటిని ఉడికించి.. గోధుమ పిండి కలిపేటప్పుడు అందులో వేసి చపాతీ చేసుకుంటే అటు రుచికి రుచి.. ఇటు ఆరోగ్యానికి ఆరోగ్యం. ◆. గోధుమపిండికి రాగి పిండి, సోయాబీన్ పిండి, చిరుధాన్యాలతో తయారుచేసిన పిండి వంటివి కూడా కలుపుకొని చపాతీ తయారుచేసుకోవచ్చు. ❑

# పోషకాల జామ..

**పులుపు, తీపి, వగరు** కలగలిపిన రుచిలో ఉండే జామ మనందరికీ పరిచయమే. ఉష్ణమండల ప్రాంతాల్లో విరివిగా పెరిగే ఈ పండులో శరీరానికి మేలు చేసే కీలక విటమిన్లు, ఖనిజాలూ పుష్కలంగా ఉంటాయి. ఇవి అనేక అనారోగ్యాలను నియంత్రించడమే కాదు.. మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలనూ పెంపొందిస్తాయని పలు పరిశోధనలు చెబుతున్నాయి. తాజాగా అమెరికా పోషకాహార సంస్థ చేసిన అధ్యయనంలో ఆశ్చర్య కరమైన ఫలితాలెన్నో కనిపించాయి. అధిక రక్తపోటుతో బాధపడుతోన్న కొంతమందికి పన్నెండు వారాల పాటు భోజనాలనికి ముందు ఓ జామ పండుని తినడానికి ఇచ్చారు. రోజూ వారి రక్తపోటుని పరిశీలించగా.. కనీసం 8-9 పాయింట్లు తక్కువ గ్లైసమెక్ ఇండెక్స్ ఉండే జామపళ్లు మధుమేహాన్ని పెరగకుండా చూశాయట. దీంతో పాటు హెచ్‌డిఎల్ కొలెస్ట్రాల్ ఎనిమిది శాతం పెరిగిందనీ చెబుతోంది. అధిక మోతాదులో లభించే విటమిన్-సి, లైకోపీన్, యాంటీ ఆక్సిడెంట్లు వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయి. మెగ్నీషియం ఇతర ఆహారం నుంచి పోషకాలను సరైన మోతాదులో స్వీకరించడానికి సాయపడు తుంది. ఇందులోని ఫోలిక్ యాసిడ్ సంతాన సామర్థ్యాన్ని పెంచడంతో పాటు గర్భస్థ శిశువు ఆరోగ్యాన్నీ మెరుగుపరు స్తుందట. అందుకే రోజూ తప్పనిసరిగా ఓ జామ



# దోమల బెడద తగ్గాలంటే..



వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా డెంగీ లాంటి విష జ్వరాలు వ్యాపిస్తాయి. అయితే వీటి బారిన పడకుండా ఉండడానికి మస్కిటో రిపెల్లెంట్, మస్కిటో మ్యాట్. అయితే వాటిలో ఉండే రసాయనాల వల్ల ఆరోగ్యానికి నష్టం వాటిల్లుతుందంటున్నారు నిపుణులు. మరి, వాటి అవసరం లేకుండా సహజ సిద్ధంగా దోమల బెడదను తగ్గించుకోవ డానికి కొన్ని చిట్కాలు ఇస్తున్నారు. అవేంటో తెలుసుకుందాం మస్కిటో కైల్స్ వెలిగించే బదులు.. సాయంత్రం కాగానే కిటికీలు, తలుపులు మూసి కాస్త కర్పూరం, వేపాకులు కలిపి పదిహేను నిమిషాల పాటు పొగ వేస్తే.. దోమలు ఇంట్లోకి రావంటున్నారు నిపుణులు. ఒకవేళ వేపాకులు లేకపోతే కర్పూరంతో పొగ వేసినా సరిపోతుంది. ఆరోమాల్యాండ్స్‌లో కర్పూరం, సాంబ్రాణి, వేప నూనె, యూకలిప్టస్ ఆయిల్, లెమన్ గ్రాస్ నూనె, లావెండర్ **నూనె..** వీటిలో ఏదైనా ఒకటి వేసి పెట్టుకుంటే.. ఇంట్లో పరిమళాలతో పాటు దోమల బెడద కూడా ఉండదు. నాలుగు వెల్లుల్లిపాయలను దంచి, ఏదైనా కొంచెం నూనె లేక నెయ్యితో పాటు కాస్తంత కర్పూరం కలుపుకొని వెలిగించుకుంటే ఆ పొగకు దోమలు నశిస్తాయట. ఇంటి చుట్టూ తులసి, వేప, యూకలిప్టస్.. వంటి చెట్లు ఉంటే దోమల బెడద కొంతవరకు తగ్గుతుందట. ఇంట్లో ఇంటి సమీపంలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త పడాలి. ❑



# టాస్ ఓడినా.. గెలుపు భారత్‌దే


## 15 మ్యాచ్‌ల్లో 13 విన్

**న్యూఢిల్లీ:** సాధారణంగా అంతర్జాతీయ క్రికెట్‌లో టాస్‌లు కీలక పాత్ర పోషిస్తుంటాయి. టాస్ గెలిచిన కెప్టెన్ పిచ్, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేయాలా, లేదంటే ఫీల్డింగ్ తీసుకోవాలా అనేది నిర్ణయించుకుంటాడు. టాస్ గెలిస్తే సగం మ్యాచ్ గెలిచినట్లే అనేది క్రికెట్‌లో భావిస్తారు. అయితే ఇటీవల కాలంలో భారత జట్టు తరుచుగా టాస్‌లు ఓడిపోతూ ఉంటుంది. దీంతో టాస్ ఓటమి భారత్‌కు పెద్ద బ్యాడ్ లక్‌గా వెంటాడుతోందనే ప్రచారం ఉంది. ఓవల్‌లో టాస్ ఓడటంతో అన్ని ఫార్మాట్లలో వరుసగా 15 మ్యాచ్‌ల్లో టాస్ ఓడిన జట్టుగా నిలిచింది. ఇందులో రెండు టీ20లు, 8 వన్డేలు, 5 టెస్టులు ఉన్నాయి. ఇలా అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో అత్యధిక సార్లు టాస్ ఓడిన జట్టుగా టీమిండియా నిలిచింది. అయితే భారత్‌కు మాత్రం టాస్



ఓటమే సగం గెలిచినట్లు లెక్క. ఇలా మొత్తం 15 మ్యాచ్‌లో టాస్ ఓడగా, వీటిలో 13 మ్యాచ్‌లో విజయం సాధించడం అదే టీమిండియాకు పెద్ద విక్టరీ. ఇటీవల ఇంగ్లాండ్‌తో లండన్‌లోని కెన్నింగ్టన్ ఓవల్ వేదికగా జరిగిన చివరి టెస్టు మ్యాచ్‌లోనూ భారత్ టాస్ ఓడిపోయింది. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత జట్టు ఇలా టాస్‌లు ఓడిపోవడం ఇది వరుసగా 15వ సారి కావడం గమనార్హం. ఈ మ్యాచ్‌లో అద్భుతంగా పోరాడిన భారత్ 6 పరుగుల తేడాతో విజయం సాధించి సిరీస్‌ను 2-2తో సమం చేసింది. ఈ ఏడాది జనవరిలో స్వదేశంలో ఇంగ్లాండ్‌తో పూణే వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్ ద్వారా భారత జట్టు టాస్ ఓడిపోవడం మొదలైంది. నాలుగో మ్యాచ్‌తో పాటు ఐదో టీ20 మ్యాచ్‌లోనూ భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ టాస్ ఓడిపోయాడు. అయితే ఈ 2 మ్యాచ్‌ల్లోనూ భారత్ వరుసగా 15, 150 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఇంగ్లాండ్‌తోనే జరిగిన మూడు వన్డేల సిరీస్‌లోనూ టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ టాస్‌లు ఓడిపోయాడు. వరుసగా మూడు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయాడు. ఈ మూడు మ్యాచ్‌ల్లో భారత్ విజయం సాధించి సిరీస్‌ను 3-0తో కైవసం చేసుకుంది. ఆ తరువాత ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఇదే కథ పునారవృతమైంది. ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ టీమ్ఇండియా టాస్ ఓడిపోయింది. ఈ ఐదు మ్యాచ్‌ల్లోనూ గెలిచి ఛాంపియన్స్ ట్రోఫీని ముద్దాడింది. ఇలా టాస్‌లు ఓడే పరంపరను ప్రస్తుత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా కంటిన్యూ చేశాడు. ఇంగ్లాండ్‌తో 5 మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో అన్ని మ్యాచ్‌ల్లోనూ టాస్ ఓడిపోయాడు. ఇందులో భారత జట్టు రెండు మ్యాచ్‌ల్లో గెలవగా మరో రెండు మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఓ మ్యాచ్‌ను డ్రా చేసుకుంది. ఓవరాల్‌గా టీమ్ఇండియా వరుసగా అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో టాస్ ఓడిపోయినప్పటికి కూడా మ్యాచ్‌ల్లో గెలుపొందడం విశేషం.

# మహిళల జావెలిన్ త్రోలో అన్నురాణికి స్వర్ణం




**న్యూఢిల్లీ:** మహిళల జావెలిన్ త్రోలో భారత క్రీడాకారిణి అన్ను రాణి సీజన్‌లో అత్యుత్తమంగా 62.59 మీటర్లు దూకి బంగారు పతకాన్ని గెలుచుకుంది. 32 ఏళ్ల అన్ను ప్రపంచ అథ్లెటిక్స్ కాంటినెంటల్ టూర్ కాంస్య స్థాయి మీట్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఆమె తన మొదటి ప్రయత్నంలోనే 60.96 మీటర్ల త్రో తో 60 మీటర్ల మార్కును తాకింది. ఆ త్రో భారత క్రీడాకారిణి పోటీని గెలవడానికి సరిపోయింది. కానీ ఆమె మరింత ముందుకు వెళ్లి, తన రెండవ ప్రయత్నంలోనే 62.59 మీటర్ల అత్యుత్తమ రికార్డును నమోదు చేసింది. పోటీలో తన చివరి త్రో తో అన్ను మరోసారి 60 మీటర్ల మార్కును చేరుకుంది. దీంతో 60.07 మీటర్లు నమోదు చేసింది. ఇక టర్కీకి చెందిన ఎడా తుగ్సుజ్ (58.36 మీ) రజత, ఆస్ట్రేలియాకు చెందిన లియానా డేవిడ్సన్ (58.24 మీ) కాంస్య పతకాలను గెలుచుకున్నారు. అన్ను 62.59 మీటర్లు విసిరి బంగారు పతకం సాధించడం వల్ల ఈ సీజన్‌లో ప్రపంచంలోని టాప్15 మహిళల జావెలిన్ త్రోయర్లలో ఆమె స్థానం సంపాదించింది. ఆమె ప్రస్తుతం 2025 ప్రపంచ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ప్రత్యక్ష అర్హత మార్కును సాధించింది. అలాగే భారత్‌కు చెందిన పూజ మహిళల 800 మీటర్ల పరుగులో మూడవ స్థానంలో నిలిచింది. ఈ రేసును పూర్తి చేయడానికి పుజకు 2:02.95 సమయం పట్టింది.

## 11 జాతీయ ఫ్రీడైవింగ్ ఈవెంట్‌లో..

# అర్చన అద్భుత రికార్డ్

## 40 మీటర్లు దాటిన భారత్ తొలి మహిళ రికార్డు



**న్యూఢిల్లీ:** మనాడో అప్నియా పోటీలో భారతదేశపు ప్రముఖ ఫ్రీడైవర్ అర్చన శంకర నారాయణన్ అద్భుత ప్రదర్శన చేసింది. ఈ ఫ్రీడైవింగ్ ఈవెంట్‌లో రెండు జాతీయ రికార్డులను బద్దలు కొట్టడం ద్వారా మరో మైలురాయిని సాధించింది. కాన్సంట్ వెయిట్ బై-ఫిన్స్ (సిడబ్ల్యుటిబి)లో అర్చన 38 మీటర్లు మరియు కాన్సంట్ వెయిట్ (సిడబ్ల్యుటి)లో అపూర్వమైన 40 మీటర్లు దూకి, పోటీ ఫ్రీడైవింగ్ ఈవెంట్‌లో 40 మీటర్ల మార్కును దాటిన మొదటి భారతీయ మహిళగా నిలిచింది. ఈ విజయం భారత్ మహిళా ఫ్రీడైవర్‌గా ఆమె లోతైన స్థానాన్ని అధిగమించింది.

అర్చన మొత్తం రికార్డు స్థాయిలో 11 జాతీయ టైటిళ్లకు చేరుకుంది. మనాడో ఈవెంట్ ఈ సంవత్సరం ఆమెకు మూడవ డెప్త్ పోటీ కాగా, మొత్తం మీద ఐదవది. అర్చన ఇటీవల భారతదేశపు మొట్టమొదటి మోల్చనోవ్స్ రాయబారిగా ఎంపికయ్యారు. ఫ్రీడైవింగ్ విద్య, పరికరాలలో ప్రపంచ సంస్థతో భాగస్వామ్యం కుదుర్చుకుంది. కాగా ఈ నెల 9 నుండి 10 వరకు బాలిలో జరిగే తులంబెన్ పూల్ గేమ్స్‌లో అధికారికంగా వ్యవహరించనుంది.

# నార్వే కప్: మినర్వాకు టైటిల్

## ఎస్ఐఎఫ్‌పై 14-1 గోల్స్ తేడాతో గెలుపు

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోనే అతి పెద్ద ఫుట్‌బాల్ టోర్నీని నెగ్గి మినర్వా అకాడమీ చరిత్ర సృష్టించింది. నార్వే కప్-2025లో పంజాబ్‌కు చెందిన మినర్వా అకాడమీ అబ్బురపరిచే ప్రదర్శనలతో టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్లో మినర్వా అకాడమీ ఎస్ఐఎఫ్‌పై 14-1 గోల్స్ తేడాతో గెలుపొందింది. మినర్వా తరపున దన మోని, రాజ్ హ్యాట్రిక్ గోల్స్ సాధించారు. చింగ్కే, కే చేతన్, పున్షిబా, అమర్సన్, అజమ్, రీసన్ గోల్స్ చేశారు. ఈ టోర్నీలో మినర్వా ఆది నుండి సంచలన ప్రదర్శనలు చేసింది. గ్రూప్ స్టేజిలో అలస్కా ఐఎల్‌పై 25-0, ఫోర్డ్ ఐఎల్-3పై 15-0, క్కొకెల్వ లాన్ ఐఎల్‌పై 22-0 గోల్స్ తేడాతో గెలుపొందింది. నాకౌట్ మ్యాచ్‌ల్లో రోగ్‌లాండర్స్‌పై ( రౌండ్ 32) 11-0, అమ్డాల్ టొక్కేపై (రౌండ్ 16) 17-0, క్వార్టర్ ఫైనల్లో ఫైల్లింగ్స్ డలెన్‌పై 18-1, సెమీస్‌లో రదథెల్ చరిఫ్ క్లబ్‌పై (పాలస్తీన్) 8-2 గోల్స్ తేడాతో నెగ్గి ఫైనల్‌కు చేరింది. ఈ టోర్నీలో మినర్వా 8 మ్యాచ్‌ల్లో నెగ్గి 130 గోల్స్ చేసింది.. ఈ యారప్ సీజన్‌లో భారత్‌కు చెందిన జట్లు మూడు టైటిళ్లను సాధించాయి. నార్వే కప్‌కు ముందు భారత్ జట్టు గోథియా కప్, డానా కప్‌లు గెలిచాయి.



# కోల్ ఇండియా ఓపెన్‌లో అమర్‌దీప్ ముందంజ

## రెండు షాట్‌ల తేడాతో ఆధిక్యం

**న్యూఢిల్లీ:** కోల్ ఇండియా ఓపెన్‌లో అమర్‌దీప్ మాలిక్ హాట్ పుటర్‌తో రెండు స్ట్రోక్‌లతో ముందంజలో నిలిచాడు. కెన్స్‌విల్లే గోల్ఫ్ కంట్రీ క్లబ్‌లో జరుగుతున్న నోయిడాకు చెందిన అమర్‌దీప్ (69-65) 65 ఏళ్లలోపు ఏడు కార్డులను తిరిగి ఇచ్చి, ఆ వారం మొత్తం 10 ఏళ్లలోపు కార్డులను 134కు చేర్చాడు. మాలిక్‌తో పాటు ఓవర్‌నైట్ జాయింట్ లీడర్‌గా ఉన్న చండీగఢ్‌కు చెందిన అంగద్ చీమా (69-67), రెండవ రోజు 67 పరుగులు చేసి 8 అండర్ 136తో రెండవ స్థానంలో నిలిచాడు. ఢిల్లీకి చెందిన శౌర్య భట్టాచార్య (71-66) రెండవ రోజు 66 పరుగులు చేసి 7 అండర్ 137తో మూడవ స్థానంలో నిలిచాడు. హాఫ్ వే కట్ ఐదు ఓవర్ల 149కి పడిపోయింది. 53 మంది ప్రొఫెషనల్స్ పాల్గొన్న ఈ టోర్నీలో అమర్‌దీప్ మాలిక్ 15 అడుగుల బర్డీ మార్పిడితో రోజును ప్రారంభించాడు. ఆ తర్వాత అతను వెనుక 9 స్థానాల్లో 8 నుండి 20 అడుగుల దూరం నుండి మరో నాలుగు బర్డీలను తీసుకున్నాడు. అమర్‌దీప్ పుటర్‌తో అతని హాట్ స్ట్రీక్ ఫ్రంట్‌తొమ్మిది స్థానాల్లో కొనసాగింది. అతను వరుసగా మొదటి మరియు మూడవ హోల్స్‌లో 25 అడుగుల నుండి బర్డీలను మరియు 50 అడుగుల నుండి మముత్‌ను ముగించాడు. పిజిటిఐలో రెండుసార్లు విజేత అయిన మాలిక్, 5, 6 స్థానాల్లో బోగీ, బర్డీతో తన రౌండ్‌ను ముగించాడు. కాగా ది ఓపెన్ కోసం క్వాలిఫైయింగ్ ఈవెంట్ ఆడిన అంగద్ చీమా, ఐదు బర్డీలు, రెండు బోగీలతో 40 అడుగుల ఈగిల్ కన్వర్షన్‌తో ముందుకు వచ్చాడు. ఈ రంగంలో ఏకైక అమెచ్యూర్ అయిన ఢిల్లీకి చెందిన రక్షిత్ దహియా (72-71) మొత్తం 143 పరుగులతో 12వ స్థానంలో నిలిచాడు.



# ఉద్యోగులకు గుడ్‌న్యూస్!


## 80%మంది టిసిఎస్ ఉద్యోగులకు వేతనాల పెంపు

**ముంబయి, ఆగస్టు 7:** దేశంలో ఐటిసేవల దిగ్గజ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తన ఉద్యోగులకువేతనాల పెంపును ప్రకటించింది. సెప్టెంబరు ఒకటినుంచి ఈ పెంపు అమలు అవుతోంది. జూనియర్, మధ్యస్థాయి ఉద్యోగుల్లో దాదాపు 80శాతం మందికి వేతనాల పెంపు ఉంటుందని వెల్లడించింది. 12 వేల మంది ఉద్యోగులను తొలగిస్తామని ప్రకటించినవేళ వేతనాల పెంపును ప్రకటించడం విశేషం. ఏస్థాయిలో వేతనాల పెంపు ఉంటుందనే అంశంపై కంపెనీనుంచి స్పష్టత రాలేదు. సీ3ఏ దాని సమానమైన గ్రేడ్‌లలో అర్హులైన అసోసియేట్స్‌కు వేతన సవరణ ఉంటుందని ఉద్యోగులకు పంపిన ఇమెయిల్‌లో టిసిఎస్ సిహెచ్ఆర్ఒ మిలింద్ లక్కడ్, కాబోయే సిహెచ్ఆర్ఓ కె.సుదీప్‌లు పేర్కొన్నారు. మరోవైపు ప్రస్తుత ఏడాది 12,261 మంది ఉదోనయగులను అంతర్జాతీయంగా తొలగించడానికి సన్నాహాలుచేస్తున్నట్లు టిసిఎస్ సిఇఒ కె కృతివాసన్ వెల్లడించిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ అనిశ్చితులు, ఎఐ టెక్నాలజీ మార్పులకారణంగానే ఈ తొలగింపులుచేస్తున్నట్లు తెలిపారు. మరోవైపు ఐటిరంగంలో అతిపెద్ద సంస్థ అయిన టిసిఎస్ లేఆఫ్‌లుచేపడుతుండటంతో ఇతర కంపెనీలు కూడా అదే బాటలో వెళ్లే అవకాశం లేకపోలేదన్న ఆందోళనలు కూడా వ్యక్తం అవుతున్నాయి.




# ఎల్ఐసి నికర లాభం రూ.11 వేల కోట్లు

**ముంబయి, ఆగస్టు 7:** ప్రభుత్వరంగ జీవితబీమా సంస్థ ఎల్ఐసి త్రైమాసిక ఫలితాలను వెల్లడించింది. తొలిత్రైమాసికంలో ఏకీకృత ప్రాతిపదికన ఐదుశాతం వృద్ధితో రూ.10,987కోట్ల నికరలాభం నమోదుచేసింది. సమీక్ష త్రైమాసికంలో నికర ప్రీమియంల ఆదాయం ఐదుశాతం వృద్ధిని నమోదుచేసి రూ.1.19 లక్షలకోట్లు వచ్చినట్లు తెలిపింది. వ్యక్తిగత, బిజినెస్ ప్రీమియంల పెరుగుదల కారణంగా ప్రీమియం వసూళ్లపెరిగాయి. ఐఆర్‌డిఎఐ డేటా ప్రకారం తొలిప్రీమియం వసూళ్లలో ఎల్ఐసి 63.51శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో ఉంది. తొలిత్రైమాసికంలో వ్యక్తిగత ప్రీమియం రాబడులు ఆరుశాతం వృద్ధితో 71,474 కోట్లుగా నమోదయింది. గ్రూప్ ప్రీమియం ఆదాయం 2.46శాతంపెరిగి రూ.47,726 కోట్లుగా ఉంది. ఎల్ఐసి తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించిన వివరాలప్రకారం క్యూవన్‌లో కొత్తపాలసీల అమ్మకాలు గతంతోపోలిస్తే 14.75శాతం క్షీణించాయి. ఈ సారి 30.39 లక్షల పాలసీలను విక్రయించింది. జూన్‌తోముగిసిన త్రైమాసికంలో ఎల్ఐసి నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తులవిలువ ఆరుశాతం పెరిగి రూ.57.05 లక్షలకోట్లకు చేరింది. ఎల్ఐసి తీసుకువచ్చిన బీమా సఖియోజనపరిధిలో జూన్ 30 నాటికి 1.99 లక్షలమంది మహిళా ఏజెంట్లను నియమించామని ఎల్ఐసి ఎండి సిఇఒ దొరైస్వామి తెలిపారు. ఫలితాల వెల్లడి క్రమంలో ఎల్ఐసి షేరు విలువ స్వల్పంగా క్షీణించి రూ.886 వద్ద ముగిసింది.




## యుఎస్‌లో యాపిల్ పెట్టుబడులు

# 100 బిలియన్ డాలర్లు

## ట్రంప్‌తో పడలేక రాజీకొచ్చిన ఐఫోన్ సిఇఒ టిమ్‌కూక్



**సియాటెల్, ఆగస్టు 7:** దేశాధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ దేశాలపై ఇష్టం వచ్చినట్లు పన్నులు వేస్తున్న వేళ టెక్ దిగ్గజం యాపిల్ ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. అమెరికాలో అదనంగా 100 బిలియన్ డాలర్లు అంటే రూ.8.7 లక్షలకోట్లు పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది. ఈ సొమ్ముతో దేశీయంగా పంపిణీ వ్యవస్థ గొలుసుకట్టును వృద్ధిచేస్తామని ప్రకటించింది. యాపిల్ భారత్‌లో ఉత్పత్తి పెంచుతున్నదని ఇటీవలికాలంలో ట్రంప్ గుర్రుగా ఉన్నారు. శ్వేతసౌధం ప్రతినిధిటైలర్‌రోజర్స్ మాట్లాడుతూనేడు యాపిల్‌తో కలిసి చేస్తున్న ప్రకటన మా తయారీ రంగానికి అతిపెద్ద విజయం అన్నారు. అమెరికా ఆర్థిక, జాతీయ భద్రత ప్రయోజనాలను కాపాడేలా కీలక పరికరాలు దేశీయంగా ఉత్పత్తిచేయడానికి ఉపకరిస్తుందని అన్నారు. టిమ్‌కూక్ తాజా ప్రకటనతో అమెరికాలో యాపిల్‌పెట్టుబడుల హామీలు 600 బిలియన్ డాలర్లకు చేరింది. గతంలో ఆకంపెనీ 500 బిలియన్ డాలర్లకు హామీ ఇచ్చిన అంశం తెలిసిందే. భారత్‌లో ఉత్పత్తిని పెంచాలని యాపిల్ తీసుకున్న నిర్ణయంలో కొంత ఇబ్బంది ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఖతార్‌లో ఆయన ఒక సదసుసలో మాట్లాడుతూ ఈమాటలు సిఇఒ టిమ్‌కుక్ ముఖంమీదే చెప్పారు. భారత్‌లో తయారీని కొనసాగిస్తామని యాపిల్ సిఇఒ టిమ్‌కుక్ ఎర్నింగ్‌కాల్ సందర్భంగా ప్రకటించారు. భారత్‌పై ట్రంప్ అదనంగా 25 శాతం పన్ను విధించినరోజే యాపిల్ తన నిర్ణయం ప్రకటించింది. కాగా కొతనత టానయరిఫ్‌లు మరో 21రోజుల్లో అమలులోకి రానున్నాయి. దీనితో భారత్‌పై అమెరికా విధించిన పన్నులశాతం 50కి చేరింది. యాపిల్ సిఇఒ టిమ్‌కుక్ అధ్యక్షుడు ట్రంప్‌నకు ప్రత్యేకగిఫ్ట్ ఇచ్చారు. ప్రత్యేక యాపిల్ గుర్తు ఉన్న ఓ గాచు ఫలకాన్ని 24 క్యారెట్ల బంగారం బేస్‌పై ఉంచిన ప్రతిమను అందించారు. ఈ గాజు గుర్తును అమెరికా మెరైన్‌కోర్‌లోపనిచేసిన యాపిల్ ఉద్యోగి ఒకరు రూపొందించినట్లు టిమ్‌కూక్ తెలిపారు.

# ఐదేళ్లుగా జీతం తీసుకోని ముకేశ్ అంబాని!



**ముంబయి, ఆగస్టు 7:** రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్‌ముకేష్ అంబాని వరుసగా ఐదో సంవత్సరం కూడా ఒక్కరూపాయి కంపెనీనుంచి వేతనంగా తీసుకోలేదు. కరోనా కుదిపేసిన ప్పటినుంచి ఆయన జీతం తీసుకోడం ఆపేసారు. ముకేష్ వారసులుకూడా ఎలాంటి వేతనం తీసుకోనప్పటికీ బోర్డుసభ్యులుగా సిట్టింగ్ ఫీజు, కమీషన్‌రూపంలో కొంత మొత్తం తీసుకున్నారు. రిల్ వార్షిక నివేదికలోనే ఈ వివరాలు వెల్లడించారు. కరోనా కారణంగా వార్షిక వేతనాన్ని స్వచ్ఛందంగా వదులుకుంటున్నట్లు అంబాని 2021-22లోనే ప్రకటించారు.

కరోనా ముందువరకూ వార్షిక పరిహారం అందుకున్నా గరిష్టంగా రూ.15 కోట్లే తీసుకోవాలని పరిమితులు పెట్టుకున్నారు. ప్రస్తుతం రిల్‌ఛైర్మన్‌గా ఉన్న ఆయన 2029 ఏప్రిల్‌వరకూ ఆపదవిలో ఉంటారు. వేతనమే కాకుండా ఇతర అలవెన్సులు,ముందస్తు ఖర్చులు రిటైర్‌మెంట్‌ప్రయోజనాలు, కమీషన్లు, స్టాక్ ఆప్షన్‌లను కూడా పొందలేదు. ముకేశ్‌ప్రయాణం, లాడ్జింగ్, బోర్డింగ్ వ్యాపార పర్యటనలకయ్యే ఖర్చులుమాత్రం కంపెనీనే భరిస్తుంది.

ముకేశ్‌తోపాటు ఆయన కుటుంబానికి భద్రతకయ్యే ఖర్చుకూడా కంపెనీయే భరిస్తుంది. ముకేశ్‌కుమార్తె, కుమారులు ఆకాశ్, అనంత్, ఈశాలు రిలయన్స్ బోర్డులో నాన్ ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్లుగా వచ్చారు. ఒక్కొక్కరు సిట్టింగ్‌ఫీజుకింద రూ.0.06కోట్లు, కమీషన్‌కింద రూ.2.25 కోట్లు తీసకుఉన్నారు. ఇతర డైరెక్టర్లు నిఖిల్ ఆర్ మెస్వాని, హితల్ ఆర్ మెస్వాని రూ.ప25 కోట్లుపొందారు. 2023లో ముకేశ్ సతీమణి నీతా అంబాని బోర్డునుంచి వైదొలిగారు. ఆమెకు ఆర్థికసంవత్సరంలె కంపెనీ రూ.0.02 కోట్లు, సిట్టింగ్‌ఫీజు, 0.97 కోట్లు కమీషన్‌కింద ఇచ్చింది.

# దీర్ఘకాలంలో ట్రంప్ సుంకాల ఎఫెక్ట్!

## ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



**ముంబయి, ఆగస్టు 7:** భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల బాదుడుపై ఆర్బీఐ మాజీ గవర్నర్ ఆర్తికవేత్త దువ్వూరి సుబ్బారావు స్పందించారు. ఈ ప్రభావం ప్రస్తుతం లేకపోయినా మధ్యస్థంగాను, దీర్ఘకాలంలో అధిక ప్రభావం ఉంటుందన్నారు. రష్యా చమురుకొనుగోళ్లు సాకుగా చూపించి భారత్‌పై మరో 25శాతంసుంకం విధించిన ట్రంప్ ఉత్తర్వులపై దువ్వూరి స్పందించారు. భారత జిడిపిలో ఎగుమతుల వాటా 22శాతంగా ఉంది. మొత్తం ఎగుమతుల్లో అమెరికా వాటా 17శాతం. భారత్ ఉత్పత్తులపై 50శాతం సుంకాలవల్ల జిడిపిపై 50బేసిస్‌పాయింట్లప్రభావం పడే చాన్స్ ఉంది. జిడిపి వృద్ధిరేటు 50 బేసిస్‌పాయింట్లమేర నెమ్మదించి ఆరులేదా 6.1శాతంగా నమోదు అవుతుందని వెల్లడించారు. వేగంగా వృద్ధిచెందుతున్న ఆర్థికవ్యవస్థ కావడం వల్ల 50 బేసిస్ పాయింట్లను కోల్పోవడం అనేది పెద్ద లెక్కకాదు. ఏడాదిపాటు ఈభారాన్ని భారత్ మోస్తుందని ఏడాదికి మించితే 50బేసిస్ పాయింట్ల భారం అనేది భారత లక్ష్యాలపై ప్రభావం చూపిస్తుందన్నారు. 2047 నాటికి అభివృద్ధిచెందిన దేశాల సరసన నిలవాలన్న వికసిత భారత్ లక్ష్యాలకు ఇది ఆటంకంగా మారవచ్చని అన్నారు. అమెరికా ట్యారిఫ్ వల్ల ఎకానమీ కంటే కూడా చిన్న ఆదాయ వర్గాలపై ఎక్కువ ప్రభావం ఉంటుందన్నారు. అలాగే రష్యానుంచి కాకుండా సౌదీ అరేబియా వంటి దేశాలనుంచి చమురు కొనుగోళ్లజరిపితే ద్రవ్యోల్బణం పెరుగుతుందని దీనితో పెద్దసంఖ్యలో తక్కువ ఆదాయం కల కుటుంబాలపై ప్రభావం పడుతుందన్నారు. మొత్తం ఆర్థికవ్యవస్థ ప్రభావితం అవుతుందన్నారు. మరోవైపు అమెరికాతో వాణిజ్యం విషయంలో ముమ్ముందు ఏం జరుగుతుందనే దానితోసంబంధం లేకుండా వివిధ దేశాలకు మన ఎగుమతులనుపెంచుకోవాల్సిన అవసరం ఉందని దువ్వూరి అన్నారు. మరిన్ని దేశాలతో స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందాలతో ట్రంప్ సుంకాలను అధిగమించవచ్చన్నారు.

# లాభాల్లో స్టాక్ మార్కెట్లు

## సెన్సెక్స్, నిఫ్టీలకు 'సుంకాల' ఎఫెక్ట్ నిల్

**ముంబయి, ఆగస్టు 7:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల బాదుడును మన స్టాక్ మార్కెట్లు పెద్దగా ప్రభావితంకాలేదు. రష్మా చమురుసాకుగా చూపించి భారత్‌పై25శాతం అదనపు సుంకాలు వడ్డిస్తున్నట్లు ట్రంప్‌ప్రకటించినా ఆరంభంలో భారీ నష్టాలు చవిచూసిన మార్కెట్‌సూచీలు చివరిలోకొనుగోళ్ల మద్దతుతో మళ్లీ అదేస్థాయిలో పుంజుకుని లాభాల సూచీల్లోకి వెళ్లాయి. ఐటి, ఫార్మా స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. భారత్‌ను దారికి తెచ్చుకోవడం, ట్రేడ్ డీల్‌లోపైచేయి సాధించడానికి ట్రంప్‌వేస్తున్న ఎత్తుగడ అని అప్పటికే మార్కెట్‌కు అర్థం అయిందని నిపుణులు పేర్కొంటున్నారు. దీనితోపాటు ఇరుదేశాలమధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం కుదరవచ్చన్న అంచనాలు కారణంగానే ట్రంప్ బెదిరింపులను మార్కెట్ పెద్దగా పట్టించుకోలేదని చెపుతున్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థపై ఇన్వెస్టర్లకు ఉన్న విశ్వాసం కూడా మరో కారణమని, ఈకారణంగానే రెండురోజుల వరుసనష్టాలనుంచి సూచీలు అధిగమించినట్లు చెప్పుకొచ్చారు. ఇట్రాడే కనిష్టాలనుంచి సెన్సెక్స్ 800 పాయింట్లమేర పైకిరావడం విశేషం అన్నారు. ట్యారిఫ్ భయాలతోసెన్సెక్స్ ఉదయం 80,262.98 పాయింట్లతో ప్రారంభం అయింది. తొలిట్రేడింగ్‌లో భారీ నష్టాలతో ఉన్న సూచీ ఇంట్రాడేలో 79,811.29వద్ద కనిష్టంకు వెళ్లింద.ఇ చివరిలోభారీగాపుంజుకుని 79.27 పాయింట్ల లాభంతో 80,623.26 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీకూడా 21.95పాయింట్ల లాభంతో 24,596.15వద్దముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 87.69గా కొనసాగింది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్ర, హెచ్‌సిఎల్, టెక్నాలజీస్, ఎటెర్నల్, యాక్సిస్‌బ్యాంక్, మారుతిసుజుకి లాభాల్లోముగిసాయి. ఆదాని పోర్టులు, ట్రెంట్ టాటామోటార్స్, హిందూస్థాన్ యూనిలీవర్, ఎన్టీపీసీ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయవ ఇపణిలో బ్రెంట్‌క్రూడ్ బ్యారెల్‌దర రూ.67.30డాలర్లవద్దట్రేడ్ అవుతుంటే బంగారం ఔన్స్ ఒక్కింటికి 3451 డాలర్లవద్ద కొనసాగింది.



Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.